# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 25-1-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:136 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

పనికి పక్క
ఉత్తమ గోల్డు ముక్క
కీర్తి పతకం

పాతకు మెట్రో
కలల్లో పరుగులు
పేక మేడలు

కాల యాపన
రేషన్ కార్డుల జారి
ఓ పీర ముడి

ప్రణాళికలు
ప్రజల పురోగతి
సాగని గతి

గుడ్డు పోయింది
గద్దుకాలం వచ్చింది
పిల్లల పాట్లు



- రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

తొందరెందుకు అప్పుడే
వంద రోజులో చేస్తం !
అమలు కాక పోతేనేం
ఐదేండ్ల దాక చూస్తం.

చెబుతుంటే వినకపోతె
చెడామడా తిట్టుడే !
రైతుబంధు రాలేదనిన
..తోని కొట్టుడే !



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

## సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తాం- డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్, జనవరి 24:దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలను మెరుగుపరచడానికి ఉత్పత్తి రంగంలో ఉన్నటువంటి వ్యవసాయం నుంచి పారిశ్రామికీకరణ వైపు నడిపించడానికి గత ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రణాళికలు దేశాన్ని ముందుకు నడిపిస్తున్నాయన్నారు రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క. మైక్రో స్మాల్ మీడియం ఎంటర్ ప్రైజెస్ డెవలప్మెంట్ అండ్ ఫెసిలిటేషన్ ఆధ్వర్యంలో నేడు టూరిజం ప్లాజాలో నిర్వహించిన వెండర్స్ డెవలప్మెంట్ కార్యక్రమానికి ముఖ్య అతిథి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సువిశాలమైన భారతదేశంలో ఎన్ని వ్యత్యాసాలు ఉన్నప్పటికిని ఉత్పత్తి రంగాలన్నింటినీ పంచవర్ష ప్రణాళికలు గానీ మిశ్రమ ఆర్థిక వ్యవస్థలు దేశ పురోగతిలో కీలక పాత్రను పోషిస్తున్నాయన్నారు. ప్రపంచీకరణ సరళీకరణ వచ్చిన తర్వాత దేశంలోకి వచ్చిన తర్వాత మల్టీ నేషనల్ కంపెనీలు మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ ను మింగేశాయని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. వెల్త్ ఒకే చోట ఉండటం ప్రజాస్వామ్యానికి, సమాజానికి ప్రమాదకరమని అంటూ మైక్రో స్మాల్ ఇండస్ట్రీస్ ను ఇందిరమ్మ రాజ్యం కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని చెప్పారు. ఉద్యోగ ఉపాధి కల్పన సమానత్వం సామాజిక న్యాయం వృద్ధిరేటు పెరగడానికి ఎంఎస్ఎంఈ తోడ్పాటు అవుతుంది అని తెలిపారు.

భూతద్దంలో పెట్టి వెతికిన మల్టీ నేషనల్ కంపెనీల వల్ల సామాజిక న్యాయం సమానత్వం ఉద్యోగ ఉపాధి కల్పన కనిపించదు అని చెప్పారు.. మల్టీ నేషనల్ కంపెనీలతోనే అభివృద్ధి సాధ్యం అన్నది గ్లోబల్స్ ప్రచారం మాత్రమేనని అయన అభిప్రాయపడ్డారు.. ఇండస్ట్రియల్ క్లస్టర్స్ ను పెంచుతామని, ప్రభుత్వ పరంగా ప్రోత్సహకాలు ఇస్తామని హామీ ఇచ్చారు.. ఇండస్ట్రియల్ క్లస్టర్స్ పెంచి యువ పారిశ్రామికవేత్తలకు ఆర్థికంగా, మేధోపరంగా సహకారం అందిస్తే పెద్ద ఎత్తున ఉద్యోగ ఉపాధి కల్పన పెరుగుతుందని అన్నారు. దీని వల్ల దేశ వృద్ధిరేటు పెరగడానికి దోహదపడుతుంది అని ఆయన పేర్కొన్నారు.

వనరులు సమానంగా పంచి, సంపద సృష్టించే రంగాల్లో అందరిని భాగస్వాములు చేయడం వల్లనే సమ సమాజ స్థాపన జరుగుతుందని తెల్పి చెప్పారు. సంపద సృష్టించే రంగాల్లో అందరిని భాగస్వామ్యం చేయకుంటే దేశంలో అసమానతలు పెరిగిపోవడం ఈ సమాజానికి, ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. ఎస్సీ, ఎస్టీ యువ పారిశ్రామికవేత్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రాధాన్యత ప్రోత్సాహకాలు అందిస్తుందని వెల్లడించారు?. సూక్ష్మ, లఘు, మధ్య తరహా పరిశ్రమలకు మరిన్ని రాయితీలు, ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ఈ ప్రభుత్వం సిద్ధంగానే ఉంటుంది అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## అగ్రంపాడ్ జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన సిపి



హైదరాబాద్, జనవరి 24:వచ్చే నెల లో జరగబోయే అగ్రంపాడ్ సమ్మక్క -. సారలమ్మ జాతర ఏర్పాట్లను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ పరిశీలించారు. ఈ రోజు ఉదయం అగ్రంపాడ్ సమ్మక్క సారలమ్మ గద్దెల వద్దకు చేరుకున్న వరంగల్ పోలీస్ కమిషనర్ ను ఆలయ అధికారులు, పూజలు ఘన స్వాగతం పలికారా ఇరువురు అమ్మవార్ల గద్దెల వద్ద పోలీస్ కమిషనర్ ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం జాతర సంబంధించి పోలీస్ బందోబస్తు ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ పరిశీలించందంతో పాటు వాహన పార్కింగ్, క్యూ లైన్లు, పోలీస్ సిబ్బంది వసతులకు కంట్రోల్ రూం ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.


**గుడెప్పాడు క్రాస్ రోడ్డు పరిశీలించిన సిపి**

త్వరలో జరగబోయే మేడారం జాతర పురస్కరించుకొని గుడెప్పాడ మీదుగా కొనసాగే వాహనాలు రాకపోకలను ఎలాంటి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ పోలీస్ అధికారులతో పాటు ట్రైనీ ఐ.పి.ఎస్ శుభం నాగ్ కు సూచనలు, సలహాలను అందజేశారు.

బాధితులకు సత్వరమే న్యాయం చేయాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ స్టేషన్ వచ్చి ఫిర్యాదులు అందజేసే పిర్యాదులపై స్టేషన్ అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా రీసెప్షన్, కమాండ్ కంట్రోల్ రూం తో స్టేషన్ లోని వివిధ విభాగాల్లో అధికారులు, సిబ్బంది పనితీరును పోలీస్ కమిషనర్ ఆరా తీయడంతో పాటు, పలు సూచనలు చేశారు. ఈ తనిఖీల్లో ట్రైనీ ఐ. పి. ఎస్ శుభం నాగ్, ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ రవిరాజ్, యం. ఆర్. ఓ జగన్ మోహన్, ఇ. ఓ శేషగిరి ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

**చురక**


అందుబాటులెన్నున్నా
అనుభవించ లేనోళ్లు
బ్రతుకంతా విలపిస్తూ
బాధపడే పిరికివాళ్లు.
మహాసృష్టి ఇహంలోనా
మనిషి జన్మ గొప్ప వరం
అగుపించని పరంపైన
అంత ఏలా భ్రాంతి స్వరం



-వేల్పుల నారాయణ
9440433475

**నేటి కందం- నేటికి అందం**

నేటి ప్రజాస్వామ్యమ్మును
దీటుగ నిలబెట్టగలుగు తేజోమయుడౌ
ఓటరు దినోత్సవమ్మును
పాటుగ జరిపింప వలయు ప్రజలెల్ల మోగిన్
(జనవరి 25 జాతీయ ఓటరు దినోత్సవం)



-రాధశ్రీ
సెల్:9494481210

## నకిలీ నోట్లతో మోసం చేస్తున్న ఇద్దరు విదేశీయుల అరెస్ట్ : సీపీ సుధీర్ బాబు

హైదరాబాద్, జనవరి 24:నకిలీ నోట్ల తో ప్రజలను మోసం చేస్తున్న ఇద్దరు విదేశీయులను మల్కాజిగిరి ఎస్వోటీ పోలీసులు అరెస్ట్ చేశారని రాచకొండ సీపీ సుధీర్ బాబు తెలిపారు. బుధవారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి లక్షకు ఐదు లక్షలు ఇస్తామని చెప్పి ఆశ కల్పిస్తారన్నారు. బాధితుల నుంచి డబ్బు తీసుకున్నాక వారిపై మత్తు మందు చల్లి పారిపోతారని పేర్కొన్నారు.నకిలీ నోట్ల ముఠాలో మరో ము గ్గురు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితులు ఇద్దరు కామెరాన్, మాలి దేశస్థులుగా గుర్తించామన్నారు. బోడుప్పల్ వాసి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టామ న్నారు. నిందితుల వద్ద నుంచి రూ. 25 లక్షల నకిలీ నోట్లతో పాటు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దీని వెనుక ఇంకా ఎంతమంది ఉన్నారో విచారణ చేస్తామని సీపీ పేర్కొన్నారు.

## రాష్ట్రంలోని విద్యార్థులందరికీ రక్త పరీక్షలు నిర్వహిస్తాం-మంత్రి దామోదర రాజనరసింహ



అందోల్, జనవరి 24: తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హై స్కూళ్లలో చదువుతున్న ప్రతి ఒక్క విద్యార్థికి రక్త పరీక్షలు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. రక్త హీనత తక్కువగా ఉంటే అందుకు కావలసిన ఐరన్ టాబ్లెట్ లు ఇస్తామన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అందోల్ నియోజకవర్గంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ నేడు పర్యటించారు.

ఈ సందర్భంగా ఆయన వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రక్త హీనత తక్కువగా ఉన్న వారి కోసం రాష్ట్ర స్థాయిలో మొదటి కార్యక్రమం ఆందోల్ నియోజకవర్గంలో ప్రారంభించామన్నారు. రక్తహీనత తక్కువగా ఉన్న విద్యార్థులు ఐరన్ స్థాయి ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు.

కాగా, ఉమ్మడి మెదక్ జిల్లా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డిని కలవడంపై ఆయన స్పందిస్తూ, తెలంగాణ పౌరులు, ప్రజా ప్రతినిధులు ఎవరైనా కానీ తమ సీఎంని కలవొచ్చు అని తెలిపారు. కలిసిన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు అని జరుగుతున్న ప్రచారంపై నాకు సమాచారం లేదు అని ఆయన చెప్పుకొచ్చారు. సమస్యలపై మా ప్రభుత్వాన్ని వచ్చి ఎవరు కలిసిన తాము దానికి స్పందిస్తామన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం కాంగ్రెస్ ప్రభుత్వం అందరికి అందుబాటులో ఉంటుందని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

## లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఒంటరిగా పోటీ

**-బాంబు పేల్చిన మమతా బెనర్జీ**

**-అప్రమత్తమైన కాంగ్రెస్.. మమత లేకుండా కూటమిని ఊహించలేం: రాహుల్**

న్యూ ఢిల్లీ జనవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూస్):రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఒంటరిగా పోటీ చేస్తుందని బెంగాల్ సీఎం మమత బెనర్జీ బాంబు పేల్చడంతో కాంగ్రెస్ అప్రమత్తమైంది. మమత బెనర్జీ లేకుండా కూటమిని ఊహించలేమని ఆ పార్టీ స్పష్టం చేసింది. దీదీతో పొత్తు చర్చలు కొనసాగుతున్నాయని పేర్కొంది. ఇక అంతకుముందు రాహుల్ గాంధీ సైతం మమత బెనర్జీ తనకు అత్యంత సన్నిహితురాలని లోక్‌సభ ఎన్నికల్లో బెంగాల్‌లో టీఎంసీతో కలిసి పోటీ చేస్తామని, ఈ దిశగా పొత్తు చర్చలు సాగుతున్నాయని అన్నారు.అయితే బెంగాల్‌లో కాంగ్రెస్ దీదీ సహకారం లేకుండా స్వతంత్రంగా పోటీ చేయాలని కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అవకాశవాది అయిన మమత బెనర్జీ పార్టీతో కలిసేది లేదని ఆయన వ్యాఖ్యానించారు. అధీర్ రంజన్ వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా వాటిని పట్టించుకోవాల్సిన అన్నారు. ఇక కాంగ్రెస్ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ గట్టి షాక్ ఇచ్చారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో ఒంటరిగానే పోటీ చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు.గాల్‌లో సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్‌తో ఎలాంటి చర్చలూ జరపలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీని ఒంటరిగానే ఎదుర్కొంటామని చెప్పారు. ఫలితాల తర్వాతే పొత్తులపై తుది నిర్ణయం ఉంటుందని దీదీ వెల్లడించారు.మరోవైపు రాహుల్ యాత్ర పై కూడా దీదీ స్పందించారు. ఇండియా కూటమిలో ఉన్నప్పటికీ రాహుల్ యాత్రపై మాకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. రాష్ట్రం మీదుగా రాహుల్ యాత్ర సాగుతుంది.. అయినా మాకు సమాచారం ఇవ్వలేదు అని దీదీ కాంగ్రెస్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ఏప్రిల్ 16న లోక్‌సభ ఎన్నికలు.. రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ

**- అధికారులకు రిఫరెన్స్ కోసమే ఆ తేదీ.వివరణ ఇచ్చిన సీఈవో**

న్యూ ఢిల్లీ జనవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఏప్రిల్ 16ను లోక్‌సభ ఎన్నికలకు రిఫరెన్స్ తేదీగా పేర్కొంటూ ఢిల్లీ ఎన్నికల ప్రధాన అధికారి జారీచేసిన ఓ అంతర్గత నోట్ రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీయడమే కాకుండా వైరల్‌గా మారింది.

ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు ఉంటాయని, ఏప్రిల్ 16ను తాత్కాలిక తేదీగా భావించి ఎన్నికలకు ఏర్పాట్లు చేసుకోవాలంటూ ఆదేశాల్లో పేర్కొన్నారు.

ఐతే ఈ నోట్ పై ఢిల్లీ సీఈవో కార్యాలయం వివరణ ఇస్తూ అధికారులకు రిఫరెన్స్ కోసమే ఆ తేదీ అని పేర్కొంది. దీని పై స్పష్టత ఇవ్వాలంటూ జర్నలిస్టులు, మీడియా సంస్థలు ఢిల్లీ సీఈవో కార్యాలయాన్ని సంప్రదించాయి. దీంతో ఢిల్లీ సీఈవో కార్యాలయం 'ఎక్స్' వేదికగా వివరణ ఇచ్చింది. కేంద్ర ఎన్నికల సంఘం ప్లానర్ ప్రకారం పోలింగ్ ఏర్పాట్లు చేసుకునేందుకు జిల్లా రిటర్నింగ్ అధికారులకు రిఫరెన్స్ కోసమే ఆ తేదీని సర్క్యులర్‌లో పేర్కొన్నట్టు స్పష్టం చేసింది. గత సార్వత్రిక ఎన్నికలను పరిశీలిస్తే.. కేంద్ర ఎన్నికల సంఘం 2019 మార్చి 10న ఎన్నికల షెడ్యూల్ ప్రకటించింది. ఏప్రిల్ 11న మొదలైన లోక్‌సభ పోలింగ్, ఏడు దశల్లో సాగింది. ఆ ఏడాది మే 23న ఓట్ల లెక్కింపు చేపట్టింది.

## కణిక ఆధ్వర్యంలో శ్రీరామ కథ ఆడియో ఆవిష్కరణ

హైదరాబాద్, జనవరి 24:కణిక సాహిత్య సమాజ విద్య అభివృద్ధి లక్ష్యంగా, హైదరబాద్ వాస్తవ్యులు శ్రీమతి రమాదేవి కులకర్ణి ఆధ్వర్యంలో ఏర్పడిన ఒక వాట్సాప్ సమూహము. అయోధ్యలో బాలరాముని ప్రాణ ప్రతిష్ఠ పురస్కరించుకుని, శ్రీమతి రమాదేవి కులకర్ణి సంపాదకత్వంలో, కణిక, వెలువరించిన సంకలనం “అయోధ్య రామయ్య”, భక్తి కవితల సమాహారం. సుమారు 62 మంది వరిష్ఠ కవులు, జగదభిరాముడు శ్రీరాముడిపై తమ భక్తి ప్రపతులను కవితల రూపంలో చాటుకున్నారు.

ఈనెల 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరిగిన రోజునే, సాయంత్రం 6 గంటలకు జూం సమావేశం లో కణిక కవి సమ్మేళనం నిర్వహించడం జరిగింది. అయోధ్య రామయ్య సంకలనంలో భాగస్వాములైన కవులే కాకుండా రామయ్య పై తమ భక్తిని చాటుదామని విచ్చేసిన కవులతో, సుమారు మూడు గంటల పాటు సాగిన కవితా గానం శ్రోతలను అలరించింది. ఈ సమావేశంలోనే రమాదేవి కులకర్ణి స్వయంగా రచించిన, శ్రీ రామ కథ, బాల గేయ సుధ ఆడియో ఆవిష్కరణ జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ సాహితీవేత్త, సినీ గేయ రచయిత, బంగారు నంది అవార్డు గ్రహీత, సాహితీ కిరణం వ్యవస్థాపక అధ్యక్షులు సాదనాల వేంకట స్వామి నాయుడు గారి చేతుల మీదుగా వైభవోపేతంగా ఆవిష్కరింపబడింది. గేయాలకు సంగీత విద్వాంసులు విపంచి శశిధర శర్మ గారు గాత్రం అందించారు. చరిత్రలో ఈ రోజు శాశ్వతంగా నిలిచే పవిత్రమైన రోజు అయోధ్య రాముడి బాల విగ్రహ ప్రతిష్టాపన జరిగిన ఈ రోజు కోసం మన కణిక నిర్వాహకులు కవులందరితో ఆ రామయ్య గురించి అక్షర నైవేద్యం ఇచ్చే విధంగా ఒక సంకలనాన్ని చేపట్టి సంకల్పంతో అందరినీ ఒకే వేదిక మీద జూమ్ మీటింగులో అందరి చేత తమ కవితలు చదివించడం నిజంగా అభినందనీయం. సంకలనంలో పాల్గొన్న ప్రతి ఒక్క కవుల కవితలు చాలా బాగున్నాయి, అందరూ ఆ రామయ్య కోసం చాలా బాగా రాశారు అన్నారు. కార్యక్రమ సభా నిర్వహణ శ్రీమతి శ్రీ సుధా కొలచన చేపట్టారు. శ్రీమతి సత్యవతి దినవహి, శ్రీమతి సత్య నీలిమ కవి సమ్మేళనం సమన్వయ కర్తలుగా వ్యవహరించారు. సాహిత్యం సమాజ అభివృద్ధి కోసం ఉపయోగపడాలని, ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో కవుల పాత్ర మహత్వపూర్ణమైనదని సాహితీవేత్తలందరూ తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

## రోడ్డు ప్రయాణం..అప్రమత్తతతో వ్యవహరించాలి

హైదరాబాద్ జనవరి 24 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); జనవరి 15వ తేదీ నుండి ఫిబ్రవరి 14వ తేదీ వరకు రోడ్డు భద్రత మాసంగా మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్పోర్ట్ అండ్ హైవేస్ మంత్రిత్వ శాఖ ప్రకటించింది.

రోడ్డు ప్రమాదంలో ఎక్కువగా యువత చనిపోతున్నందున ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎడ్యుకేషన్, ఎమర్జెన్సీ ల ద్వారా రోడ్డు ప్రమాదాలను నియంత్రణపై దృష్టి సారించారు. కాలనుగునంగా వాహనాల సంఖ్య పెరుగుతుండడం, రోడ్లు విస్తారంగా ఉన్నప్పటికీ ప్రయాణికులు తగిన జాగ్రత్త తీసుకోకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయి.

2022 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో 7500 మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోగా భారత దేశంలో 1,68,000 మంది చనిపోయారని గణంకాలు చెబుతున్నాయన్నారు. హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్ట్ పెట్టుకోకపోవడం, ఓవర్ స్పీడింగ్ ,డేంజరస్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం తదితర కారణాలవల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నేపధ్యం లో రహదారులు ఉండే ప్రాంతాల్లో రోడ్ సేఫ్టీ క్లబ్బులను ఏర్పాటు చేయాలని, పోలీస్ కార్యాలయంలో డిస్టిక్ రోడ్ సేఫ్టీ బ్యూరో , కమిషనరేట్ లలో కమిషనరేట్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటు చేసుకోవాలని పోలీసుశాఖ సూచించింది. అవసరమైతే ఈ చలాన్ నిధుల ద్వారా స్పీడ్ గన్స్ బ్రీత్ అనలైజర్స్ వంటి వాటిని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలించాలని , రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడే వారికి “గుడ్ సమా రిటన్” పేరిట సన్మానం చేయాలని డిజిపి చూచనలు చేసారు..ఈ రకమైన చర్యలు ఈ నెలకే పరిమితం కాకుండా దీర్ఘకాలంలోనూ అనుసరించాలని పోలీసు అధికారులకు డిజిపి స్పష్టం చేశారు.

## బాలికల భవితకు బంగారు బాట వేద్దాం

సమాజంలో బాలికలు ఎదుర్కొంటున్న అసమానతలు వివక్ష పై ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో జాతీయ బాలికా దినోత్సవం జనవరి 24' 2008 నుండి కేంద్ర ప్రభుత్వం నేషనల్ గర్ల్స్ డెవలప్మెంట్ మిషన్ కేంద్ర ప్రభుత్వం 'మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోనిర్వహిస్తారు. “బాలికా దినోత్సవ సందర్భంగా” బాలికల సాధికారిత సమాజంలో బాలికల సంరక్షణ హక్కులు ఆరోగ్యం 'విద్య 'భద్రత సామాజిక ఎదుగుదల బాలికలకు 'బాలురతో సమానహక్కులు' సమాన అవకాశాలు స్వేచ్ఛ బాలికను గౌరవించడం అన్ని రంగాలలో బాలురతో సమానంగా అవకాశాలు ఇవ్వడం బాలికల పట్ల వివక్షతను తొలగించడం సాంఘిక 'ఆర్థిక సమానత్వ కల్పన 'జెండర్ సమానత్వం సామాజిక భద్రత మొదలగు అంశాల మీద అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది.

### ఆడపిల్లనే అనే సంస్కృతి

ఆడపిల్ల అంటే “ఆడపిల్లనే” అనే సంస్కృతి సమాజంలో నెలకొనడం బాలికల పాలిట శాపంగా పరిణమించింది. తల్లి గర్భంలో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలియగానే “భ్రూణ హత్యలకు'' పాల్పడటం సర్వసాధారణమైంది.

### ఆడపిల్లలు అన్ని రంగాల్లో నిర్లక్ష్యం

కుటుంబం నుండే ఆడపిల్ల నిర్లక్ష్యం పెంపకంలో వివక్షతకు గురికావడం విచారకరం. కుటుంబం నుండి మొదలైన వివక్షత నిర్లక్ష్యం చిన్న చూపు అన్ని రంగాలలో నెలకొనడం వల్ల బాలికల అభివృద్ధికి వారి సాంస్కృతిక, సాంఘీక, ఆర్థిక, సామాజిక వికాసానికి గొడ్డలిపెట్టుగా పరిణమించింది . సమస్యల విషవలయంలో చిక్కుకు పోయిన ఆడపిల్లల అభివృద్ధి సంక్షేమం ఆశించిన మేరకు జరుగలేదు. ఆడ పిల్లలను కించపరచడం సామాజిక రుగ్మతైంది.

### చట్టాలు విఫలం

బాలికలకు విద్య వైద్యం ఆహారం చట్టబద్ధమైన హక్కు ఆరోగ్య సంరక్షణ సామాజిక భద్రత బాల్యవివాహాలు నుండి బాలికలకు విముక్తి కల్పించా లని ప్రవేశపెట్టిన అనేక చట్టాలు పథ కాలు ఆశించిన ఫలితాలు సాధించ లేదు . సమస్యలే ఆడపిల్లల ఆస్తులుగా అవమానాలు నిర్లక్ష్యం అనారోగ్యం వేతన వివక్ష వారికి ఆభరణాలుగా పరిణమించాయి.

### రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం

కేంద్ర ప్రభుత్వం 2015లో చేపట్టిన “భేటీ బచావో బేటి పడావో” అనే పథకం ఆడపిల్లల అభివృద్ధికి వారి సాంఘిక ఆర్థిక వికాసం కోసం ప్రవేశ పెట్టిన పథకం రాష్ట్ర ప్రభుత్వాల అమలులో నిర్లక్ష్యం వల్ల ఆశించిన ఫలితాలు రావడం లేదు. కేంద్ర మహిళా శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2015 ఏప్రిల్ నుండి జాతీయ బాలికా దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించడానికి నేషనల్ గర్ల్స్ డెవలప్ మెంట్ మిషన్ కార్యక్రమ రూపకల్పన జరిగింది.

బాలికల సంరక్షణ కొరకు ఆడపిల్లలకు షరతులతో కూడిన ధనలక్ష్మి పథకం' కిశోరి శక్తి యోజన సుకన్య 'స్వమృద్ధి యోజన పౌష్టిక ఆహార పథకం మొదలగు పలు పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుంది 1989వ సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించి సభ్య దేశాలలో ఆడపిల్లల సామాజిక ఆర్థిక సాంఘిక సాంస్కృతిక హక్కుల పరిరక్షణకు పూనుకున్నది.

### స్త్రీల అక్షరాస్యత

జనాభాలో నేటికీ 20 కోట్ల మంది మహిళలు నిరక్షరాస్యులుగా ఉన్నారు. వీరిని అక్షరాస్యులను చేసినప్పుడు మాత్రమే మహిళా సాధికారత సాధ్యమవుతుంది.

### స్త్రీ పురుష నిష్పత్తి

రోజురోజుకీ ఆడపిల్లల సంఖ్య తగ్గిపోతుంది ఇలాగే కొనసాగితే చాలా సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది 2011లో స్త్రీ పురుష నిష్పత్తి ప్రతి 1000 మంది పురుషులకు 940 మంది స్త్రీలు ఉన్నారు. ఇందులో ఆరు సంవత్స రాల లోపు వయసు కలిగిన బాలికలు ప్రతి వెయ్యి మంది బాలురకు 914 మంది మాత్రమే ఉన్నారు.

### బాల్యవివాహాలు

దేశంలో 26.5శాతం బలవంతపు బాల్య వివాహాలు జరుగుతున్నాయి. ప్రపంచములో జరుగుతున్న 40 శాతం బాల్యవివా హాలు మన దేశములో జరుగుతు న్నాయని “యూనిసెఫ్” వెల్లడించింది . మన దేశములో 40 శాతం బలవంతపు బాల్య వివాహాలు పశ్చిమబెంగాల్లో చోటు చేసుకోవడం గమనార్హం

### భ్రూణహత్యలు

ఆడపిల్లను మైనస్‌గా భావించి మగ శిశువును ప్లస్ గా పరిగణించే మానసిక స్థితి సమాజంలో నెలకొనడం వల్ల పుట్టుకతోనే ఆడపిల్లల భ్రూణహ త్యాలకు బలై వివక్షతకుగురి అవుతున్నారు

### పేదరికం.అల్పపౌస్టికాహారం

బాలికలకు ఉన్నత విద్య సమస్యగా మారింది. నేటికీ 40 శాతం పైగా బాలికలు పదవ తరగతి కంటే ముందే బడి మానేస్తున్నారు బడి మానుకొని గ్రామాలలో వ్యవసాయ రంగంలో అసంఘటిత ప్రైవేట్ రంగంలో బాలకార్మికులుగా పనిచేస్తున్నారు. శ్రమ దోపిడీకి 'లైంగిక వివక్షతకు భిక్షాటనకు గురవుతూ తమ అమూల్యమైన బాల్య దశను పేదరికం' ఆకలిచావులు అల్ప పౌష్టికాహారం' అనారోగ్యానికి గురౌతున్నారని అనేక అధ్యయనాలల్లో తేలింది. .

### బాలికల సంరక్షణ చర్యలు

ప్రభుత్వం బాలికల సమగ్ర వికాసానికి సంరక్షణకు అవసరమయ్యే విధానాలను అమలు చేయాలి.

బాలికల భద్రత,లింగ నిష్పత్తి 'విద్య, వైద్యం ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలి. బాలికలకు బాలురతో పాటు సమాన అవకాశాలు సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పించాలి. బాలికల అభివృద్ధియే లక్ష్యంగా జాతీయ విద్యా విధానంలో పలు పథకాలు ప్రవేశపెట్టడం బాలికలకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించడం సమాన విద్యా వకాశాల సాధనకు “ప్రతేక నిధిని” కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమైన చర్య. బాలికల హక్కుల రక్షణ భద్రత పౌరసమాజం సామాజిక బాధ్యతగా గుర్తించాలి. ఆడపిల్లలను మగపిల్లలతో పోటీ పడేట్లు ప్రోత్సహించాలి .అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పించాలి . ఆడపిల్లల అభివృద్ధి దేశాభివృద్ధిగా భావించాలి. దేశ ప్రగతి పురోగతిలో ఆడపిల్లలు మానవ వనరులుగా ఎదగడానికి ప్రభుత్వం కృషి చేయాలి. బడుగు బలహీన వర్గాల్లో బాలికలకు ఉచిత విద్య వైద్యం అందించాలి. సమాజంలో మహిళాల పట్ల గౌరవంఆర్థికస్థాయి. సామాజిక హోదా పెంచాలి.

### బాలికల సంరక్షణ ప్రభుత్వం- బాల్య వివాహాలు బాలికల

అక్రమ రవాణా, అత్యాచారాలు, లైంగిక వివక్ష మొదలగు సమస్యల నుండి ఆడ పిల్లలను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి .పౌరసమాజం యువజన సంస్థలు మహిళా స్వచ్ఛంద సంస్థలు సంఘాలు ఆడపిల్లల సంరక్షణ హక్కుల రక్షణకు పాటుపడాలి .

### బాలికలు డిజిటల్ విద్య

ప్రభుత్వం బాలికలకు కంప్యూటర్ విద్య డిజిటల్ విద్య టెక్నాలజీ ఆధునాతన సాంకేతిక ఉన్నత విద్య ఉపాధి దోహక విద్యను ఉచితంగా అందుబాటులోకి తేవాలి. బాలికలకు వృత్తి నైపుణ్య విద్యను అందించాలి. బాలికల సామాజిక ఆర్థిక స్థాయి పెంచే పథకాలను అమలు చేయాలి

### మహిళా రిజర్వేషన్స్

కేంద్ర రాష్ట్ర 'ప్రభుత్వ 'ప్రైవేట్ రంగ ఉద్యోగ నియామకాల్లో 50 శాతం మహిళలకు రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వం మహిళా బిల్లును ప్రవేశ పెట్టి రాజకీయాలలో స్త్రీల వాటా పెంచాలి. మహిళలను పారిశ్రామిక వేత్తలుగ ఎదిగేట్లు వాతావరణం కల్పించాలి.

### మహిళా సాధికారిత

ప్రభుత్వం మహిళా సాధికారిత సాధనకు ఉద్యమించాలి. శాస్త్ర సాంకేతిక, పారిశ్రామిక,వ్యవసాయ వ్యాపార, వాణిజ్య, రాజకీయ రంగాలలో మహిళా వికాసానికి ప్రభుత్వం పెద్ద పీట వెయ్యాలి. బాలికల కొరకు ప్రత్యేక పాఠశాలలు కళాశాలలు ఏర్పాటు చేసి ఇంటర్మీడియేట్ వరకు ఉచిత వొకేషనల్ విద్య అందించాలి.

ఆడపిల్లలను పుట్టనిద్దాం బతుకనిద్దాం చదువనిద్దాం ఎదుగనిద్దాం అన్న నినాదం విధానమైనప్పుడే బాలికల దినోత్సవం ఆశయాలు నెరవేరుతాయి. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. స్త్రీ లేకపోతే అసలు సృష్టి లేదు. అందువల్ల ఆడపిల్లలను రక్షించుదాం. అమ్మాయిలను ఆదరిద్దాం. బాలికల భవితకు బంగారు బాటలు వేద్దాం.

-నేదునూరి కనకయ్య
9440245771



నానీ

అగ్నిరాగం
గాయపరుస్తున్నా
చందనం చిలకరించేది
ఇల్లాలే!



-డా॥ సి. భవానీదేవి
9866847000

# నేటి నిజం సాహితీ కెరటాలు

website:www.netinijam.com

website: www.netinijam.com

2 హైదరాబాద్ | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | గురువారం 25-1-2024



## ఘంటారావం

మరచిపోవాల్సిన వాటిని
గుర్తుంచుకోకు
గుర్తుంచుకోవాల్సినవాటిని
మరచిపోకు

జల్లెడలా
మనసుఉ మార్చు
జల్లించిన
మాటల్నే పంచు

మాట్లాడేవారిని
దర్శించు
మాట్లాడలేని వారిని
స్పర్శించు.

కానివారి కోసం
కలవరించకు
అయినవారిని
ఆయాసపెట్టకు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# మట్టితో మనిషికి విడదీయరాని అనుబంధం- ప్రసిద్ధకవి జయరాజ్



'కవి సాయంత్రం' ప్రత్యేక పుస్తక ఆవిష్కరణలో కవిత, మౌనశ్రీ మల్లిక్, బైస దేవదాసు, జయరాజ్, ముక్క సంపత్‌కుమార్, మందడి సుధాకర్‌రెడ్డి, విజయలక్ష్మి.

మట్టికి, మనిషికి విడదీయరాని అనుబంధం ఉందని ఇది తెలుసు కోకుండా మనుషులు ఆధునికత మోజులో పడి కష్టాలు కొని తెచ్చుకుంటున్నారని ప్రసిద్ధ కవి జయరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సోషల్ మీడియా గ్రూప్ "కవి సాయంత్రం" ఆత్మీయ సమ్మేళనం హైదరాబాద్ నాచారంలోని ప్రతిభ పాఠశాలలో ఆదివారం నాడు అత్యంత వైభవంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. ప్రకృతిని అవసరం మేరకు వాడుకుం టూ, దానిని పరిరక్షిస్తూ భవిష్యత్ తరాలకు తరగని సంపదగా బహుకరించాలని సూచించారు. కృత్రిమ ఎరువులతో వ్యవసాయం చేస్తూ, భూమిని గుల్ల చేస్తున్నామని, సహజ వనరులను కాపాడుకుంటూ ప్రజలను చైతన్యం చేయాలని అన్నారు. ఇలాంటి బాధ్యతతో కవులు రచనలు చేయాలని పిలుపునిచ్చారు.

నేటినిజం సంపాదకులు బైస దేవదాసు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా అనేక సామాజిక మాధ్యమాలలో నవ కవులు ఉద్భవిస్తున్నారని అన్నారు. మేధావుల రచనలు చదివితే పరిపూర్ణ స్థాయిలో రచనలు చేయవచ్చునని సూచించారు. తాను నేటి నిజం పత్రిక ద్వారా నవ కవులకు తగిన ప్రోత్సాహం ఇస్తున్నాని అన్నారు. మౌనశ్రీ మల్లిక్ మాట్లాడుతూ కవులు ఏది రాసిన నిబద్ధతతో బాధ్యతాయుతంగా రాయాలని అన్నారు. ప్రతి రచనలో పాఠకులను వెంటాడే భావజాలం తప్పకుండా ఉండాలని సూచించారు. చమత్కారం, చలోక్తులను వినసొంపుగా చెప్తూనే చక్కని సందేశాన్ని అందించే రచనలు చేయాలని అన్నారు. కవి సాయంత్రంతో విడదీయరాని అనుబంధం తనకు ఉందని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ హుస్నాబాద్ అనే మారుమూల ప్రాంతం నుంచి అనునాదంగా చేస్తూ ఉభయ రాష్ట్రాలే కాకుండా, పలు దేశ విదేశాల కవులతో అనుబంధం ఏర్పరచుకొని 9 ఏళ్లుగా గ్రూపును విజయవంతంగా నడిపిస్తున్న సంపత్ అభినందనీయుడని అన్నారు. తాను అందులో సభ్యులు కావడం ఆనందదాయక మన్నారు. తదుపరి సమ్మేళనం తన ఆధ్వర్యంలో పెద్దపల్లిలో మరింత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. డిప్యూటీ జైలర్ కాటేపల్లి, ప్రతిభ స్కూల్ చైర్మన్ మందడి సుధాకర్ రెడ్డి, విజయలక్ష్మి తదితరులు ప్రసంగించారు. తదనంతరం కవులను శాలువా, మెమొంటో, ప్రశంసా పత్రం, కిరీటంతో సన్మానించారు. ప్రారంభ సూచకంగా పాఠశాల విద్యార్థులు చేసిన శాస్త్రీయ నృత్యం అందరినీ ఆకట్టుకుంది. గ్రూప్ వ్యవస్థాపకుడు ముక్క సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభ ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది.

ఈ కార్యక్రమంలో కవిత భేతి, శ్రావ్య సాయి, ఉభయ రాష్ట్రాల నుంచి ఎంపిక చేయబడిన కవులు, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న ప్రసిద్ధ కవి జయరాజ్.



కవి సాయంత్రం అధ్యక్షులు ముక్క సంపత్‌కుమార్‌ను సన్మానిస్తున్న అతిథులు.

## సునందామృతం

### ఘృత కోశాతకీ న్యాయము

ఘృతం అంటే నెయ్యి. కోశాతకీ అంటే బీర కాయ. ఘృత కోశాతకీ అంటే నేతి బీరకాయ.

నేతి బీరకాయ పేరులో నెయ్యి ఉంది కానీ బీరకాయలో లేదు. నెయ్యి లాంటి కమ్మని పదార్థం కూడా లేక పోగా కనీసం తినడానికి కూడా రుచిగా కూడా లేకుండా చప్పగా ఉంటుంది.

పాలకూరలో పాలు, పెరుగు తోటలో పెరుగు..ఇలా పేర్లో తప్ప నిజానికి అందులో పాలు, పెరుగు ఉండవని మనకు తెలుసు.

ఘృత కోశాతకీ కూడా ఈ కోవకు చెందినదే. పేర్లు విన్నప్పుడు అందులో పాలు ఉన్నాయేమో, పెరుగు ఉందేమో, నెయ్యి ఉందేమో అనిపిస్తుంది.

ఇలాంటివి చూసేనేమో "పేరు గొప్ప ఊరు దిబ్బ,' 'ఇంటి పేరు కస్తూరి వారు-ఇల్లంతా గబ్బిలాల కంపు' అనే సామెతలు పుట్టినవి.

ఊరించే, ఊహించే విధంగా ఉన్న ఇలాంటి పేర్లకూ వాటి లక్షణాలకు ఎలాంటి సంబంధం ఉండక పోవడాన్ని వ్యక్తుల్లో కూడా గమనించవచ్చు. కొందరు వ్యక్తులు ఈ కోవకు చెందుతారు. అదెలాగో చూద్దాం.

పేరేమో సత్య హరిశ్చంద్ర . చెప్పేవన్నీ అసత్యాలే. నోరు తెరిస్తే అబద్ధాలే. పేరు ధర్మ రాజు చేసేవన్నీ అధర్మాలే. పేరులోనే కరుణ. కరుణాకర్ . అతనిలో/ ఆమెలో కరుణ ఏ కోశానా కనపడదు. ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలుగా ఉదాహరణలు కనిపిస్తాయి.

అందుకే పేరుకు తగ్గట్టు వాస్తవ జీవితంలో అలా ఉంటారని అనుకోవడం ఒట్టి భ్రమ అని తెలియజేస్తూ, అలాంటి వాళ్ళను ఉద్దేశించే ఈ ఘృత కోశాతకీ న్యాయము వాడుకలోకి వచ్చింది.

కొందరి మాటలు- చేష్టలకు ఎలాంటి సంబంధం ఉండదు. మాటల్లో గొప్పలు తప్ప చేతల్లో ఉండవు. మాటలు విన్నప్పుడు ఆహా! ఎంత గొప్ప మనిషి అని పొగడకుండా ఉండలేం. కానీ ఆ తర్వాత తెలుస్తుంది అతడు ఏమీ చేయడనీ. మాటల్లో తప్ప అలాంటి మంచితనం కాగడా పెట్టి వెదికినా దొరకదు.

అదిగో అప్పుడు అనుకుంటాం .ఆ మనిషి మాటలన్నీ నేతి బీరకాయ చందమని.

ఏమీ లేదు అంతా ఉత్తదే అని అర్థంలో కూడా ఈ ఘృత కోశాతకీ న్యాయమును వాడుతూ ఉంటాం.

నేటి రాజకీయ నాయకుల్లో చాలా మంది చెప్పే మాటలు నేతి బీరకాయల్లాంటివే. దేశ సేవ, ప్రజాసేవ, దీన జనోద్ధరణ లాంటి మనుసుని ఆకట్టుకునే మాటలు. ప్రజల కోసమే తాము ఉన్నామనీ అసలీ రాజకీయాల్లోకి వచ్చిందే అందుకని మైకు పట్టుకుని చెవులు చిల్లులు పడేలా చెప్పే మాటలన్నీ నేతి బీరకాయ వంటివే.

కాబట్టి అలాంటి వారి మాటలు, చేతలను నిశితంగా గమనిస్తూ ఉండాలి. మాటకూ చేతకూ, పేరుకూ వ్యక్తిత్వానికి ఏమైనా సామ్యం ఉందా లేదా చూస్తూ మనల్ని మనం మోసపోకుండా కాపాడుకోవాలి.

ఇలాంటివి చదివినప్పుడు ఉలిక్కిపడి మనల్ని మన పేర్లను తడుముకోవడం సహజం. అలా మన తల్లిదండ్రులు మనకు పెట్టిన పేర్లకు లేదా మన పిల్లలకు మనం పెట్టిన మంచి అర్థవంతమైన పేర్లకు తగ్గట్టుగా ఉన్నామా, అలా వారిని తీర్చిదిద్దుతున్నామా అనేది కూడా ఆలోచించాలి మరి.



-వురిమళ్ల సునంద
9441815722

## బంగారు బాయి




ఊరంతటికి దూపదీర్చి
నీళ్లినకిన
పెయ్యిలల్ల పుర్తిని పెంచిన తల్లి.
పేరులో బంగారం నింపుకొని
కలబోత పల్లెకు సింగారమయ్యి
అందరిని అక్కున చేర్చుకున్న కల్పవల్లి
అమ్మలక్కలు అయ్యకొడుకులు
బిందెలు బొక్కెనలతో ఊరి
ముచ్చట్లతో వస్తే సమస్యకు
పరిష్కారం చూపిన రచ్చబండ
కరెంట్ లేను చీకటి రాత్రుల్లో కూడా
భయాలను దూరం చేసి నీలిచ్చి
నిలబెట్టిన పల్లె ధైర్య కవచం
బఢీకొచ్చిన బిడ్డలకు నేనున్నానంటూ
సర్వకాలాలు ఆదుకున్న బాలనేస్తం
బిందెల లైన్‌లల్లో
రోజు మెరిసే పగటి చంద్రబింబం
ఇంటింటి కబుర్లకు ఆపతికి తీరని
దుఃఖానికి కన్నీటికి
తోడు నిలిచిన ఆత్మ బంధువు
ఇచ్చిన నీళ్లలో తన చుట్టూ
చెట్ల బంధాలను దృఢ పరిచి
వనానికి పాన మైన కల్ప తరువు.
దోసిల్లల్లో నీ అమృతాన్ని తీసుకున్నప్పుడు
ప్రపంచమే చేతినిండా నిలిచేది
నీ ధార గొంతు నుండి దిగి
ప్రవహిస్తున్నప్పుడు ధైర్యం
నీండి మనసులో శక్తి పెరిగి
ఆటల కదనరంగం లసై అంటూ
దూకుడు పెంచేది.
నీ నీళ్లను కడుపున దాచిన ఇంటిలోని బిందెలు
నిన్నెప్పుడు చేరుదమా అని ఉబలాట పదేవి
బొక్కెన తాళ్ళు ఎన్ని గాయాలు చేసినా
నిలబడే ధీమాతవయ్యావు
అమ్మ కట్టే దెబ్బలు తిన్న నేను ఎన్ని సార్లు
నీ వద్ద కన్నీరు కార్చలేదు
కొత్త ధైర్యమై ఎన్నిసార్లు రణరంగం లో దుంకలేదు
ప్రతి మనసులో నువ్వు పదిలం
ప్రతి మనిషికి నువ్వొక వరం
ఎన్ని ఇండ్లలో అమృతాన్ని నింపావు
ఎన్ని తనువుల్లో ఊరి వీరత్వాన్ని పంచావు



-సిరిసిల్లా గఫుర్ శిక్షక్.
9849062038


## కథల వంతెన



-డా॥నందిని సిధారెడ్డి
సెల్:9440381148

# చిత్రకన్ను

కథ



పిడికల మధ్య నుంచి సన్నగా పొగ లేస్తుంది.

నర్సయ్య వొడ్డె ముత్తడితో కలిసి బస్తీకెళ్లి పందుల అమ్మకానికిగాను సోహన్‌లాల్ సేఠ్‌జీతో బేరమాడు తున్నాడు.

పరశురాములు, అమ్మగా అమ్మగా మిగిలిన అర ఎకరం నేలా అమ్ముకొని తాగటానికి ఆకు మడచుకుని తాటిచెట్టెక్కిన ఎల్లగౌడు వంక చూస్తున్నాడు. నాగరాజం పిల్లల్ని ఇళ్లల్లోకి పంపించేసి స్కూల్లోనే టీచర్లంతా కలిసి వేసుకున్న సిండికేట్‌లో సిగరెట్ తాగుతూ కమ్మలు వేస్తున్నాడు.

సరిగ్గా అదే సమయాన-

ఆ ముగ్గురినీ కన్నతల్లి బాలవ్వ ఆయాసపడటం మానేసింది.

అదేం చిత్రమో కాని- లచ్చవ్వ పోసిన తులసిపసరు నోట్లో పడటం తోటే బాలవ్వ ఆయాసం చల్లారింది. లచ్చవ్వ పెద్ద నోరు చేసుకుని ఏడవటం చుట్టుపక్కల వాళ్లకి ఆశ్చర్యంగా అనిపించి గునగునా పరిగెత్తుకొచ్చారు.

బాలవ్వ మాత్రం యెండుగడ్లో నిర్జీవంగా పడి వుంది. ఈదురుగాలికి యెండుగడ్డి కిలకిలలాడ్తుంది. కానీ బాలవ్వ మాత్రం కట్టెలా వుండిపోయింది.

> "ఎందుకు జేత్తర్రా? కనరెక్కిందిరా మాదుగులకు, ఇర్వయిత్తనంటె గూడ ఒల్లనని నీల్గుతాంద్రు, నీయవ్వ.."

×××

ఏడు గంటలయి చీకటి పడ్డప్పుడు ఓ నిర్ణయానికొచ్చాడు నర్సయ్య. తన అవ్వ యెన్నోసార్లు తనని బతిమాలి చెప్పేది.'నేను సచ్చిపోయి నంక నన్ను పాతిపెట్టకుండ్రి. కాలె య్యండ్రిరా. ఆఖరుకు నా దగ్గరి బంగారం పెట్టైనా సరే.' అని చేతిలో చేయి కూడా వేయించుకుంది.

కట్టె కొట్టటానికి, డప్పు కొట్టటానికి మాదిగల్ని పిలిపించుకర మ్మని వొడ్డె ముత్తడ్ని పంపాడు నర్సయ్య.

అప్పుడే నలుగురు పెద్ద మనుషులు శవం దగ్గరికి చేరారు. ఇద్దరు మాదిగ పెద్దలు వచ్చారు. గోచీ, రుమాళు తప్ప అంగీల్లేవా యిద్దరికీ. "ఎంత తీస్కుంటర్రా", అడక్కూడదనీ, కొంచెం ఎక్కువే ఇవ్వాలనీ తెలిసినా నర్సయ్య పీసుగా అడిగాడు.

"గదే రెండు పన్లకి ఎనుబై రూపాయలియ్యండ్రి", అన్నాడు మీసాలతను.

పరుశరాములు గోడకు చేరగిలబడి నిల్చున్నాడు తప్ప ఏమీ మాట్లాడ్డం లేదు.

"ఇరవై రూపాయులిత్త", అని ఓ నిమిషం గడవకముందే, "ఏమం టర్రా", అన్నాడు నర్సయ్య.

"మేం జెయ్యం. మావోడింక తక్కువడిగిండు, ఎనుబైకేం తక్కువున్నా, ఉహు.. మేం జెయ్యం.." అన్నాడు ఎర్ర రుమాలతను.

"ఎందుకు జేత్తర్రా? కనరెక్కిందిరా మాదుగులకు, ఇర్వయిత్తనంటె గూడ ఒల్లనని నీల్గుతాంద్రు, నీయవ్వ.." నర్సయ్య మాట్లాడ్తోంటే, ఆ నోట్లోంచి తుంపరపడుతోంది. పెద్ద మనుషుల్లో వున్న పోలీసు పటేల్ కూడా ఏమనలేదు.

"ఇర్వయా? త్వూ.. తెనుగోడిచ్చిం డు యాభయి అంతకంటె అధ్వానమా త్వూ.. నీ వొంశమే గంత," మీసాలతను కోపంతో పెట్రేగిపోతున్నట్లన్నాడు.

"ఊంచుతావురా నేనింత అగ్గువె నానురా పోని- అయితె అయితిగని ముప్పయికి జెయండ్రి?"

మాదిగల్ని నర్సయ్య చావుకాడ బేరమాడుతున్నందుకు చుట్టూ గుమిగూడుతున్న వాళ్లు ఆయన పిసినారితనాన్ని తిట్టుకొంటున్నారు.

నలుగురు పెద్దల్లో పోలీస్ పటేల్ వుండబట్టలేక సారా తెప్పించుకు తాగుతున్నాడు. పక్కన్నే మస్కూరీ నిలబడి గ్లాసులో వంచిస్తున్నాడు. ఇద్దరేమన్లేదు.

మిగిలిన పెద్దే సర్పంచు

ఆయన మాదిగలని సముదాయిం చబోయి, "యాభైకి వొప్పుకోండ్రి," అన్నాడు.

ఎర్ర రుమాలతను సర్పంచు వంక తిరిగి విషయమంతా ఏకరువు పెట్టసాగాడు.

"కాదు పటేలా ఈయినె కేమయిం దని ముప్పయిత్తడు. యాభయిత్తడు కులం తక్కువోడా? లేనోడా? ఇంటి నింద పైసల్వెట్కోని.. పోనీ మీ అసోం టళ్లకు మొఖం జూసన్న యాభయికో అరవైకో జేత్తం ఎందుకని? అందినం త మీ దగ్గర తింటనే వున్నం. ఈ పీనోని దగ్గర పిసురంతన్న దిన్నమా? మిమ్మల్ని దోస్కోకపోతె జాలు. ఇన్ని లగ్గాలు జేసుకున్నరు, ఒక్క లగ్గానికన్న పిలిసింత పెట్టిండ్రా. ఇన్ని పంటలు దీసుకున్నరు, ఇన్ని కల్లాలయినయి, కల్లం కాడికి పోతె ఒక్కసారన్న ఒక్కిత్తన్న పెట్టిండా. మాతోని పని జేయించుకుంటె బిచ్చం పెట్టవడ్డదని చెప్పులు గూడ వాళ్లే ముడుసుకునిరి. పగ్గాలు పేనుకునిరి. మాకేం లాబపడ్డరు? తెనుగోల్లక్కర కొస్తరు, కుమ్మరోల్లక్కకొస్తరు.. యీనె దేని కక్కరకొస్తడు? నాల్గు బర్రెలు పాలిత్తన్నయని సల్లకువోతె పైసలిత్తెనే పోత్తనన్నదట ఈనె పెండ్లాం. పోని, పైసలు దీస్కోనన్న సల్ల పోసిందా వుత్తనీళ్లు పోసింది. తల్సుకుంటె కండ్లకు నెత్తురొస్తది. మాదే అండ్లనో.. ఇండ్లనో.. దోసుకున్నడు. ఖర్చయిద్దనే గాదు పటేలా యిన్ని సావులయితె బొంద పెట్టింద్రుగని, ఒక్కటన్న కాష్ఠం పెట్టింద్రా కనీసం. ఇసోంటోళ్లారిల వుండెందుకు? వుండి దండుగ మన్నులు.."

వాడి నోట్లోంచి దూకుతున్న మాటలకి ఆనకట్ట లేకుండా పోయింది. నర్సయ్య కెన్నడూ రానంత కోపం వచ్చింది. రబ్బరుబుగ్గలో గాలిలా నిండి వుబ్బిపోయాడు నర్సయ్య. ధన్‌మని పగిలినట్టు విరచుకపడ్డాడు మాదిగల మీద.

"లంజకొడ్కులు ఏంద్రా, ఏమం టంద్రూ.. తన్నుండ్రీ! ఎట్లంటంద్రో సిగ్గులేదు తన్నుండ్రి. నీయవ్వ నేనెం దుకు పెడ్త. నాగ్గిట్ట పుట్టిర్రా కొడుకులు!"

పెద్దల సమాధానపరచే మాటలు ఎవరూ చెవిన పెట్టదలచుకోలేదు.

మీసాలతను, ఎర్ర రుమాలతను విడివిడిగా నర్సయ్యను తిడుతున్నారు.

పరశరాములు మాత్రం పాత గోడ కొరిగి కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు.

"నీకు పుట్టాలంటవ్ లే మల్లగినం టే తంతం. ఎక్కువోనివైతెనుక సీరి కొడుకా.. పైసుంటె నెత్తిల వెట్టుకోని ఊరేగుగని గంతమాట ఎట్లొచ్చింది నీ నోటికి- మా కష్టం దిన్నవ్. మమ్ముల దోసుక తిన్నవ్ మిత్తీలకిచ్చి, నాగుల కిచ్చి మమ్ముల ముంచి నువు లేసినవ్. మాగ్గిట్ట పుట్టినవనుకోవన్నార నిన్ను.."

లచ్చవ్వ బయటకొచ్చింది శవం దగ్గర్నుంచి లేచి.

నటుగుట్లో పడి నాలుగు మాటలనాలని నోరిడిసి పెట్టింది.

లచ్చవ్వ, నర్సయ్య ఒక పక్షం-

ఎర్ర రుమాలతను, మీసాలతను ఒక పక్షం-

బూతులు తిట్టుకుంటున్నారు. మధ్యస్థులు నోరు మూసుకుని చూస్తున్నారు.

నర్సయ్య తన్నటానికన్నట్టు, వాళ్ల మీదికి ఉరకబోయాడు. పెద్దమను షులు నర్సయ్యను ఆపి లాక్కొస్తున్నారు. పెద్దమనుషులు దెబ్బలు పడకముందే అలా ఆగబడతారని తెలిసుండబట్టే నర్సయ్య మాటిమాటికీ ముందుకు ఉరుకుతున్నాడు.

అక్కడ అల్లరి జోరైంది.

పొయిలో పడ్డ ఉప్పురాళ్లలా చిటపటలాడ్తున్నాయి మాటలు.

అప్పుడే నాగరాజం దిగాడు.

అక్కడ వాతావరణం బాగాలేదనీ, కలిగించుకుంటే డబ్బు మీద ఒరుగుతుందేమోనని అర్థం చేసుకుని, "ఓ అవ్వా, నా అవ్వా నువెవ్వట్లపోతివే ఓ అవ్వా.." అని పెద్దగా ఏడుస్తూ (గాడిద ఓండ్ర పెడుతున్నట్టుంది కొందరికి) శవం దగ్గరికి పరిగెత్తాడు.

శవం దగ్గరి జనమంతా గొడవ దగ్గరికి చేరారు.

పెద్దమనుషులన్న యాభైకి పైసెక్కువియ్యననే నర్సయ్యా. ఎనుభైకి వొక్క పైస తక్కువైనా కూడ పనిజెయ్యమన్న మాదిగలూ, అసలు విషయం గంగ మధ్యలో వొదిలేసి తిట్లు చల్లుకుంటున్నారు.

కూర్చున్నవాళ్లంతా యెంత జోక్యం చేసుకున్నా యెవరూ తిట్టు మానలేదు.

విచిత్రమైన కేసే అది.

ఆ కేసునెలా పరిష్కారం చెయ్యా లో ఆ నలుగురు పెద్దలకీ అర్థం కాలే దు. నలుగుర్లో సర్పంచు, పోలీసు పటేలు కూడా వున్నారు. వాళ్లు సీలోని సారా గ్లాసుల్లో, వంచుకుని అంతమంది ముందు సిగ్గుపడకుండా తాగేస్తున్నారు.

పెద్దల కర్థంకానిది లచ్చవ్వ కర్థమైంది.

తన పరిష్కారం అందరికీ వినబడేటట్లు నర్సయ్యతో చెప్పేసింది.

"వాళ్లతోనేంది? వాళ్ల సావు వాళ్లు పడతరు. మనకు సింతలున్నయి- దేవుడిచ్చిన సేతులున్నయి- మనమే కట్టెలు గొట్టుకోని మనమే కాష్ఠం పేర్చుకుంటె పోదా?? పా, ఎనుబై ఇచ్చి గాళ్లతోటేంది? మనం జెసుకుంటె జెరసేపట్లయితది. పోదాం పా," నర్సయ్యకు లచ్చవ్వ చెప్పింది బాగా నచ్చింది. అంత గొప్ప ఆలోచన తనకే రానందుకు బాధపడ్డాడు.

"ఆఁ కాపు బిడ్డ జెప్తంది గద, గట్ల జేసుకోండ్రి. శాన కదరుంటది. పైసను పదిముళ్లేసేటోళ్లు మీకెందుకి సోంటియి?" అనుకుంటూ మాదిగలిద్ద రూ వెళ్ళిపోయారు.

నలుగురు పెద్దలూ, కూడిన ఆ మందీ ఆ నిర్ణయానికి చెవులు మూసుకొని వెళ్లిపోక తప్పలేదు.

మంది మాత్రం లచ్చవ్వ పనికి తలా ఓ రకంగా తిట్టుకున్నారు.

"ఎంత పైసుంటే ఏం ఫలం? బుద్ధులుండాలెగని."

"ఇంతకన్న పీనుగల్నయం."

జనం శూన్యమైంది.

శవం మాత్రం మిగిలింది.

శవం మీద పడి ఏడ్చే నాగరా జం.

గోడకొరిగి నిద్రపోతున్న పరుశరా ములు.

తల్లి పక్కన అదేపనిగ ఏడ్చే బిడ్డా మిగిలారు.

మధ్య రాత్రి కాలేదింకా.

గొడ్డళ్లు పట్టుకుని నర్సయ్య. లచ్చవ్వ. కొడుకు ఈరారెడ్డి. వొడ్డె ముత్తడూ కలిసి వెళ్లారు.

విసుగ్గా వచ్చే మాదిగ పెద్దలవంక మిగతా మాదిగలు ఎదురొచ్చేరు.

జరిగింది విని ఆలోచిస్తూ గుడిసె లవైపు నడుస్తున్నారు.

"గిదే జరిగితే ఒకల్ని జూసొగలు, ఒగల్ని జూసొగలు, అందరూ వాళ్లకు వాళ్లే చావు జరుపుకుంటరు..' అన్నాడొకతను. అందరి జీవితాలకూ హెచ్చరికలా వుందా మాట.

"జరిగితే- అటెనుక మనకు దొప్ప కూడా దొరకది. ఇప్పటికే తిండికిట్ల జస్తంటే ఇంక ఈ యింత ఆసరా పోతే ఏం దొరుకుతది?" మీసాలతను నిర్ణయం చెప్పేశాడు.

గాలి వీచినపుడు కదలిపోయిన ఆకుల్లా కదిలి కదిలి వాళ్లంతా ఎందుకో ఒకరి ముఖాలొకరు చూసుకొన్నారు.

తెల్లారేవేళకి నర్సయ్య వాళ్లు కాష్టం పేర్చి ఇంటికొచ్చారు. పాడె కట్టి తమ్మలిడప్పుని పిలిచారు.

నలుగురు పెద్దలు రాలేదు. జనమెవరికీ రాబుద్ధేయలేదు.

పరుశరాములు, తలకొరివి పెట్ట డానికి ఏదో కుండ ఒక చేత్తో, పొగని కక్కే కొఱ్ఱాయిని ఒక చేత్తో పట్టుకుని నించున్నాడు.

సూర్యుడు మెల్లిగా తొంగి చూస్తున్నాడు.

కొడుకులిద్దరూ చెరోపక్క, పాడెకు మూడోపక్క, ఈరారెడ్డి, మరి నాలుగో పక్క? ఆడవాళ్లు పట్టకూడదు. "ఎలా?" నర్సయ్య చుట్టూ చూశాడు. కనుచూపు మేరలో ఎవరూ లేరు, ఒక్క వొడ్డె ముత్తడు తప్ప-

నాలుగోపక్క వొడ్డె ముత్తడి చేత పట్టించక తప్పలేదు!

తమ్మలిడప్పు మోగుతోంది.

తల దగ్గర పిడకిల్లోంచి పొగ వస్తోంది.

పాడె లేచింది.

సొన్నాయిల్లేని లోటు బిడ్డ సాగించే ఏడుపు తీరుస్తుంది.

పాడెలో బాలవ్వ శవం మీదుగా తెల్లటి మబ్బులు తేలిపోతున్నాయి.

బాలవ్వ తన జీవితంలో అందరి లా కాకుండా చాలా ప్రత్యేకమైన కలలు కన్నది. వింత కోరికలే కోరుకుంది. అవన్నీ కేవలం తన చావు గురించే-

నలుగురు కొడుకుల్ని కనాలను కుంది కనీసం. తన పాడె నాలుగుది క్కులూ కొడుకులే మోయాలని! ముందు ఆడపిల్ల పుడితే ఎంతో బాధపడి పోయింది.

తర్వాతర్వాత, 'తను చచ్చిపోతే ఏడవటానికి ఆ ఒక్కత్తే పనికొస్తుందిలే.' అని సరిపెట్టుకుంది.

బిడ్డ తర్వాత వరుసగా ముగ్గురూ కొడుకులే పుడితే కొండను తవ్వేశాన న్నంత సంతోషపడింది.

అంతలోనే పెద్ద ఘోరం జరిగిపో యింది.

మొగుడు చనిపోయాడు.

నాలుగో కొడుకు నివ్వకుండానే చనిపోయినందుకు ఆ మొగుడ్ని తను చనిపోయే వరకు రోజూ తిట్టుకుంది.

నిశ్శబ్దంగా వెళుతోంది శవం.

వీధుల్లోకి వచ్చి కట్టలు కట్టలుగా గుమికూడి చూస్తున్నారు జనం. అంతేకాని, వెనక ఎవరూ వెళ్లటం లేదు.

శవం మీద చల్లిన పేలాలు బాలవ్వ మీద పడకుండానే గాలిలోకి చేరిపోతున్నాయి. కిందపడ్డ పేలాల మీంచి కొడుకులు నడిచి వెళుతున్నారు.

"బాలవ్వకి బంగారం మీద, డబ్బు మీద పెద్ద మోజుండేది. భూమ్మీద డబ్బు, బంగారమంతా తన ఇంట్లో చేరితే బాగుండేదన్నంత పిచ్చిగా వుండేది. తను చస్తే ఏడుపైనా ఏడుస్తుందని బిడ్డనీ, తల్లికి తలకొరివి పెట్టడానికి పనికొస్తడని చిన్న కొడుకునీ తప్ప మిగతా ఏ కొడుకునీ అంత ప్రేమగా చూడ్లేదు. నిజానికి ప్రేమ వొలకబోస్తూ కూర్చుంటే డబ్బెలా కూడుతుంది. డబ్బు కూడందే తన 'చావు'బాగా ఎలా జరుగుతుంది? ఆ ఉద్దేశంతోనే మొగుడ్ని కూడా ఒక్క నిమిషం కొడుకుల్ని ముద్దాడనివ్వలేదు.

బాలవ్వ కాపురానికొచ్చేనాటికి తన మొగుడు నాగమల్లయ్యకి ఎకరం నేలా, చిన్న మిద్దే ఉండేది.

(కాన్సరొచ్చి) చావుపుండు కార్నెల్లు నిండి తన నాగమల్లయ్య చనిపోయే నాటికి బాలవ్వ చేతుల్లో ఇరవయి తులాల బంగారము, ఎనభై ఎకరాల నేల, రెండు కూరగాయ తోటలు, ఊరి అప్పు ఖాతాల కాగితాలూ దక్కాయి.

అనవసర ఖర్చుని తను మొగుడి శవాన్ని కాలేయలేదు. కొడుకుల్తో ఎత్తించి బొందపెట్టింది. కానీ? తను మాత్రం తన శవం మాత్రం తప్పక కాలేయించుకోవాలనుకుంది కాష్టం లోనే తను.

అందుకే- బంగారం.. డబ్బు..

బిగదీసి కట్టిన నారపోచల మధ్య నుంచి తెల్లగుడ్డ గాలికి రెపరెపలా డుతోంది. బాలవ్వ చనిపోయిన కలలాగే.

అతి నిశ్శబ్దంగా నడుస్తోంది శవం..

ఊరు దాటిన అయిదో గజానికే బిడ్డ ఏడవటం మానేసినట్టుంది. కాష్టానికి కాస్త దూరంగా పాడె దించారు.

దింపుడుగల్లం చేశారు. తుమ్మలి వాడే పూజచేసి నీళ్లు చల్లాడు.

బాలవ్వ పెయి మీద గంటీలు తీయాలన్నారు. అవి నాకే చెందాల న్నది బిడ్డ.

బలిమిగా లాగాడు నర్సయ్య. చెవిరంధ్రాలు నిశ్శబ్దంగానే తెగిపోయా యి.

"ఖర్చు మేం పెడతన్నం. మాకే చెందుతయి." అన్నది లచ్చవ్వ.

ఇద్దరి మధ్యా తిట్లు, వాదాలూ జరిగాయి.

పరుశరాములు, నాగరాజం అక్కవైపే వాదించడంలో నర్సయ్య చేతిలోంచి గంటీలు స్థలమార్పు జరిగి ఆడబిడ్డ చేతిలోకి చేరక తప్పలేదు.

పాడె మళ్లీ లేచింది.

తుమ్మలి డప్పు మళ్లీ మోగింది. శవం ముందుకు సాగింది.

అడుగులు తడబడుతున్నాయి. ఆగిపోయాయి.

పరుశరాములు ఆశ్చర్యపోయాడు. తుమ్మలి ఆశ్చర్యపోయాడు.

పాడె వోస్తున్న నలుగురూ వెనకాతల వచ్చిన ఆడవాళ్లిద్దరూ.. ఆ కళ్లన్నీ ఆశ్చర్యపోయాయి.

శవాన్ని మోస్తున్న నర్సయ్య తనే శవమైపోయినట్టున్నాడు.

ఆ కాష్ఠం-

కష్టపడి పేర్చిన కాష్ఠం-

రాత్రి నిద్ర లేకుండా పేర్చిన కాష్ఠం-

ఏమైందోకాని అక్కడంతా బూడిద మాత్రం వుంది.

> "శవం కోసం పేర్చిన కాష్ఠం శవం రాకముందే కాలిపోయినట్టు ఆ బూడిద సాక్ష్యం చెబుతోంది"

శవం కోసం పేర్చిన కాష్ఠం శవం రాకముందే కాలిపోయినట్టు ఆ బూడిద సాక్ష్యం చెబుతోంది.

నర్సయ్యకు ఏడుపొచ్చింది లచ్చవ్వకు మల్లే-

పాడె దిగింది.

నర్సయ్యకు కోపమొచ్చింది సూర్యుడికి మల్లే-

మంటల్లాంటి గీతలు కళ్లల్లో ఏర్పడ్డంతోటే చెట్లు విరిచేస్తున్నట్లు పళ్లు ఫెళఫెళమన్నాయి.

"లంజ కొడుకుల సంగతి.. చెప్త" మనసు ఏమంటుందో కాని నర్సయ్య కాళ్లు మాత్రం భయంకరంగా వెనుదిరిగాయి.

మాదిగిండ్లవైపు భూకంపంలా వెళుతున్నాడు నర్సయ్య.

చింతచెట్టు కింద నిలబడి చుట్టూ చూసేడు. నిశ్శబ్దంగా వుంది. దూరం గా ఓ గుడిసె దగ్గర నలుగురయి దుగురు కూచుని వున్నారు. పేలుతున్న ఫిరంగుల్లా అడుగులేస్తూ వాళ్లవైపుకు నడిచాడు.

"రాజాలూ", కాసేపాగి, "మీరన్నం త యిత్తగని జెర జల్ది రాండ్రి" చింతచెట్టు నీడకు చల్లబడ్డట్టు చాలా చల్లగా మాట్లాడేడు.

వాళ్లు మరో మాటనలేదు. అందర్నీ పిలుచుకుని లేచారు గొడ్డళ్లతో సహా నర్సయ్య లొంగిపోవడం మాదిగలకు సంతోషంగా వుంది.

చింతల్లో కట్టె కొట్టేస్తున్నారు.

చాలా హుషారుగా గాలికి ఊగే కొమ్మల్లా ఊగుతూ టకటకా పనిచేస్తు న్నారు. పెరిగిన కొండను ఎక్కేసినంత సంతోషం వాళ్లని హుషారుగా పని చేయిస్తోంది.

ఆడాళ్లు పాడె చుట్టూ కూర్చు న్నారు.

ఆడది కాకపోయినా ఆడాళ్ల మ ధ్య శవం దగ్గరే కూర్చున్నాడు నాగ రాజం.

పరుశరాములు దూరంగా వెళ్లి తాటిచెట్టు కింద కూచుని ఎటో చూస్తున్నాడు.

నర్సయ్య, ముత్తడు మంగపొద దగ్గర మాట్లాడుకుంటు న్నారు.

చూస్తున్నంత సేపట్లోనే కాష్ఠం పేర్చటం పూర్తయిపోయింది.

అందరూ కాష్ఠం వద్దకి చేరారు.

ముత్తడు మాత్రం రాలేదు. ఎటో వెళ్లినట్టున్నాడు.

మగవాళ్లంతా అక్కడే ఉన్నట్టుగా చాలామందున్నారు మాదిగలు.

పాడె లేచింది.

పాడెలోని బాలవ్వ లేచింది. కాట్లో పడుకోబెట్టబడింది.

బాలవ్వ మీద కట్టె పేర్చుతున్నారు అందరూ కలిసి.

పెద్ద పెద్ద మొద్దులు తెచ్చి బాలవ్వ మీద పెడుతుంటే చాన్నాళ్ల కసినంతా తీర్చుకుంటున్నట్లు హుషా రుగా అన్పించింది మాదిగ వాళ్లకు!

పరుశరాములు చిల్లుల కుండతో కాష్ఠం చుట్టూ తిరిగి ఎడంచేత్తో కొరివిపెట్టాడు. పొగచూరుతున్న కాష్ఠం మీద మీసాలతను కిరోసిన్ జల్లు తుంటే, 'మంట', గుప్పున లేస్తోంది.

ఎందుకో మాదిగలు చాలా సంతోషంగా కనిపిస్తున్నారు.

బాలవ్వ చాలావరకు కాలిపోయింది.

నర్సయ్యవాళ్లు అందరూ స్నానాలు చేయడానికి బావివైపు వెళ్లారు. బీడీ కాల్చుతూ వచ్చిన వొడ్డె ముత్తడు నర్సయ్య కోసం వాళ్లనడిగి బావివైపు వెళ్లిపోయేడు.

తృప్తిని చప్పరిస్తూ, హుషారును మింగుతూ మాదిగలు ఊరి మొఖాన నడిచారు.

వాళ్ల పోరలు కొందరు ఏడుస్తూ, రొప్పుకుంటూ పరిగెత్తుతూ ఎదురొస్తున్నారు.

"ఏమైందిరా?" అన్నాడు ఎర్ర రుమాలతను. అతనితో పాటు మరో ఇద్దరూ అదే అడిగారు.

"మంట" అని అస్పష్టంగా వెక్కిళ్లు పడుతూ ఏడుస్తూ అంటున్నారా పోరలు. అంతకంటే ఏమీ చెప్పటం లేదు.

కాదు జరిగింది చెప్పటానికి ఆ అమాయకత్వానికి నోరు రావటం లేదు. మీసాలతను మరికొందరు గాభరాపడుతూ పరిగెత్తారు. ముసలాళ్లు పరుగుతో ఊహలు పోతూ నడిచారు.

పరిగెత్తుతున్న ఆ కళ్లు ఆత్రంగా ఉన్నాయ్.

తీరా వచ్చి గుడిసెల్ని చూసిన ఆ కళ్లు అట్టే ఆగిపోయాయి.

కళ్లు కొయ్యబారి చూస్తున్నాయి.

వాళ్ల ఒక్కొక్కరికీ ఒక్కొక్క కాష్ఠం ఎదురుగా రగులుతూ కన్పించింది. ●

### కొత్త శీర్షిక

సమస్యలన్నీ యథాతథమే.
కొత్త సమస్యలు ఎన్నో వచ్చినా
పాతవన్నీ పరిష్కారం కానివే.
ఎన్నో సంఘటనల
యదార్థ వ్యధల
జీవన సారాంశమే కథ కథనాలు.
పాత కొత్తల
మేలు కలయిక కథలసారం.
సరికొని పాత చిక్కులు
విడిపోని గతం ముడులు
నాటి సమాజ స్థితిగతులు
నేటికీ మారని వైనాన్ని తెలుసుకొనే
మహత్తర కథల పరంపర

## కథల వంతెన

(నాటి తరంవారి కథలు నేటి తరానికి)

ఈ శీర్షికన ఆలోచింపజేసే వైవిధ్యభరిత
25 ఏళ్ల క్రితం రాసిన కథలకు ఆహ్వానం

-సంపాదకులు

అక్షరయాన్
TELUGU WOMEN WRITERS FOUNDATION

'జనగణమన' గీతం వినగానే భారతీయుల ఛాతి గర్వంతో ఉప్పొంగుతుంది. త్రివర్ణ పతాకాన్ని చూడగానే అభిమానంతో మనసు సెల్యూట్ చేస్తుంది. దేశం పట్ల మనకుండే ప్రేమకు సంకేతం అది. 1950 జనవరి 26 న 'ప్రజలే పాలకులు'గా మనం రూపొందించుకున్న రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చుకొని ఆరోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాము.

గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా అక్షరయాన్ మహిళా రచయిత్రులు వ్రాసిన దేశభక్తి కవితలు మీ కోసం...



నిర్వహణ
– విశ్వైక
అక్షరయాన్ ప్రధాన కార్యదర్శి

## గణతంత్ర దినోత్సవం

ఇదే మనకి చాలా ప్రత్యేకమైన
పండగ, భారతదేశపు స్వేచ్ఛా
స్వాతంత్ర్యపు గాలుల పీల్చిన
రోజు అదే మన జనవరి 26.
ప్రతి ఏటా జరుగు పండుగ
మదిని ప్రత్యేక స్థానమున్న పండగ
దేశ ఔన్నత్యానికి గుర్తుచెప్పినది
నేటికీ సాటిలేని పండగే !!.
ఈనాడు ఎర్రకోటపై ఎగురు
మువ్వన్నెల జెండా మువ్వన్నెలైనది
దేశ విదేశాల ప్రతినిధులు
తిలకించ అరుదెంచ
సర్వ కళల నిష్ణాతులు
సర్వ రంగాల ప్రతినిధులు
సైన్య విన్యాసాలు సకల కళల
ప్రదర్శనల సంగీత సాహిత్య
దీవెనల అమృత సరళిలో
అత్యుత్తమ కళాఖండాల
వెలుగుల తళుకులలో
ఆనందాల ఆదర్శాలతో
వేదికని అలంకరించు అందాలు.
ఆనందాలు
పంచ సర్వ కళల ప్రావీణ్యం
తిలకింతురెందరో,
హర్ష సంతోషాలతో
దివ్యం గా మహోత్సవంలా జరగు!!!
-కె.కె.తాయారు

## జయగంట!

గగనగగన జయగంట
జనగణమన అంటూ జనమంతా
తొలి ఆదివాసీ మహిళ ద్రౌపది ముర్ము
దేశాధినేత గా సర్వసైన్యాధిపతిగా
ప్రపంచ చరిత్రలో
నారీశక్తిని చాటిన దేశం
చంద్రయాన్ తో జైత్రయాత్ర
సూర్యునివైపుగా పయనం
దివ్యభవ్య రామమందిరం అయోధ్యలో
కొత్త పార్లమెంట్ లో కొలువు
స్వచ్ఛ స్వేచ్ఛ వికసిత భారత్
సబ్ కా సాత్ సబ్ కా వికాస్
యువతకు భవిత
త్రివిధ దళాల్లో
నారీ శక్తుల యుక్తి తో
సరిహద్దు రక్షణలో అంతటా వారే
భాష కులజాతి
వర్గవర్ణ విభేదాలు మరచి
ప్రగతిపథంలో
అందరం ఒకటే అని చాటుతూ
వడివడిగా నిర్మల గంగామాతలా
సాగుతోంది భారతరథం
అదే అదే మన ఫథం
-అచ్యుతుని రాజ్యశ్రీ, హైదరాబాద్

## వీరోచిత పోరాటం

జయ జయహే భారతి
జయ జనని వందనం
మువ్వన్నెల జెండాతో
వన్నె తెచ్చి ఈ ధరణి //2//
సమ భావన సమతత్వం
సత్యాగ్రహ పిలుపుతో
సమరాన దూకిరి
సాధించిరి ఈ ఘనత
స్వేచ్ఛ వీరులై పూరులై
ఉద్యమించే ధీరులై
ఫిరంగులై తూటాలై
వెడలే జన ప్రవాహమై
వందేమాతరం వందేమాతరం.
ఉప్పనే ఉద్యమించే
ప్రతిఘటించే ఐక్యతగా
వందేమాతరం అని
నినదించిరి ముక్తకంఠమై
సాధించిరి వీరోచిత పోరాటం
సమరయోధులై
ఇదేగా స్వాతంత్రం
ఇదేగా మన స్వాతంత్రం
వందేమాతరం వందేమాతరం



-కొడవటిగంటి విజయ

## సుదినం!



సుదినము నేడు సుదినం
స్వతంత్ర భారత గగనం
దివాకర రజనీకర ఆగమనం
జాతీయ పర్వదినాల గగనం
ఎగిరే త్రివర్ణ కేతనం
రాజ్యాంగ రూపకల్పనం
సహకార సంక్షేమ పథకం
ప్రజలక్షేమం ప్రభుత్వానికి సాధకం
ఆంగ్లేయులు భారతావనిపై
లోహపాదం మోపినదినం
భారతి కష్టపు
వీణాతంత్రుల తెంపిన పాపిష్టి పెత్తనం
స్వాతంత్ర్య సమర యోధుల కృషిఫలితం
తోక ముడిచి వెన్నుజూపిన పలాయనం
అస్తవ్యస్త పరిస్థితుల చక్కబరిచి
అంబేద్కర్ మహేతిహాసం
ప్రజాస్వామ్య విధాన రాజ్యాంగం అమలుపరిచిన
దినం అదే గణతంత్ర దినం సుదినం పర్వదినం
-గంగరాజు పద్మజ, హైదరాబాద్


## నా జెండా



స్వేచ్ఛా రెక్కలు విప్పుకుని-వినీలాకాశం లో
వినత శోభతో ఎగిరే విహంగమా!
ధ్రువ తారలా కీర్తి వెలుగులు - విరజిమ్ముతున్న కాంతిపుంజమా!
తెగించి పోరాడి గెలిచిన-తెలుగు వీరుల తేజమా!
ఆంగ్లేయుల తుపాకుల కాల్పులకి-ప్రవహించిన రుధిర రక్తమా!
భరతమాత ప్రియపుత్రుల-పింగళి వెంకయ్య గారి ఊహాచిత్రమా!
భారతీయతను చాటు అక్షరాలెన్ని ఉన్నా- భాష కందని భావమా!
హిమాలయ శిఖరోన్నత నీ ఘనతకి- మనసున ఉప్పొంగిన గర్వమా!
శాంతి, సత్య, అహింసల - సమరసభావ సుందర త్రివర్ణ పతాకమా!
తిరుగులేని త్యాగఫలమా!-తరిగిపోని ధనమా!-నిండు జాతి గౌరవమా!
ఎల్లలే లేని నీ చరిత్రను, ఎంతని పొగడ గలను?- ఏమని వర్ణించ గలను?
కీర్తి తరగల తుషార బిందువులు, మనసునంతా తడిపివేస్తుంటే,
అవనత శిరస్సుతో, ఆనందభాష్పాలతో నీకు వందనమిడుట తప్ప.
-అడవి. అన్నపూర్ణ.

## భారతావని

ఎందరో మహానుభావుల పుణ్యఫలం
భారతీయులం ఆత్మబలం
అంబేద్కర్ మొదలుపెట్టిన వైభవం
రాజేంద్రుడు ముందుకు నడిపిన రథం
ప్రజాస్వామ్య విధానం
దేశానికి మూల స్తంభం
ప్రజా శ్రేయస్సు తొలిఆశయం
ప్రతి ఒక్కరి హక్కుల
పరిరక్షణ నందనవనం
ప్రజాస్వామ్య దేశానికి నిదర్శనం
దేశాభివృద్ధికి దిశా నిర్దేశం
దేశ ప్రజల భవిష్యత్తుకు ప్రకాశకిరణం
దశాబ్దాలుగా మనల్ని ముందుకు నడిపిస్తున్న
రక్షక కవచం మన ఈ రాజ్యాంగం
భరతమాత ముద్దుబిడ్డలుగా
తేజ తేజరిల్లుతూ హక్కులను స్వీకరిస్తూ
భారతీయ ఔనత్యాన్ని చాటుతూ
భారతావనికి
వందన అభినందనలను తెలుపుకుంటూ
గర్వంగా జరుపుకుందాం గణతంత్ర దినోత్సవం



-జోరు.పవిత్ర క్రిష్ణ

## "జెండా పండుగ – నా జ్ఞాపకం"

జెండా పండుగ వస్తుందంటే చాలు
అంతులేని అంతులేని ఆనందం , ఉత్సాహం
ఒకరోజు ముందే జెండా రంగుల బట్టలు కుట్టించుకోవడం
తరగతి గదిని రంగు కాగితాలతో చక్కగా అలంకరించడం
అందమైన ముగ్గులు పెట్టడంఆటలు,
పాటల పోటీల్లో పాల్గొనడం
ఆరోజు ఉదయాన్నే బడికి వెళ్ళడం
గురువులకు భక్తితో నమస్కరించడం
జెండాలు పట్టుకుని వీధి వీధి తిరగడం
అన్ని కార్యాలయాల్లో జాతీయ గీతం పాడడం
చదులమ్మను.. దేశ నాయకులను పూజించడం
బడిలో జెండా ఎగిరేయగానే భక్తితో
సెల్యూట్ చేసి జనగణమన గీతాన్ని పాడడం
ముందురోజు జరిగిన పోటీల్లో గెలిచిన వారికి
బహుమతి ప్రదానం లో కేరింతలు కొడుతూ చప్పట్లు కొట్టడం
వచ్చిన బహుమతులను ,బడిలో ఇచ్చిన చాక్లెట్లు,
స్వీట్లు తెచ్చి గర్వంగా ఇంటికి వచ్చి అమ్మ చేతిలో పెట్టడం
అమ్మ కళ్ళల్లో సంతోషం,.. ఇచ్చిన తీయని ముద్దు
అదో అందమైన అనుభూతి,
ఆరోజులు ఇప్పుడు అందమైన జ్ఞాపకాలు .



-వేముల ప్రేమలత

## నా దేశపు రత్న దీపికలు



ఎగిరే ఆ త్రివర్ణ పతాకం
ఎందరో వీరుల త్యాగఫలం.
అరణ్యంలో అమరుడైన
అల్లూరి ఇంకా అక్కడే
పచ్చని చెట్ల ఆకులపై
చిరుజల్లుల్లో మెరుస్తున్నాడు.
అజాద్ హింద్ ఫౌజ్ నినాది నేతాజీ
నేటికీ గగన సీమలో మెరుస్తున్నాడు.
అదిగో చిరునవ్వుతో ఉరితాడును ముద్దాడిన
నా భగత్ సింగ్ నేటికీ మా గుండెల్లో
అఖండ జ్యోతిలా వెలుగుతూనే ఉన్నాడు.
"అహింసో పరమో ధర్మ" అన్న మా బాపూజీ
బోసినవ్వులతో ఇప్పటికీ
మార్గదర్శనం చేస్తూనే ఉన్నాడు.
బ్రిటిష్ మూకలను పరిగెత్తించిన మహావీరులకు
చరిత్ర ఎల్లవేళలా శిరస్సు వంచి
నమస్కరిస్తూనే ఉంది.
సలాం అంటూ చెయ్యెత్తి జై కొడుతూనే ఉంది.
నా దేశం రత్నగర్భ
నా దేశం పచ్చని ప్రకృతికి నిలయం.
నా దేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక.
ఇక్కడ శాంతికపోతాలు స్వేచ్ఛగా ఎగురుతాయి.
ఇక్కడ కొండలు మాతో
గుండెల నిండా ఊసులాడతాయి.
పక్షులు జన జాగృతానికి
జాతీయగీతాలు ఆలపిస్తాయి.
నదీజలాలు మా కళ్ళకు
కర్తవ్యాన్ని బోధిస్తాయి.
స్వేచ్ఛా స్వాతంత్ర్యం
మా నరనరాల్లో నింపిన
త్యాగధనుల ఫలితానికి నిదర్శనమైన
ఆ త్రివర్ణ పతాకానికి నా వందనం...
అభివందనం .
-ఎస్. లహరి

## విజ్ఞాన ఘని

సుసన్నాను కనుగొన్న ధరిత్రి
వేద నాద జనయిత్రి
సకల కళల సావిత్రి
సుందర సుశ్యామల సుజల
సుఫల జీవదాత్రి
సామ్యవాద సార్వభౌమ సంధాత్రి.
ఆదరించె సంస్కృతి
అలరించె ప్రకృతి
అందమైన ఆకృతి
మహా మహుల కన్నతల్లి
మహిమాన్విత చరిత ధాత్రి
పురాణేతిహాసాల పుటీనిల్లు
పుడమిలోన ఘన కీర్తి
విశ్వ గురువు విజ్ఞాన ఘని
నాదేశం భారతదేశం
అతి పెద్ద లిఖిత రాజ్యాంగం
భిన్నత్వంలో ఏకత్వం
ఉపకండ శోభితాలు
ఉర్విలోన ఫరీడవిల్లు
ఆధ్యాత్మిక చేతనం
అన్నింటా ఆదర్శం
అదే మన భారతీయం
-శైలజ రాంపల్లి



## పుణ్యభూమి నా భారతావని

సమైఖ్య భారతి నా దేశం
సమతా మమతల ప్రతిరూపం .
కుల మతాల కతీతం
మానవత్వమే మా లక్ష్యం .
భిన్న భాషల సంస్కృతుల కదంబం
ఎన్నో కళలకు సాకారం ..
వాల్మికి వంటివం టి కవులకు తాన్సేన్ వంటి
గొప్ప గాయకులకు పుట్టినిల్లు ,
సంస్కృతి, సాంప్రదాయాలకు ఆటపట్టు,
ప్రపంచ ఖ్యాతి నొందిన రామాయణ. భారతాలకు
వేదోపనిషత్తులకు మూలస్థానం మా దేశం .
దాన,ధర్మాలకు ప్రతీకలు మా ప్రజలు
పురుషోత్తములు , పతివ్రతలు, నడయాడిన దేశం
పుణ్య నదులు ప్రవహిస్తున్న రామరాజ్యం .
ఝాన్సి, రుద్రమ్మ ,ఇందిర వంటి పాలకులు
సింధు ,సైనా,హంపి వంటి ప్రముఖులు
"స్త్రీ శక్తికి "నిదర్శనముగా నిలిచిన నా రీ మణులు
ఒకరి కష్టాలలో తోడుగా,
వారి ఆనందాలలో జోడుగా నిలిచే జనం
ప్రపంచానికే ఆదర్శముగా నిలిచిన
కుటుంబ వ్యవస్తలు ,
అందుకే అంటాను పుణ్యభూమి నా జన్మ భూమి
ఇక్కడ పుట్టడమే ఒక గొప్ప వరం
-ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి

## జై జవాన్

భారతమాతాకీ జై, జై జవాన్,
అన్న నినాదాల హోరుతో..
తూటానై లేచాను చితిపై నుండి.

అల్విదా అనను,
సరిహద్దు అడుగడుగున
కనిపించని గస్తీనై సంచరిస్తా.

సెలవని చచ్చినా చెప్పను..
అమరజీవినై జన్మభూమికి
కంచెనై కంటిపాపలా కాచుకుంటా...
సెల్యూట్ అన్నారో , శవాన్నైనా...
శత్రువు గుండెను చీల్చి
శౌర్యాన్నై నిలుస్తాను.

నాకోసం కారే కన్నీటి చుక్కల్లోంచీ,
ఫిరంగి వదిలిన పేలుడునవుతా..
ప్రతి పౌరుడిలో దేశభక్తి బీజమవుతా...
ఆగిన సైనికుడి శ్వాసతో,

మువ్వన్నెల పతాక ఊపిరినై..
కోట్లగుండెల దేశపటమవుతా.

రాతిరి నక్షత్రాన్నై, కాపలా కాస్తా,
పగలు వెలుగునై, కవాతు చేస్తా,
గస్తీ గడపలో గర్వాన్నై నిలుస్తా.

ప్రాణత్యాగ తోరణంతో
కర్మభూమి సిగలో శిఖరాన్నవుతా,
మళ్ళీ మళ్ళీ సైనికుడినై జన్మిస్తా.
-శ్రీమతి వి.యస్.మంజుల
హైదరాబాద్

## భారతదేశ కీర్తి..వైశిష్ట్యం

నాదేశం నాలుగు వేదాలు పుట్టిన 'పవిత్ర' 'దేశం'
భరతమాత బిడ్డగా నా జన్మ 'పునీతం'
నాదేశ ఔన్నత్యం 'హిమవన్నగమే' !
అమరవీరుల సమరయోధుల 'మాతృమూర్తి'
అజరామరం స్మరణీయం వారి 'దేశభక్తి'
జీవనదులే తనకి వజ్ర 'వడ్డాణం'
ప్రకృతే తనకు పచ్చని 'పట్టుచీర'
ఎత్తైన శిఖరాలు అమృత 'కలశాలు'
పసిడి పంటలే కంఠంలో 'హరితహారం'.
వాదనలు లేని 'వేదభూమి' నాదేశం



భిన్నత్వంలో ఏకత్వమైన 'ఛాత్రము'
సంస్కృతి సంప్రదాయాల 'కాసారం'
నీతి నిజాయితీల 'నిండుజాబిలి'.

శాంతి సౌభాగ్యాల సౌందర్య 'సాగరం'
ఆరావళీ నీలగిరులు గులాబీల్లా 'సొబగులు'
అవనికి వన్నె తెచ్చే ఆనంద 'నందన' 'వనం'
సౌందర్య శిల్పకళలలో కనుదోయికి 'కాణాచి'
తెల్లదొరలను తరిమికొట్టిన 'పౌరుషగడ్డ'
దృఢమైన త్రివిధ దళాలతో నిత్యం 'పహారా'
కళకళల త్రివర్ణ పతాక 'రెపరెపలు'
చదువు సంస్కారాల 'కలువల' 'కొలను'
నిత్యం నాదేశం 'సుభిక్షం' 'శోభాయమానం'
'మేరా' 'భారత్' 'మహాన్' ! 'జయహో' !!



-వై. మంజులత

## మువ్వన్నెల పతాకం

మురిపెముగా ఎగురుతోంది మువ్వన్నెల పతాకం
ముదముతో నిండుతోంది ప్రతి(భారత) పౌరుని హృదయం
శాంతిని ప్రభోదించే కపోతాల ధవళ వర్ణమీ పతాకం

ఆకుపచ్చతో సస్యశ్యామలాన్ని కాంక్షించినదీ పతాకం
పోరాటాల చరిత్ర తెలిపే ఎరుపు తో మెరిసినదీ పతాకం
అశోక ధర్మ చక్రంతో ఆదర్శమైనదీ పతాకం .

లాల్ బాల్ పాల్ ల పోరాట ఫలితమీ పతాకం
గాంధీజీ నెహ్రూజీ నేతాజీల కష్ట ఫలితమీ పతాకం
బ్రహ్మన్న , భగత్, రాజేంద్రల త్యాగమీ పతాకం
అల్లూరి , ఆజాద్ ల ఆగ్రహ ఫలితమీ పతాకం
పటేల్, కలాం , సరోజినీల దౌత్య ఫలితమీ పతాకం
అమృత భాండం భరత ఖండమని తెలిపినదీ పతాకం
భాషలెన్ని ఉన్న జాతీయ గీతమొక్కటని మురిసినదీ పతాకం
మతాలెన్ని ఉన్న మానవత్వమొకటే మతమన్నదీ పతాకం
కులాలెన్ని ఉన్న కుటిలత్వం లేనిదే కులమన్నదీ పతాకం
పార్టీ లెన్ని ఉన్న పరోపకారమే పరమావధన్నదీ పతాకం
వర్ణవర్గ విభేదాల కతీతమైనదే ఐకమత్యమన్నదీ పతాకం
జాతి ప్రాంత భేదం లేక ఏకమైనదీ ఆత్మీయ పతాకం
ఆత్మగౌరవం ఆకాశమంత ఎత్తు నుండాలన్నదీ పతాకం
తరతరాల భవితకి భద్రతీ భారత పతాకం

సంస్కృతీ సంప్రదాయాల కాలవాలమీ పతాకం
విశ్వమంతా ఘనకీర్తి తో వినతి కెక్కినదీ పతాకం
కలాలెన్ని ఉన్నా గళమొక్కటై ఎగసినదీ పతాకం
కల్లోలాలెన్నున్నా కలిసికట్టుగా ఎగరేసినదీ పతాకం
నవయుగానికి నాంది వాక్యమైనదీ పతాకం
నవశకానికి మార్గదర్శకమైనదీ పతాకం
భావితరానికి బాట చూపించే దిక్సూచీ పతాకం
భారత ఆచారవ్యవహారాలకు ఆలవాలమీ పతాకం
అమరవీరుల త్యాగాలకు జ్ఞాపకమీ పతాకం
భావిభారత పౌరుల భవిత నిర్మించేదీ పతాకం
వందేమాతరమని నినదించినదీ పతాకం
జనగణమణ యని అందరినీ దరికి చేర్చినదీ పతాకం
మత్తును పారద్రోలి మేల్కొలపాలీ నవయుగ పతాకం
మంచిని పెంచి నవతరాన్ని నడిపించాలీ నవశక పతాకం
మంచి మార్పు తో యువతరాన్ని మురిపించాలీ పతాకం
నీతిపద్యాలతో యువత గతిని మార్చి మైమరపించాలీ పతాకం
భరతబిడ్డల పౌరుషాన్ని రగిలించాలీ పతాకం
అజ్ఞాన తిమిరాల తరిమి విజ్ఞాన జ్యోతుల వెలిగించాలీ పతాకం
దేశప్రగతికి బాసటై బంగారు కాసుల కురిపించాలీ పతాకం
ఎందఱో మహానుభావుల ప్రాణ త్యాగమీ పతాకం
మరెందరో మాననీయుల ప్రతీక ఈ పతాకం
ఇంకెందరో మహనీయుల బలిదానమీ పతాకం
మరిపించాలి మురిపించాలీ మైమరిపించాలీ ... (కోరస్)
రగిలించాలి , వెలిగించాలి , కురిపించాలీ...
రగిలించాలీ వెలిగించాలీ కురిపించాలీ





– నామని సుజనాదేవి

## వృద్ధమేక ఉపాయం

కథ

నరసింహపురం గ్రామంలో ఒక మేకల గుంపు ఉండేది. ఒకసారి ఆ మేకల గుంపులోని మేకలన్నీ ఒక ప్రాంతంలో చెట్ల ఆకులను,కాయలను తింటున్నాయి. ఆ ప్రాంతానికి సమీపంలో ఒక అడవి ఉంది. అందులో అనేక క్రూర మృగాలున్నాయి. ఇంతలో ఒక చిన్న మేక ' మే,మే ' అంటూ గట్టిగా అరవసాగింది. ఆ పెద్ద మేకలన్నీ కలిసి దానిని అరవవద్దని అవి ఎంత చెప్పినా అది వినలేదు. ఇంతలో ఈ అరపు అక్కడికి సమీపంలోని అడవిలో ఉన్న ఒక తోడేలు విన్నది. అది మేకల గుంపు ఇక్కడ ఉన్నదని గ్రహించి ఈ వైపునకు వచ్చింది. వాటిని చూసిన పెద్ద మేకలు అన్నీ " ఓ బుజ్జీ! చూశావా! నీ అరపు మనకు ఎంత నష్టాన్ని తెచ్చిపెట్టిందో !ఆ తోడేలు మనం ఉన్నామని గ్రహించి ఈ వైపునకే వస్తున్నది. ఇప్పుడు అది మనలో ఏదో ఒక దాన్ని చంపి పట్టుకొని పోతుంది. మేము అరవవద్దని ఎంత చెప్పినా నీవు వినలేదు "అని అన్నాయి.

అప్పుడు వాటి మాటలను విన్న అందులోని ఒక వృద్ధమేక " ఇప్పుడు జరిగిన దానికి చింతించడం మూర్ఖుల లక్షణం. జరగబోయేది ఆలోచించండి. అపాయం వచ్చినప్పుడు ధైర్యంగా ఉండాలి. ఏదో ఒక ఉపాయం ఆలోచించండి" అని అంది. అప్పుడు మిగతా మేకలు ఆ వృద్ధమేకతో " మాకు ఈ పరిస్థితులలో ఏ ఉపాయం తోచడం లేదు. మాకు చాలా ఆందోళనగా ఉన్నది. అనుభవజ్ఞురాలవైన నీవే ఆ ఉపాయం ఆలోచించి మాకు చెప్పు. నీవు చెప్పినట్లు చేస్తాం"అని అన్నాయి. అప్పుడు ఆ వృద్ధ మేక " ముల్లును ముల్లుతోనే తీయాలి. ఇప్పుడు అది చేసినట్లే మనమందరం కూడా చేద్దాం" అని అంది. అప్పుడు అన్నీ మేకలు గట్టిగా' మే,మే' అని గట్టిగా అరిచాయి.


ఈ అరపులు విన్న అడవిలోని తోడేళ్లన్నీ ఒక్కసారిగా ఇక్కడ మేకలు ఉన్నాయని భావించి ఈ మేకల గుంపు వైపు రాసాగాయి. అప్పుడు మిగతా మేకలు "అయ్యో!ఈ వృద్ధ మేకకు మతి చెడినట్టుంది. ఇది చెప్పిన ఉపాయం బెడిసికొడుతున్నది. ఆ చిన్న మేక అరిస్తే ఒక్క తోడేలే వచ్చింది. ఇప్పుడు దీని మాటలు విని మనం అరిచేసరికి ఆ తోడేళ్ల గుంపుయే మన వైపుకు వస్తున్నది. కోరి మనం ఆపదను కొని తెచ్చుకున్నాం"అని అనుకున్నాయి.

కానీ అవి అలా గట్టిగా అరచేసరికి అక్కడ ఒక చెట్టు క్రింద నిద్రపోతున్న వాటి కాపలాదారు నిద్ర లేచి అక్కడికి వెంటనే తన కర్రతో పరిగెత్తుకొని వచ్చాడు. అక్కడికి వస్తున్న తోడేళ్లను అతడు చూశాడు. వెంటనే ఈ మేకల అరపులు విని అక్కడికి సమీపంలో ఉండి పనిచేసుకుంటున్న రైతులు మేకలకు వస్తున్న ప్రమాదం పసిగట్టి కర్రలు పట్టుకొని పరిగెత్తి వచ్చారు. వారందరూ తోడేళ్ల వైపు పరిగెత్తారు. ఊహించని ఈ పరిణామానికి తోడేళ్లన్నీ భయపడి అడవికి పారిపోవడం ప్రారంభించాయి. వారు సంతోషంతో వాటిని కొద్దిదూరం వెంబడించి తిరిగి వచ్చారు.

ఆ మేకల గుంపుకు తోడేళ్ల గండం తప్పింది . ఆ కాపలాదారు రైతులందరికీ తన ధన్యవాదాలు తెలిపాడు. ఆ మేకలన్ని వృద్ధమేక అనుభవానికి సంతోషించి దాని ఉపాయాన్ని తప్పుగా అర్థం చేసుకున్నందుకు చింతించి దానికి తమ ధన్యవాదాలు తెలిపాయి.



-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535




## ఆనందం కలిగించే, 'అధికం' కాని 'ప్రసంగాలు'


పుస్తక సమీక్షలు

హాస్య రచయితగా, కవిగా, నాటక రచయితగా, నవల, పరిశోధన పత్రాల సమర్పకుడిగా, ఆంధ్రప్రదేశ్ (అవిభక్త) సాహిత్య అకాడమీ వారి పంచకావ్యాలు (పారిజాతా పహరణం ఆముక్త మాల్యద మను చరిత్ర, వసు చరిత్ర, మరియు పాండురంగ మహాత్యం) సంపాదకుడిగా, 'నవత' పత్రిక సంపాదకులుగా, ముఖ్యంగా ముత్యాలముగ్గు నిర్మాతగా స్వర్గీయ ఎమ్వీయల్ (మద్దాలి వెంకటలక్ష్మి నరసింహా రావుగారు) తెలుగు ప్రపంచానికి చిరపరిచితులు. ఇక ఫీచర్స్, రేడియో ప్రసంగాలకు ఎమ్వీయల్‌గారు పెట్టింది పేరు. వీరి ప్రసంగాల పన్నీటి జల్లుల్లో తడిసి పరివశించని ఆంధ్ర సాహితీప్రియుడు లేడు అంటె అతిశయోక్తి ఎంత మాత్రమూ కాదు. ఆంధ్రులే కాదు. బరంపురం (ఒడిషా) నుండి బళ్ళారి (కర్ణాటక) వరకు తెలుగు తెలిసిన పాఠక లోకాన్ని పరవశింపచేసారు.

1984లో స్వాతి వారపత్రిక ఈ సంకలనం లోని గల్పికలన్నింటినీ 'వీక్లీ కాలమ్'గా ప్రచురించింది. 2014లో 'కౌముది' అంతర్జాల పత్రిక పునర్ముద్రించింది.

'మేత' కన్నా 'నెమరు వేత', బావుంటుందం టారు ముళ్ళపూడి వెంకటరమణగారు. స్వాతిలోని 'మేత' కన్నా కౌముదిలోని 'నెమరు వేత' మరింత ప్రజాదరణ పొందిందట! అక్షజ్ఞ పబ్లికేషన్స్‌వారు ఇప్పుడు పుస్తక రూపంలో మనకందిస్తున్నారు. 'మరోసారి మేత' అందామా!

సంపుటి పేరు 'అధిక ప్రసంగం' అని ఇచ్చారు కాని ఎక్కడా అధికం అనిపించదు. ప్రతీ ప్రసంగం 3 లేదా 4 పేజీల్తో 'బాబాయి' అనబడేవాడు చెబుతున్నట్లుంటుంది. ఎక్కడా 'డైలాగు'లు ఉండవు. అన్నీ 'మోనోలాగ్'లే..



ప్రతులకు:అక్షజ్ఞ పబ్లికేషన్స్
12-11-1364, 2వ అంతస్తు
పరశర అపార్టుమెంట్స్
వారసిగూడ, సికింద్రాబాద్-61
సెల్:8341450673


అయితేనేం.. ఎక్కడా మనకు విసుగు పుట్టదు. వాక్యం వాక్యంలోనూ హాస్యరసం ఒలికించటంలో రచయిత తన ప్రజ్ఞను కనబర్చారు. బాబాయి, పిన్ని, వింటోన్న ఈ అబ్బాయి తప్ప మరో పాత్ర ఉండదు. బాబాయికి మరో పాత్రకు మాటలుండవు. అయినా సినిమాలు, గుళ్ళు, గంగా భాగీరధి సమానురాలు (గంభాసా) అయిన అద్దె ఇంటి ఓనర్ మీనాక్షమ్మగారు, యువతరం సంస్కృతి నలభీమపాకాలు, పల్లెటూళ్ళు పొగ గొట్టాల పట్నాలు, ఆఫీసు, ఆఫీసరు, పేకాట- ఒక్కటేమిటి! లోకాలోకనం చేస్తాడు బాబాయి. కచేరీ గది ఈ కుర్రాడికి అద్దెకివ్వాలనుకునే పిన్నిగారి జాణతనం, తన తమ్ముడి చెల్లెలికీ కుర్రాడిని కట్టబెట్టాలన్న ఆమె లౌక్యం, అటూ ఇటూ రెండు వేపులా 'బేలన్సు' చేస్తూ కర్రా విరక్కుండా పామూ చావకుండా నెట్టుకొచ్చే బాబాయి గడుసుదనం- వెరసి ఆసాంతమూ పాఠకుల పెదాల మీద మొలకనవ్వులే!

మచ్చుకు కొన్ని మీతో పంచుకుందాం-

దుస్తుల పొదుపు నటీమణులు. పథేర్ పాంచాలి సినిమాలో, కృష్ణుడు, ద్రౌపది పాత్రల్లేవని. సత్యజిత్‌రేని ఆడిపోసుకోవటం (14) న+ఆస్తికులు= ఆస్తిలేనివారు. కొన్ని ఆఫీసుల్లో రాత్రి పదింటికి క్యూడా గడియారం అయిదు కొట్టదు (ఆఫీసు కట్టెయ్యరు) సంధ్య వార్చడుకాని వాళ్ళాఫీసు టైపిస్టుకి సంధ్యావందనాలు చేస్తాట్ట.

ఎర్రటోపీల వాళ్ళే (పోలీసులు) ఏం చెయ్యలేరు. తెల్లముసుగేసుకున్న (విశ్వస్త) మీనాక్షమ్మ గారేం చెయ్యగల రు? యంగ్‌స్టర్‌కి కన్నీరునప్పుడు, జూనియర్ శ్రీరంజనికి నవ్వునప్పనట్లు. మూణ్ణిర్లప్పుడు నిద్రెందుకు? ఖాళీగా కనబడితే పందిరిగుంజకు పగ్గెప్పే రకం. అడిగికాదనిపించుకున్నా, అదో అందం. ఆఫీసర్ అక్షంతలేస్తే, ఆశీస్సులుగా భావించాలి. (పేకాటలో) ఎక్స్‌టెన్షన్ ముక్కరాక ఎకరాలమ్ముకోవటం,


అరువయి అయిదు పేజీలున్న ఈ 'అధిక ప్రసంగం'లో ప్రతి మాటా సెటైరే! అక్షజ్ఞ పబ్లికేషన్స్ వారికి అభినందనలు.




– కూర చిదంబరం
సెల్: 8639338675

## 'అరుగు' సాహిత్య వ్యాసాలు- డా॥ వి. త్రివేణి


ప్రాచీన ఆధునిక సాహిత్యాలకు సంబంధించి విమర్శ, విశ్లేషణ, పరిశోధనా వ్యాసాలు రాసే సామర్థ్యం వున్న రచనలు, తెలుగులో సాధికారికంగా వెలువరించడం, అందరికీ సాధ్యం కాదు. సెమినార్లలోని పరిశోధనా వ్యాసాలతో ఎనిమిదవ సంపుటి 'అరుగు' డాక్టర్ వి. త్రివేణి ప్రాచీన, ఆధునిక, వచన సాహితీ అధ్యాపక, రచనా, వక్తృత్వ ప్రతిభకు అద్దం పడ్తోంది. త్రివేణి- 8 సంక్షిప్త వ్యాస సంపుటికి 'అరుగు' పేరిట, ప్రతి ఇంటి ముందు వుండే ఒకప్పటి గృహ సౌందర్యాన్ని, సౌకర్యాన్ని మదిలో మెదిలింపచేయటం రచయిత్రి సాధించిన అరుదైన విశేషాంశం. ఈ అరుగుపై సాగిన సాహితీ ముచ్చట్లు 13 వ్యాసాలలో సంప్రదాయం, ఆధునిక సాహితీ విలువల వైవిధ్యం గుబాళిస్తోంది. సామాజిక ధర్మ వైలక్షణాన్ని నిర్దేశించే ఎఱ్ఱా ప్రగడ రచన దర్మ వ్యాధోపాఖ్యానం, పింగళి-కాటూరి జంట కవుల ప్రేమోపనిషత్తుగా బౌద్ధ విశ్వ ప్రేమాతత్వం



ప్రతులకు:
డా॥ వి. త్రివేణి
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు అధ్యయన శాఖ,
తెలంగాణ విశ్వవిద్యాలయం
నిజామాబాద్-503 322
సెల్: 9951444803

సౌందరనందము, జాషువా, మాడభూషి, బోయి భీమన్న, వేటూరి ప్రభాకర శాస్త్రి, వేదం వేంకట రాయశాస్త్రి, చిన్నయసూరి వంటి లబ్ధ ప్రతిష్టుల రచనా ప్రస్తావనలే కాకుండా సమకాలీన సాహిత్య సంబంధిత వస్తు వైవిధ్యం ఆకట్టుకొంటోంది. ఇతివృత్తం నాటకం, సామెత, కుటుంబ జీవనం, కరోనా మహమ్మారి ఏది అయినా సాహిత్య సంబంధితంగా డా॥ త్రివేణి సాహితీ అత్యుత్తమతను ప్రతిబింబింప చేసే పరిశోధనాయుత ప్రజ్ఞతో అత్యంతాత్మకంగా విశ్లేషణాత్మక వ్యాసాలు రచించారు. కరోనా మహమ్మారి చీనా దేశంలో పుట్టి విశ్వానికే మహా విపత్తు కలిగిస్తుందనే విషయం "చీన దేశే జనిం లబ్ధ్వా భూమౌవిష్వక్రప సర్వతః" అనే శివపురాణం శ్లోకంలో స్పష్టంగా ఉందని డా॥ త్రివేణి, ప్రస్తావన అద్భుతమైన విచిత్రంగా ఆసక్తి కలిగించే అత్యాధునిక స్పందనతో చదువరులను ఆలోచింపచేస్తోంది. డా॥ త్రివేణి అభినందనీయురాలు.



-జయసూర్య
సెల్:9014948336



పరిమళాల పువ్వులు
పువ్వుల్లాంటి పిల్లలు
పంచదార పూతరేకులు
పూత రేకుల్లాంటి పిల్లలు.

తళుక్కుమనే మెరుపులు
మెరుపుల్లాంటి పిల్లలు
తళతళల వెన్నెలలు
వెన్నెల్లాంటి పిల్లలు.

మల్లెపూల మనసులు
మెత్తనైన మనసులు

చంద్రవన్నెల మనసులు
చల్లనైన మనసులు.

సున్నితమైన పిల్లలు
సునిశితమైన పిల్లలు
స్వచ్ఛమైన పిల్లలు
సుమనసుల పిల్లలు



-డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

## 'గురువు' అంశంపై మంగళగిరిలోని అరవింద మోడల్ స్కూల్ విద్యార్థులు రాసిన కవితలు

-ఎం. కనకదుర్గా, తెలుగు టీచర్, సెల్:8333056782

### జ్ఞాన ప్రదాత గురువు

గురువు
అజ్ఞానం అనే చీకటిని పారద్రోలేవాడు
జ్ఞానాన్ని వరంగా ప్రసాదించే దైవం వంటి వాడు
మనల్ని సక్రమమార్గంలో నడిపించేవాడు
విద్యార్థుల జీవితంలో వివేకం నింపేవాడు
పిల్లలకు పాఠాలు చెప్పే పాఠకుడు
లక్ష్యసాధనకు సహకరించే స్నేహితుడు
విజయానికి దారి చూపే దార్శనికుడు
మంచితనానికి మారుపేరు ఉపాధ్యాయుడు
జ్ఞానం అనే భాండాగారానికి అధిపతి వంటి వాడు
మనుషులలోని కళలను గుర్తించే శాస్త్రజ్ఞుడు
ఎంతోమంది జీవితాల్లో వెలుగు నింపిన వాడు
అదే మన అందరం గౌరవించదగిన గురువు
-జి. తేజ ప్రమోద్
-9వ తరగతి

### అజ్ఞాన నిర్మూలకుడు గురువు

అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించేవాడు
జ్ఞానం అనే వెలుగులోకి తీసుకువచ్చేవాడు
మంచి విలువలను మనకు అందజేసే వాడు
లలిత కళలను మనకు నేర్పించేవాడు
లక్ష్యాన్ని చేరేందుకు సహకరించేవాడు
విజయాలనే తీరాలకు చేర్చేవాడు
కష్టాలనే అరణ్యాలను దాటించేవాడు
ఉజ్వల భవిష్యత్తును సృష్టించేవాడు
అన్ని ఆపదల నుండి కాపాడుతాడు
మంచి మార్గాన్ని చూపిస్తాడు
మన ఎదుగుదలకు సహకరిస్తాడు
చెడు అలవాట్లను దూరం చేస్తాడు
-ఎస్. తరుణ్, 10వతరగతి

### గురువు

మన బోధకుడు గురువు
మార్గదర్శకుడు గురువు
మన దైవము గురువు
చిరస్మరణీయుడు గురువు
మంచి చెడులు చెప్పేది గురువు
మనకు ఆదర్శం గురువు
మన లక్ష్య నిర్దేశకుడు గురువు
జ్ఞానం ఇచ్చేవాడు గురువు
మన ప్రవర్తన మార్చు వాడు గురువు
-వి.గోకుల్ శ్రీహర్ష 9 వ తరగతి

### బోధకుడు గురువు

గురువు అంటే బోధించేవాడు
గురువు అంటే మార్గదర్శకుడు
గురువు అంటే స్మరణీయుడు
గురువు అంటే అజ్ఞానాన్ని పోగొట్టేవాడు
గురువు అంటే మంచి దారిలో నడిపించేవాడు
గురువు అంటే చీకటిని తొలగించేవాడు
గురువు అంటే సక్రమార్గంలో నడిపించేవాడు
గురువు అంటే వెలుగును తెప్పించేవాడు
గురువు అంటే అర్థాన్ని తెప్పించేవాడు
గురువు అంటే మన లక్ష్యం లో నడిపించేవాడు
గురువుది శిష్యుడికి విడదీయలేని బంధం
- పి.లోహిత, 9 వ తరగతి



### మేధా వృక్షం గురువు

గురువు పంచుతాడు జ్ఞానం
అది అవుతుంది రేపటి బంగారు నాణ్యం
గురువు మేధస్సు ఒక మహా వృక్షం
జ్ఞానాన్ని పంచడం వారి యొక్క లక్ష్యం
గురువు ఒక గొప్ప జ్ఞానమూర్తి
అది వారికి ఒక గొప్ప కీర్తి
గురువు అతని అనుభవాన్ని పంచుతాడు
విద్యార్థులని పై స్థాయికి పెంచుతాడు
గురువునిమించినది లేదు గురువు
అతడు తాపత్రయపడతాడు నీ మంచి కొరకు
-యు. జైలాష్, 10 వ తరగతి

### మన ధైర్యం గురువు

గురువే మన ధైర్యం
నువ్వే మన సర్వస్వం
గురువు నేర్పేది సంస్కారం
అదే మన జీవితానికి ఆదర్శం
గురువే మన బోధకుడు
గురువే మన గమ్య నిర్దేశకుడు
గురువే మన పూజనీయుడు
మా గురువే మా స్మరణీయుడు
అందరినీ ఆకట్టుకునే వాడు
మన భవిష్యత్తు గురించి ఆరాటపడేవాడు
గురువు నేర్పేది పాఠాలు
అది మన జీవితానికి మార్గదర్శకాలు
గురువే మన మరో తల్లిదండ్రులు
గురువు మనలో సరిదిద్దేది తప్పు ఒప్పులు
- వి.జశ్విత రెడ్డి, 9 వ తరగతి

### గమ్య నిర్దేశకుడు గురువు

మనకి చదువు చెప్పేది గురువు
మనకి జ్ఞానం నేర్పేది గురువు
సక్రమ మార్గం చూపేది గురువు
మనకి గమ్య నిర్దేశకుడు గురువు
మన మంచి చెడు తెలిపేది గురువు
మన భవిష్యత్తు గురించి ఆలోచన చేసేది గురువు
మన సంతోషం గురించి పరితపించేది గురువు
అజ్ఞానాన్ని తొలగించేవాడు గురువు
మన లక్ష్యాన్ని చేరడం కోసం సహాయం చేసేవాడు గురువు
మనలోని లోపాన్ని తెలిపేది గురువు
గురువు శిష్యుల బంధం విడదీయలేనిది
-ఎస్.కె.షర్మిల కౌసర్, 9 వ తరగతి

### త్రిమూర్తి స్వరూపం

బ్రహ్మ విష్ణు పరమేశ్వరుల ప్రతిరూపం
ప్రపంచ విజ్ఞానానికి నిదర్శనం
అజ్ఞానం అనే అంధకారాన్ని తొలగించి
విజ్ఞానమనే వెలుగులను నింపి
తరువు వలె తనదంతా అందిస్తూ
భావిభారత పౌరులుగా మారుస్తూ
నైతిక విలువలను పెంపొందిస్తూ
మాలోని సృజనాత్మకతను
తెలివితేటలను నిర్దేశించి
మాలో కసిని నింపి
ధైర్యంగా మా వెనుక నిలబడి
మమ్మల్ని గొప్ప మార్గంలో అడుగులు వేయిస్తూ
భాషలోని తీయదనాన్ని స్వచ్ఛతనాన్ని తెలుపుతూ
తల్లిలా లాలిస్తూ తండ్రిలా ధైర్యాన్నిస్తూ
సోదరుడిలా ఆదరిస్తూ ఓదార్చి
లేని చదువుని అందిస్తూ
ఎన్నోసార్లు విజయం రుచి చూపించి
పునాదిలా నిలిచిన గురువులు అందరికీ
ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
-వి. రేష్మిత అఖిల శ్రీ,10 వ తరగతి

### మనల్ని రూపుదిద్దే గురువు

బ్రహ్మ మనల్ని సృష్టిస్తే
గురువు మనల్ని రూపుదిద్దారు
సూర్యుడు ఈ ప్రపంచానికి వెలుగునిస్తే
గురువు మన జీవితాలకు వెలుగునిస్తారు.
ఈ ప్రపంచానికి జ్ఞానం గురువు
ప్రపంచ విజ్ఞానానికి కారణం గురువు
పవిత్రమైన జలం మనం
బ్రతకడానికి కారణం అయితే
గురువు మనం బ్రతికే తీరికి కారణం
ఒక శిల్పం లాంటి జీవితం కావడానికి గురువు
కావాలి
చంద్రుడు ఈ భూ ప్రపంచంలో అందమైతే
గురువు మూడు లోకాల్లో అందమైన వాడు
గురువు లేనిదే వీరుడు ఏడి?
గురువు లేనిదే ధీరుడు ఏడి?
గురువు లేనిదే ఒక తార
ఆ తార అంధకారంలో కూడా మెరుస్తూ ఉంటుంది
గురువు మనకి ఆదర్శం
మన జీవితానికి తీయదనం
అందుకే గురువు అనంతం
గురువు వర్ణించలేని ఓ బంధం
-వి. హేమ, 10 వ తరగతి

### గురుభక్తి


అన్ని లోకాలకు ముఖ్యుడు
అన్ని రోగాలకు వైద్యుడు
గురువిద్య బోధించేవాడు
గురువే సత్యంలో నడిపేవాడు
దేవదేవులకు దేవుడు గురువేగా
అన్ని లోకాలకు గురువే మిన్నగా
అమృతం వంటి విద్య బోధించేవాడు
మంచి మార్గంలో నడిపించేవాడు
జ్ఞాన జ్యోతిని వెలిగించే వాడు
అజ్ఞానాన్ని తొలగించేవాడు
గమ్యాన్ని చేరుకోవడానికి ఊత కర్ర
భూతల్లితో సమానమైన బోధకర్త
-కె. హిమబిందు,7 వ తరగతి

### నా గురువు

నా గురువే నా దైవం
నా గురువే నాకు ప్రధానం
గురువు అంటే
మంచి చెడులు చెప్పే తల్లి
సరైన మార్గంలో నడిపించే తండ్రి
ఎల్లప్పుడూ మన పక్కనే ఉండే స్నేహితుడు
నా బాగోగులు చూసుకునే దైవం
నాకు మంచి సలహాలు ఇచ్చే సచివుడు
ఇటువంటి లక్షణాలు కలిగి నాకు
విద్యను బోధించే
గురువుకి నమస్కారం
-ఎ..వైష్ణవి
7 వ తరగతి




**రాసే ఆసక్తి కలవారు సప్తపదులు వాట్సప్ గ్రూప్‌లో చేరి అక్కడ నియమాలు తెలుసుకుని గ్రూప్‌లో రాయండి. రోజూ అక్కడ వందలాదిగా వచ్చేవాటి నుంచి ప్రతివారం ఎన్నికయిన 25 సప్తపదులు "నేటినిజం"లో ప్రచురితం కాగలవు.**




నామమయం
ప్రేమమయం
అయోధ్యమందిర ప్రాణప్రతిష్ఠ
సంరంభాన దేశమంతటాశ్రీరామమయం
-ఆకెళ్ళ సూర్యనారాయణ మూర్తి
హైదరాబాద్

రాక
పోక
అర్థమైతే తత్వంబోధపడి తప్పును కాక
-జీ యన్ వీ సత్యనారాయణ, హైదరాబాద్

మౌనం
గానం
మనసు వినగలిగితే అది సుస్వరాలతానం
-శేష శైలజ (శైలి), విశాఖపట్నం

అందం
చందం
ప్రకృతి శోభను చూసి పరవశించు డెందం
-కామేశ్వరి వాడ్రేవు, రాజమండ్రి

వన్నె
చిన్నె
కలువల్లా కన్నులు వెన్నెల్లా ఉన్న కన్నె
-పీకేదుర్గాప్రసాద్, విశాఖపట్టణం

దరహాసము
చిరుహాసము
చీటికిమాటికీ నవ్వుతూ కారాదు
నలుగురిలో పరిహాసము!
-ఎం. వి. ఉమాదేవి, బాసర్.నెల్లూరు

తీరిక
కోరిక
ప్రియాగమనంతో మురిసి తమకంతో
అల్లుకుపోయిన అభిసారిక!
-గోగినేని రత్నాకరరావు, తెనాలి.

అసమానం
ఆత్మజ్ఞానం
జీవనయానం పడవ ప్రయాణం, ఎప్పుడూ
డోలాయమానం
-ఉమాదేవి పోచంపల్లి గోపరాజు
రిచ్మండ్,టెక్సాస్ ,అమెరికా

రామాలయం
ప్రేమాలయం
నెరవేరిన చిరకాల స్వప్నం హిందువుల
అయోధ్యాలయం.

రామాయణం -సింహాద్రి వాణి,
పారాయణం విజయవాడ
కోట్లాది రామభక్తులకు తరగని
ఆధ్యాత్మిక దాక్షాయణం
-వి శ్రీనివాస మూర్తి,
హైదరాబాదు

నవ్యము
దివ్యము
అడుగడుగున త్యాగము బోధించు
రామాయణ మహాకావ్యము. -యడవల్లి
విజయలక్ష్మి,రాజమండ్రి.

వేదన
రోదన
అన్ని అనర్థాలకీ కారణం అనవసరపు వాదన.
-క్రొవ్విడి వెంకట బలరామమూర్తి, హైదరాబాద్.

రాయబారాలు
కాళ్ళబేరాలు
గెలుపే పరమావధిగా సాగుతాయి
అభ్యర్థుల బేరసారాలు

రక్షణ.. -కె.వరలక్ష్మీదేవి, కర్నూలు
సుశిక్షణ..
చేనుకు రైతన్న,రాజ్యానికి సైనికుడు సంరక్షణ
-పి.బాలా త్రిపుర సుందరి, హైదరాబాద్

సాగులు
ఓగులు
నాసిరకం విత్తులతో రైతులు
అయ్యారు హృద్రోగులు..
-వి యస్ శాస్త్రి ఆకెళ్ల, విజయనగరం.

సాధన
బోధన
'ఎందరో మహానుభావులు' సమర్పిస్తారు
త్యాగయ్యకు ఆరాధన
-(జనవరి 30న శ్రీత్యాగరాజ ఆరాధనోత్సవము)
-విన్నకోట ఫణీంద్ర, హైదరాబాద్

వనం
కవనం
భగవంతునికి పూజతో పాటు చేయాలి సేవనం
-ఆలేటి పరంజ్యోతి, ఖమ్మం

శరణం
చరణం
భగవంతుని సన్నిధి నిరతంఆత్మకు ఆభరణం.
-టి డి కస్తూరి. హైదరాబాద్

మది
గది
విశాలంగా ఉంటే ఆరోగ్యానికి మేలు అది
-కాదంబరి శ్రీనివాసరావు,తిమ్మాపురం

అహం
ఇహం
కొందరికి ఆత్మస్తుతి అమిత
ఆనందమిస్తుంది అహరహం
-డా.పి.వి.రామ కుమార్, గుంటూరు

గణతంత్రం
పరతంత్రం
పారదోలిన దేశం జపియిస్తున్నది
నేడు యువమంత్రం .
-పట్నాల ఈశ్వరరావు, విజయనగరం

ఎగిసిపడుతోంది
మిడిసిపడుతోంది
తన పోరాటమాపి అల
లిప్తపాటు అలసిపడుతోంది.
-భానుశ్రీ తిరుమల, విశాఖపట్నం

వన్నెలు
చిన్నెలు
వలపు వయ్యారాలు వొలికించే కలువకళ్ళ కన్నెలు!
-గోపరాజు వెంకట
సూర్యనారాయణ,హైదరాబాదు.

పశుగణన
జనగణన
కుటిల రాజకీయ స్వలాభం కోసం కులగణన
-కె. చెన్నకేశవులు, కర్నూలు

చిరాకు
పరాకు
భావోద్వేగమేదైనా అదుపుచేస్తేనే జీవితమనే
తరువుకు మారాకు
-మామిడాల శైలజ , వరంగల్

## ముద్దు లొలుకు..

గుండె బరువుల్ని వెన్నెల చూపులతో దూదిపింజల్ని చేస్తుంది
గూడు కట్టుకున్న నిరాశల్ని కువకువల పిట్టల్ని జేసి ఎగరేస్తుంది-
అమాయకపు వదనంతో హాయి సూదంటురాయివైపు లాగేస్తుంది
అర్థమయ్యీ అవని తేనె మాటలతో భాషకి కొత్త భాష్యాలు చెబుతుంది-
సిద్ధాంత రాద్ధాంతాలు గజిబిజిని పిడికిట బట్టి ఆవలికి విసిరేస్తుంది
ఉన్న కాసేపూ వయసుకి జవసత్వాల రెక్కలు తొడికి ఊహల పల్లకిలో ఊరేగిస్తుంది-
అప్పటిదాకా ఉన్న గాంభీర్యపు ముద్రని హుష్..కాకీ! చేసేస్తుంది
ఎప్పటివో అయిన బాల్యస్మృతుల్ని మనోయవనికిపై ఆవిష్కరిస్తుంది-
చల్లని నవ్వులతో ఆత్మకంటిన అన్ని జాడ్యాలను తొలగిస్తుంది
ఆత్మీయ స్పర్శతో దేహపు నలతలకి సరైన మందు బిళ్ళవుతుంది-
అనంతానందపు లోకాన ఆడించి, పాడించి-అలసట మరిపిస్తుంది
దశాబ్దాల పకపకల పావురాన్ని తిరిగి రప్పిస్తుంది-
ఘనీభవించిన దుఃఖ నదుల్ని కరిగించి నావలా దాటిస్తుంది
చేదు జ్ఞాపకాల మరకల్ని మనోఫలకం నుంచి చెరిపేస్తుంది-
గత జన్మ బంధాల గంధాలను తనతో మోసుకొస్తుంది
కుటుంబ పెద్ద లెవరెవన్నో గుర్తుకి తెస్తుంది-
వంటరి జీవితాల్లోకి వల్లంకి పిట్టలా వస్తుంది
రేపటిపై కొత్త ఆశలు పున్నాగలను పూయిస్తుంది-
ముది వయసులను లలితంగా మురిపిస్తుంది
బుడి బుడి అడుగుల ముద్దులొలుకు 'మనుమరాలు'!
( నా మనుమరాలు చిన్నారి
'మైజాహ్' నుద్దేశించి...)



-ఎస్. కాశింబి
సెల్: 9052216044

పుస్తక సమీక్ష

## భావితరం కోసం నేటితరం "ఆ" ఇద్దరు..




తెలుగు బాల సాహిత్యానికి నేటి తరం బ్రహ్మ, అనేక మంది రచయితలకు ఆయువు పోసిన ప్రముఖ బాల సాహితీ సంపాదకులు. రచయిత, టి. వేదాంత సూరి గారి స్వీయ అనుభవ అనుభూతుల మేళవింపుగా ఆవిష్కరించబడిన పిల్లల నవల "ఆ" ఇద్దరు.

తనకు ఎదురైన ప్రతి అనుభవాన్ని అనుభూతి చెంది దానిని అక్షరీకరించడం ఉత్తమ రచయితల సాధారణ లక్షణం. అందులో భాగంగానే రచయిత వేదాంత సూరి తన పిల్లల నివాస ప్రాంతమైన న్యూజిలాండ్ వెళ్ళగా అక్కడి తన ఇద్దరి మనవరాళ్లు ఆద్య, ఆరియలతో రెండు సంవత్సరాల పాటు కరోనా దయవల్ల దగ్గరగా గడిపే సమయం కలిసి వచ్చింది.

ఈ రెండేళ్లలో వేదాంత సూరి గారు, పరాయి దేశంలో ఉన్న వేళ కూడా అక్కడి స్థితిగతులు, ఆచారాలు, ముఖ్యంగా భావితరం వారసులైన పిల్లల స్థితిగతులు ఆకళింపు చేసుకుని తన ఇద్దరి మనవరాళ్ల మానసిక స్థితిగతులు అబ్బురపరిచే సంఘటనలతో చక్కని పిల్లల నవల వ్రాసి వాళ్ళ మనవరాళ్లకు అక్షర కానుకగా అందించారు, ఇది రచయితలు అందరికీ ఆదర్శం.

అన్య భాషా దేశంలో పరాయి బాష పలిస్తున్న ఆద్య, ఆరియల, అల్లరి – పోట్లాటలు వారి ఆలోచనలు ఇందులో ఆసక్తికరంగా సాగుతాయి. వాళ్లు కేవలం అల్లరి పిల్లలే కాదు మంచి సృజన కార్లు కూడా...

సెలవులు వస్తే చాలు న్యూ ఇయర్, క్రిస్మస్ పండుగలకు స్నేహితులకు టీచర్లకు ఇవ్వడం కోసం సొంతగా తనదైన సృజనాత్మకతతో ఆద్య గంటలు తరబడి గ్రీటింగ్ కార్డులు తయారు చేస్తుంది. తనకు పజిల్స్ చేయడం, బొమ్మలు వేయడం, చాలా చాలా ఇష్టం, ఇంతకీ ఆద్య వయసు నాలుగేళ్లు తన చెల్లి ఆరియ రెండేళ్ల పిల్ల.

ఆద్య గ్రీటింగ్ కార్డులు తయారు చేయడంలోని అంతరార్థం కూడా మనం గమనించాలి, అక్కడ ఆ వయసు నుంచే, ఒకరికొకరు అభినందించుకోవడం, ధన్యవాదాలు చెప్పుకోవడం, అలవాటు చేస్తారు. అలాగే ఆ దేశంలో పిల్లలకు చిన్న వయసు నుంచే ప్రకృతిని పరిచయం చేస్తారు, పెద్దవారు వాకింగ్ కి వెళుతూ పిల్లలను తీసుకువెళ్లి అక్కడి పచ్చికబయళ్లలో పిల్లలను ఆటలకు వదిలేస్తారు, ఆద్య, ఆరియ, కూడా పెద్దవాళ్లతో కలిసి ఫోటోల పార్కు కి వెళ్లడం అలవాటు. అక్కడి ప్రకృతితో పాటు అక్కడ దొరికే ఆహార పదార్థాలతో కూడా వాళ్ళు సరదా చేస్తారు.

ఇక్కడ ఒక విశేషం గమనించాలి, ప్రపంచమంతా క్రిస్టమస్, న్యూ ఇయర్, పండుగలు శీతాకాలంలో జరుపుకుంటారు. కానీ న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాల్లో అది వేసవికాలం. మరో విశేషం ఏమిటంటే మనదేశంలోలా చర్చిలలో

ఏ హంగామా ఉండదు. ఎవరి ఇంటి వద్ద వారు పండగ జరుపుకుంటారు. దుకాణాలకు కార్యాలయాలకు సెలవులు రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటాయి, పిల్లలకు వారి వారి కేర్ సెంటర్లలో ముందుగానే పండగ జరిపి పిల్లలకు పుస్తకాలు బహుమతులుగా పంచుతారు, ఆద్యకు పుస్తకం బహుమతిగా వచ్చింది.

ఈ పండుగలు తర్వాత వీరికి వేసవి సెలవులు, సెలవుల్లో విధిగా అక్కడివారు పిల్లలను టూర్లకు తీసుకువెళతారు. ఆద్య ఆరియల అమ్మానాన్నలు టూర్ రెడీ చేశారు, ఇంక వారికి ఆనందమే ఆనందం. వాళ్ల అత్తయ్య వారికి టూర్ గిఫ్ట్ గా రెండు సూట్ కేసులు పంపింది.

న్యూజిలాండ్ రాజధాని విల్లింగ్టన్ కు కారు ప్రయాణం మొదలైంది, అక్కడి రహదారి ప్రయాణంలో కూడా చాలా విశేషాలే వుంటాయి.

పిల్లలను ఎప్పుడు పాఠశాల ప్రైవేటు తరగతులకే పరిమితం చేయకుండా, అవకాశం దొరికిన ప్రతిసారి ప్రకృతితో, సమాజంతో, కొత్త ప్రాంతాలతో, పరిచయం చేయాలన్న విషయం మనం ఇక్కడ ఆచరణాత్మకంగా అవగాహన చేసుకోవాలి.

విల్లింగ్ టన్ లో వాటర్ ఫాల్స్ బీచ్‌లు, కిడ్స్ పార్కులు, వంటి బోలెడు ప్రాంతాలు అమ్మానాన్నలతో కలిసి చూసి తెగ ఆనంద పడిపోతారుపిల్లలు. కొన్నిచోట్ల భయపడిన సంతోషమే ఎక్కువ పొందుతారు. అక్కడి "జూ"లో రాబిట్స్, జింకలు, చేపల,ను ప్రత్యక్షంగా చూసిన ఆద్య, ఆరియ,లు ఎంతో సంబరపడిపోతారు. అంతకముందు వాటిని కేవలం బొమ్మల్లో మాత్రమే చూశారు, ఇలాంటి పర్యటన వల్ల పిల్లలకు చిన్నతనం నుంచి జీవకారుణ్యం అవడుతుంది. జంతువులు అంటే భయం పోయి వాటిని ప్రేమగా చూస్తే అవి కూడా ఎలాంటి హాని చేయవనే నిజం పిల్లలకు అర్థమవుతుంది, ఈ ఇద్దరు పిల్లలు ఈ టూర్ లో ఇదే నేర్చుకున్నారు.

ఆద్య, మాటల్లో ప్రశ్నలు ఎక్కువగా వినిపిస్తాయి ఇది ప్రతి పిల్లలకు మనం అలవాటు చేయాల్సిన లక్షణం. పిల్లలకు టూర్ లే కాదు, బంధువుల ఇళ్లకు తీసుకు వెళుతూ బంధుత్వంలోని మంచితనం, లాభాలు, సంతోషాలు, పిల్లలకు చిన్న వయసు నుంచే అలవాటు చేస్తూ ఉండాలి. ఆద్య, ఆరియా లు. తరచూ వాళ్ల మేనత్త మామయ్యల ఇంటికి వెళుతూ ఉంటారు. అంతేకాదు అమ్మ నాన్నల ఫ్రెండ్స్ వస్తూ ఉంటారు వీరు వెళుతూ ఉంటారు. అంత చిన్న వయసులోనే ఆరియ వచ్చిన వాళ్ళందరికీ "టి" అందిస్తుంది. అతిథి మర్యాదలు చిన్నతనం నుంచే పిల్లలకు నేర్పాలి అనే విషయం రచయిత ఇక్కడ ఆవిష్కరిస్తారు..

ఆద్య, ఆరియ, ల చదువులు కూడా భలే సరదాగా సాగుతాయి. అక్కడ పిల్లలు ఇష్టాలకు అనుగుణంగా చదువుకునే వీలుంటుంది, పెద్దవారి కోరికలు పిల్లల మీద బలవంతంగా రుద్దరు. ఈ పిల్లల చదువుల్లో బట్టి పట్టడాలు, పరీక్షలు కాపీ కొట్టడాలు, కఠినమైన శిక్షలు, కనిపించవు అక్కడి పిల్లల చదువుల్లో సృజనాత్మకత దాగి ఉంటుంది. వ్యక్తిత్వ వికాస అభివృద్ధికి ఈ చదువులు బాగా ఉపకరిస్తాయి.

ఇక పిల్లలకు చేసే పుట్టినరోజు పండుగలే కాక తెలుగు పండుగలు తెలుగు సంస్కృతి సాంప్రదాయాలు, గుళ్ళు తదితర ప్రాంతాలను ఆద్య, ఆరియలకు వాళ్ళ అమ్మానాన్నలు తరచూ పరిచయం చేస్తూ ఉంటారు.

ఇక అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు సరేసరి.

ఈ బుల్లి నవల కేవలం ఆద్య, ఆరియ, అనే ఇద్దరు అమ్మాయిల కేంద్రంగా సాగినా. అనేక విషయాలను విశేషాలను మనకు అందిస్తుంది. ఈ నవలలో ఎలాంటి సస్పెన్స్ లు, మలుపులు,, లేకపోయిన, సాధారణంగా మన కళ్ళ ముందు జరుగుతున్న సంఘటనల సమాహారంగా నడిపించడం ,పఠనా శక్తి లోపించకుండా జాగ్రత్త పడటంలో నవలా రచయిత "వేదాంత సూరి" గారు శతశాతం విజయం సాధించారు. విదేశాలలో బాల్యానికి ఇస్తున్న ప్రాధాన్యత గురించి అక్కడి వాతావరణ పరిస్థితులు సంస్కృతి సాంప్రదాయాల గురించి కూలంకషంగా తెలుసుకోవాలనుకునే పిల్లలతో పాటు పెద్దలంతా విధిగా చదవాల్సిన పిల్లల నవల ఇది.

**ప్రతులకు:-టి. వేదాంత సూరి,**
సెల్: 984899 2841.



-డా॥అమ్మిన శ్రీనివాసరాజు,
సెల్:7729883223

## పిల్లలే గురువులు

కథ

చరిత్ర పుటలను పరిశీలించి చూడగా విజయవంతమైన వ్యక్తుల జీవితం కూడా ఓటమితోనే మొదలైంది అనే విషయం మనకు బోధ పడుతుంది. గొప్పవారు ఘన విజయం సాధించడానికి జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను సవాలు చేస్తూ, గెలుపోటములను సమ దృష్టితో చూస్తూ వారు జీవితపు విజయపరంపర కొనసాగించారు. నేడు చిన్న, చిన్న సమస్యలకు భయపడి చాలా మంది తమ లక్ష్యాలను నిర్లక్ష్యం చేస్తున్నారు.

అక్టోబర్ – 15 న ఎ.పి.జె అబ్దుల్ కలామ్‌గారి జన్మదినాన్ని విద్యార్థి దినోత్సవంగా, నవంబర్ -14 నెహ్రూ గారి జన్మదినాన్ని బాలల దినోత్సవంగా జరుపుకుంటాము. ఆ మహనీయుల స్ఫూర్తిగా బాలల దినోత్సవం సందర్భంగా రంగు, రంగుల రెక్కలు కలిగిన సీతాకోకచిలుకలుగా పిల్లలు తమ భవితను రంగులతో నింపుకోవాలి అని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు ఉపయుక్తమైన సందేశాత్మక స్వాను భవాన్ని అక్షరబద్ధం చేసి వారిలో మానవీయ విలువలను మేల్కొల్పడమే ఉద్దేశంగా నా ఈ చిన్ని ప్రయత్నం.

ఒక మనిషి భవితకు చదువు చాలా ముఖ్యం .అలాంటి విద్య కోసం అమ్మ ఒడి లాంటి బడికి మాత్రమే వెళ్లాలి. మానవతా విలువలు కలిగి , విద్యార్థుల కు విలువలతో కూడిన విద్యను అందిం చాలని నిరంతరం తపన పడే వ్యక్తి నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల ద్వారా ఒక విద్యాసంస్థను ప్రారంభించగలిగిన నాడు విద్యార్థులు తాము భవిష్యత్తు లో సాధించవలసిన ఎన్నో విజయాలకు పాఠశాల వైపు వేసే తొలి అడుగే వారికి తొలి పాఠమవుతుంది.

విద్యార్థులు వినయ, విధేయతలతో కూడిన విద్యావంతులుగా మారడానికి గుడి లాంటి బడి ప్రధానం. జీవిత యాత్రలో పాఠశాల అనే వాహనంలో, క్రమశిక్షణ అనే ఇంధనంతో, గురువు అనే చోదకుడితో రోజుకో కొత్త ప్రయాణం. ఈ ప్రయాణంలో అలసట ఉండదు. విశ్రాంతి లేని ఈ ప్రయాణంలో అలసిపోని చోదకుడు విద్యార్థులు అనే ప్రయాణీకులను వాహనంలో కూర్చోపెట్టుకుని, ఇంధనం విరివిగా నింపుతూ విద్యార్థుల భవితను శిఖరాయమానం చేస్తూ యాత్రను కొనసాగిస్తాడు . సూర్యుడు అమ్మ ఒడి చేరే సమయానికి విద్యార్థి తల్లి ఒడి చేరి ఆ రోజంతా జరిగిన సంఘటనలను సంగతులుగా మార్చి ,పొందిన అనుభూతిని పొదివి పట్టుకొని తల్లితో ఆ జ్ఞాపకాలను పంచుకుంటాడు .

**గురువు దేవుడితో సమానం.**
**గురుబ్రహ్మా ,గురుర్విష్ణు**
**గురుర్దేవో మహేశ్వరః,**
**గురు సాక్షాత్ పరబ్రహ్మా**
**తస్మై శ్రీ గురవే నమః**

విలువలతో కూడిన విద్య మనుషుల మధ్య జాలి, కరుణ, దయ, పరోపకారం అనే సద్గుణాల్ని పెంపొందింపజేస్తుంది. విలువలతో కూడిన విద్య ద్వారా మానవతా విలువలు లోపించి మృగం లా మారుతున్న నేటి సమాజాన్ని పాతాళంలో పాతర వేయవచ్చు .

దేశాభివృద్ధి తరగతి గదుల్లోనే నిర్మించబడుతుంది. దానికి కేంద్రబిందువే పాఠశాల. నేటి రోజుల్లో చాలావరకు పాఠశాల యాజమాన్యాలు విద్యార్థు లపై ఒత్తిడి పెంచి , అర్థం కాని రీతిలో పాఠాలను బోధిస్తూ, పాఠశాల సమయం మొత్తం నాలుగు గోడల మధ్య నలిగేలా , వారి మెదడు మొద్దుబారేలా చేసి వారిని ర్యాంకులను ఉత్పత్తి చేసే యంత్రాల్లా మారుస్తున్నారు .

బాలల దినోత్సవ సందర్భంగా ఒక బడిలో జరిగిన ఒక సంఘటన. 10 నుండి 15 మంది పిల్లలు ఉంటారు. వాళ్లకు మ్యూజికల్ చైర్ కాంపిటీషన్ పెట్టడం జరిగింది .పిల్లలందరూ చాలా ఉత్సాహంగా ఆ పోటీలలో పాల్గొన్నారు. చివరకు ఐదుగురు మిగిలారు . ఐదుగురు కూడా ఎటువంటి కంగారు లేకుండా ఉత్సాహం ఉరకలేస్తుండగా అక్కడకు వచ్చిన వాళ్ళ తల్లిదం డ్రులు తమని గమనిస్తున్నారా లేదా అని వాళ్ళ వైపు చూస్తూ వాళ్ళు తమ ఆటను ఎంతో ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు.

అలా ఐదుగురు నుంచి నలుగురికి, నలుగురి నుంచి ముగ్గురికి, ముగ్గురు నుంచి ఇద్దరికీ..... ఆట చివరికి వచ్చింది. ఎవరో ఒకరు మాత్రమే విజేతగా నిలవాలి. పిల్లలిద్దరూ కుర్చీ చుట్టూ తిరుగుతున్నారు. ఈలోగా ఉన్నట్టుండి ఒక అబ్బాయి కింద పడిపోయాడు . ఇక గెలుపు మా అబ్బాయిదే అని మొదటి అబ్బాయి తల్లిదండ్రుల కళ్ళలో సంతోషం, మా వాడు పడిపోయాడు , ఇక ఓడిపోయినట్లే అని రెండవ అబ్బాయి తల్లిదండ్రుల కళ్ళలో ఆందోళన , బాధ రెండూ కొట్టొచ్చినట్లు నాకు కనిపించాయి . విజిల్ వినిపించింది . అందరూ ఊహించిన ట్లుగా ఆ మొదటి అబ్బాయి చైర్ లో కూర్చో లేదు. కిందపడిన అబ్బాయి కి చెయ్యి అందించి చేయూతనిచ్చాడుజ ఆ సందర్భంలో పిల్లలిద్దరి మధ్య స్నేహం కుదిరింది. ఆ భావన మనసులో సహజాతంగా కదలాడటం వల్ల కాబోలు ఎవరూ కూడా నేనే గెలవాలి ,విజయం నాదే అని భావన చేయకుండా ఒకరికొకరు త్యాగం చేసుకుంటూ ఎవరూ కూడా ఆ కుర్చీలో కూర్చోలేదు .ఆ విధంగా వారు స్నేహ ధర్మాన్ని చాటారు. అది జరుగుతున్న క్రమంలో అక్కడున్న తల్లిదండ్రులు కమాన్ చిన్ను, కమాన్ లక్కీ అంటూ వాళ్ళను ప్రోత్సహిస్తూ కరతాళ ధ్వనులతో ఉత్సాహ పరుస్తున్నారు. సమయం ముగిసింది..అయినా ఎవరూ కూడా కుర్చీలో కూర్చోలేదు. విజేతలుగా ఎవరిని ప్రకటించాలో నిర్వాహకులకు అర్థం కాని స్థితి. వాళ్ళిద్దర్నీ పిలిచి మళ్లీ ఆట మొదలుపె డదాము అంటే వద్దు.... , నా స్నేహితుడు ఫస్ట్ అంటే నా స్నేహితుడు ఫస్ట్ అంటూ ఇద్దరు గొప్పగా త్యాగం చేస్తున్నారు .తమ పిల్లలు చేసిన ఈ త్యాగాన్ని తల్లిదండ్రులు తలుచుకుంటూ, వాళ్ళ లేత మనసులో కొలువైన జ్ఞానం మనకి లేదే అని సిగ్గుతో తలదించుకున్నారు.

### "పక్కవాడు ఎదుగుతున్నాడు అంటే వెన్నుపోటు పొడిచి, మనమే ముందుకు వెళ్లాలి అనే తత్వంలో నేటి మన సమాజం ఉంది"

ఇక్కడ ఈ విద్యార్థులు మనకు ఒక సున్నితమైన విషయాన్ని తమ ప్రవర్తన ద్వారా చెప్పకనే చెబుతున్నారు. మంచి ఎవరు చెప్పినా, ఎక్కడ చూసినా మనం దాన్ని నేర్చుకోవాలి. పక్కవాడు ఎదుగుతున్నాడు అంటే వెన్నుపోటు పొడిచి, మనమే ముందుకు వెళ్లాలి అనే తత్వం లో నేటి మన సమాజం ఉంది. స్నేహం కోసం ఆ మిత్రులు ఒకరికొకరు త్యాగంచేయ డానికి సిద్ధపడ్డారు. కానీ పెద్దలు తమ పిల్లలు మాత్రమే గెలవాలని అని కోరుకున్నారు .ఈ చిన్న సంఘటన గురువుగా మారిన పిల్లల నుంచి మనం చాలా నేర్చుకోవాలి .అనే విషయా న్ని స్పష్టం చేస్తుంది .

చదువు మర్యాదను నేర్పిస్తుంది. మర్యాద సంస్కారాన్ని పెంపొందిస్తుంది .సంస్కారం ఉన్నత శిఖరాలను అధిరోహింపజేస్తుంది. వాస్తవానికి అక్కడున్న ఇద్దరు పిల్లలూ విజేతలే... విజయం అంటే ఒక బహుమతి గెలవడం మాత్రమే కాదు, .అందరి మనసులను గెలవడం. ఆ పిల్లలు అక్కడున్న తమ తల్లిదండ్రులలో గొప్ప మార్పు తెచ్చారు. అందుకే ఈ సందర్భంగా పిల్లలే మన సమాజానికి నిజమైన మార్గదర్శకులు గురువులు అని నాకు బోధపడింది. .పాఠశాల యాజమాన్యం విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలి. గొప్ప వ్యక్తులను ఆదర్శంగా చూపుతూ, మహాత్ముల జీవిత చరిత్రలు వివరిస్తూ,చదివిస్తూ తడబడుతున్న వారి నడతను సరిచేసి ఇంద్ర ధనస్సు వంటి వారి ఆలోచనలను వర్ణశోభితం చేయాలి. ఈ సిద్ధాంతాన్ని ప్రాతిపదికగా చేసుకొని పిల్లలకు ఎటువంటి ఒత్తిడి లేకుండా వారికి చదువును , మానసిక, శారీరక ఉత్తేజాన్ని అం దించే ప్రతి పాఠశాల ఎప్పటికీ ది బెస్ట్ అవుతుంది.



-ధూళిపాళ్ళ మాధవి కిషోర్
9949735253.

## మినీ కవితలు..

హృదయం కల్లోల కడలిలా
ఎగ సిపడుతోంది..
ఆ ధాటికి తట్టుకోలేని కన్నులు
వాటికి దారిస్తున్నట్లుగా
ధారలుగా కారిపోతున్నాయి..!.

మాటలు తెలియని పర్వతాలు
మౌన సాధన చేస్తున్నాయి..
కుదురుగా పద్మాసనం వేసుకుని
కూర్చున్న ఋషుల్లా కనిపిస్తున్నాయి..
మనసుపెట్టి పిలిస్తే..
ప్రతిధ్వనిస్తున్నాయి..!.

దేవుడంటే...
ఆలయమే కావాలని లేదు..
ప్రకృతిని. పంచభూతాలని
ఆరాధించే వారికి
ప్రతి అణువు భగవంతుడే..!.

అప్పుడప్పుడూ..
జ్ఞాపకాలను రాలుస్తుంది చెట్టు
ఆకులుగా మార్చి..
బతుకు మోడు అవ్వటం అంటే ఏమిటి..?
ఆకులు మిగలని చెట్టు..!.


నాది అనుకుంటే..
అది బాధ్యత అవుతుంది!
నాకెందుకు అనుకుంటే..
అది బరువు అవుతుంది!
బంధం బలహీనంగా ఉంటే..
బాధ్యత బరువుగా అనిపిస్తుంది..!.



– వి. మంగతాయారు
సెల్: 9949278483

## పెద్దల మాట

పెద్దల మాట
సత్యం విడిచి అసత్యం చేరి
సత్యాన్ని దూరం చేయుట తగదన్న
సత్యమేవ జయతేయని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.
ధర్మం విడిచి అధర్మం చేరి
ధర్మాన్ని దూరం చేయూట తగదన్న
ధర్మోరక్షతి రక్షితయని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.
తల్లిని విడిచి భార్యను చేరి
తల్లిని దూరం చేయుట తగదన్న
తల్లిని మించిన దైవం లేదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న.
భార్యను విడిచి వేశ్యను చేరి
భార్యను దూరం చేయూట తగదన్న
భార్యను మించిన ప్రియసఖి లేదని
పెద్దలు చెప్పిన మాట నిజమన్న



-జాధవ్ పుండలిక్ రావు పాటిల్
9441333315

# యుద్ధం జరగాల్సిందే..!

మనిషి పుట్టినప్పుడే
యుద్ధం మొదలైంది.

తన పరిణామం కోసం
కాలవాహినితో రణం చేశాడు
తన పరంపర కోసం
ప్రకృతి వైపరీత్యాలతో పోరు సలిపాడు.

యుద్ధం ఇప్పుడు
మనిషి జన్యువులో చేరి
వికటాట్టహాసం చేస్తోంటే
మనిషి యుద్ధకాంక్షతో
చెలరేగక ఏం చేస్తాడు?

యుద్ధం లేనిది ఎక్కడ!?
ఈ జగత్తు అణువణువులో ఉంది
ఒక ఇనుప ముక్కను బురదలో
వేసి చూడు
మట్టి చేసే యుద్ధం కనబడుతుంది
ఒక విత్తనాన్ని చిత్తడిలో విసిరేసి చూడు
మొక్క బతుకుతో చేసే యుద్ధం కనబడుతుంది.

పులి జింకపై చేసే యుద్ధం
పాము కప్పతో చేసే యుద్ధం
బలహీనులు భయంతో చేసే యుద్ధం
బలవంతులు అధికారం కోసం చేసే యుద్ధం.

యుద్ధం యుద్ధం యుద్ధం
చరిత్ర లోని ప్రతిపుటలో
యుద్ధ నినాదాలు ఉన్నాయి
ప్రతి పేజీలో నెత్తుటి మరకలు ఉన్నాయి
యుద్ధం తప్పు కాదు
యుద్ధం జరిగి తీరాల్సిందే..

ఆ యుద్ధం మనిషి ప్రాణాలు తీయాల్సిన
యుద్ధం కాదు
మనిషిని కాపాడే యుద్ధం జరగాలి
ఈ భూగోళంపై మనిషి
ఆనందతాండవం చేసే యుద్ధం రావాలి.

హిరోషిమా
నాగసాకి
చిత్రపటాలపై మనిషి కన్నీరు కార్చాలి

పాలస్తీనా
ఇజ్రాయిల్
ఇరాక్
ఆఫ్ఘనిస్తాన్
దేశాలలో రగిలే నిప్పుపై
మనిషి పన్నీరు చల్లాలి.

ఈ లోకంలో బుద్ధుడు పుట్టాడు
మానవత్వాన్ని చాటే యుద్ధం చేశాడు
జీసస్ పుట్టాడు
కరుణాంతరంగ యుద్ధం చేశాడు
మహమ్మద్ ప్రవక్త పుట్టాడు
మనిషిగా బతకమన్నాడు
గాంధీ పుట్టాడు
అహింసాయుత యుద్ధం చేశాడు.

ఇప్పుడు యుద్ధం జరగాలి
మనతో మనకు యుద్ధం జరగాలి
మనలో పెచ్చరిల్లుతున్న
రాక్షసత్వం పై యుద్ధం జరగాలి
మనిషిని మనిషి సుహృద్భావంతో
ఆలింగనం చేసుకునే యుద్ధం జరగాలి
ఔను యుద్ధం జరగాలి.

మతాల సరిహద్దులు దాటి
కులాల గీతలు దాటి
మేం మనుషులమని
ప్రపంచం ముక్తకంఠంతో నినదించే
యుద్ధం జరగాలి
ఔను యుద్ధం జరగాల్సిందే!

**-మౌనశ్రీ మల్లిక్**
8919338546



# నేర్చుకున్న పాఠం

కథ

సావిత్రి పక్కింటికి బయల్దేరింది కూతురు రమతో పాటూ, పక్కింటావిడ సుజాత గోడ అవతలనించి ప్రతిరోజూ పిలుస్తోంది వాళ్ళింటికి రమ్మని. సావిత్రీ వాళ్లు మొన్నటివరకూ ఇంకోచోట అద్దెకి ఉండేవారు. వారం రోజులే అయ్యింది ఈ ఇంట్లోకి వచ్చి. చుట్టుపక్కల ఎవరితోనూ ఇంకా పరిచయాలు కాలేదు. పక్కింటి సుజాత మాత్రం గోడ వైపునించి పరిచయం చేసుకుని వాళ్ళింటికి రమ్మని రోజుకి రెండుసార్లు పిలుస్తోంది. ఇంక బావుండదని సర్దుకోవలసిన సామాను ఇంకా ఉన్నా కాసేపు ఆ పని ఆపి ఆ రోజు సుజాతా వాళ్ళింట్లోకి వెళ్తూ కూతుర్ని కూడా రమ్మంది.

"రండి రండి" చాలా మర్యాదగా లోపలికి ఆహ్వానించింది సుజాత. కుర్చీలో కూర్చోబోతుంటే చెయ్యి పట్టుకుని ఆపి సోఫా చూపించింది.

"హాయిగా ఇందులో కూర్చోండి. పాత సోఫాలు తీసి పడేశాం. పనిమనిషికి ఊరికే ఇచ్చేశాను. ఇవి చాలా ఖరీదైనవి. బహుశా ఈ వీధిలో ఎవరింట్లోనూ ఇలాంటివి ఉండి ఉండవు."

తెల్లబోయి చూసింది సావిత్రి ఆవిడ ధాటికి ఆవిడ స్వరంలో ధ్వనించిన గర్వానికి. తనే కూర్చుందో, సుజాతే పట్టుకుని సోఫాలో కూలేసిందో తెలియలేదు. నాలుగు రోజుల కిందటి వరకూ తనెవరో కూడా ఆవిడకి తెలియదు. ఇలా ఎందుకు మాట్లాడుతోంది గొప్పలు చెప్పుకోడానికే తనని పిలిచిందా? వింతగా అనిపించింది సావిత్రికి.

> సుజాత ఇంట్లోకి చుట్టుపక్కల వాళ్ళెవ్వరూ ఎందుకు వెళ్ళట్లేదో బాగా అర్థమైంది సావిత్రికి.

"ఆ ఏం తీసుకుంటారు? కాఫీ యా కూల్‌డ్రింకా?"

"ఏమీ వద్దు. పది నిమిషాలు కూర్చుని వెళ్ళిపోతాను".

"ఏం చదువుతోంది మీ అమ్మాయి?" రమ వంక చూస్తూ అడిగింది సుజాత.

"తొమ్మిదో తరగతి".

"ఓ! మా అమ్మాయి కూడా అదే. ఏ స్కూల్లో చదువుతోంది?"

స్కూల్ పేరు చెప్పింది సావిత్రి. అదోరకంగా మొహం పెట్టింది సుజాత. ఆ స్కూల్లోనా అంటూ కాస్త వ్యంగ్యంగా దీర్ఘం తీసింది. "అదేమంత గొప్ప స్కూల్ కాదు. మా అమ్మాయిని హైక్లాసు స్కూల్లో వేశాం" అంటూ పేరు చెప్పింది.

ముళ్లమీద కూర్చున్నట్టుగా అనిపించింది సావిత్రికి. చటుక్కున లేచి లోపలికి వెళ్ళి నాలుగైదు నగల పెట్టెలు పట్టుకొచ్చింది సుజాత. ఒక్కొక్కటీ తీసి సావిత్రి ముందున్న టీపాయ్ మీద పెట్టి చూపించడం మొదలెట్టింది. "ఇవన్నీ మా అమ్మాయికి చేయించాను. ఇంకా కొన్ని చేయించాలనుకుంటున్నాను. నాకున్న నగలు కూడా ఎలాగో దానికే చెందుతాయి కదా! బోలెడు బంగారం ఉంది నాకు."

నగలు చూస్తూ సావిత్రి 'ఆహా! ఓహో!' అంటూ మురిసిపోతుందని, పొగిడేస్తుందని, 'ఎక్కడ చేయించారు. ఎన్ని లక్షలయ్యాయి? ఇంకా ఏమేమి రకాలు చేయించబోతున్నారు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తుందని ఊహించుకుంది సుజాత. కానీ అసలు సావిత్రి మొహంలో ఏ భావాలూ లేవు. పెద్ద ఆసక్తిగా చూడలేదు వాటివైపు. చూడకపోతే ఆవిడ ఏమనుకుంటుందో అని అటువైపు చూసిందంతే. ఒళ్ళు మండిపోయింది సుజాతకి. సావిత్రికి కనపడకుండా మూతి తిప్పుకుంది కోపంగా. లేని నవ్వు తెచ్చిపెట్టుకుని అడిగింది ఆఖరి అస్త్రంలా "మీకూ ఆడపిల్లలున్నారుగా? మీరూ ఎన్నో నగలు పిల్లలకి చేయించే ఉంటారు."

"నా దృష్టిలో నగలు కాదండీ చదువులు ముఖ్యం. వెండి బంగారాలమీద ఆసక్తి లేదు. మీరైనా ఇవన్నీ ఇంట్లో పెట్టుకుని కూర్చోడం మంచిది కాదు. బ్యాంకు లాకర్లో పెట్టుకోండి. ఇంటికొచ్చిన వాళ్ళందరికీ ఇలా వీధిగుమ్మంలోకి తీసుకొచ్చి చూపించకండి. మీ మేలు కోరే చెప్పాను. తప్పుగా అనుకోకండి. ఇంట్లో కాస్త సర్దుకునేవి ఉన్నాయి వెళ్ళొస్తాను." లేచింది సావిత్రి.

సరే అన్నట్టుగా సుజాత తల ఊపింది కానీ ఇంటికి కారం రాసినట్టుగా అనిపించింది సావిత్రి మాటలతో. సుజాత ఇంట్లోకి చుట్టుపక్కల వాళ్ళెవ్వరూ ఎందుకు వెళ్ళట్లేదో బాగా అర్థమైంది సావిత్రికి. ఆవిడ మాటతీరు మారి, గొప్పలన్నీ చూపించుకోవాలన్న తాపత్రయంతో కూడిన ప్రవర్తన సరిచేసుకుంటే తప్ప ఇరుగుపొరుగు ఆవిడతో స్నేహం పెంచుకోడానికి సాహసించరేమో అనిపించింది.

ఆ రోజు వంటింట్లో తల్లి పని చేసుకుంటుంటే మెల్లిగా వెనక చేరింది రమ "అమ్మా!" అంటూ.

'ఏం కావాలి రమా?"

"అమ్మా! మరి నీకున్నవి ఈ రెండు బంగారు గాజులేనా?" తల్లి చేతులవంక చూస్తూ అడిగింది రమ.

తుళ్ళిపడింది సావిత్రి. ఎప్పుడూ తమ ఇంట్లో వెండి బంగారాల గురించి మాట్లాడుకున్నది లేదు. రమ ఇలాంటి విషయాల జోలికి ఎప్పుడూ రాదు కూడా. అటువంటిది ఇంత చిన్నపిల్ల ఇవాళ ఇలా అడుగుతోందంటే కారణం ఆ సుజాత మాటల ప్రభావం, ఆవిడ కూతురి నగలు చూసిన ప్రభావం కావచ్చు.

నవ్వుతూ కూతుర్ని దగ్గిరకి తీసుకుంది ముగ్గురి పిల్లల తల్లి సావిత్రి "ఇవాళ కొత్తగా మాట్లాడుతు న్నావేంటి తల్లీ?" చిరునవ్వుతో మృధువుగా అడిగింది.

"అది కాదమ్మా! నువ్వు చేయించుకో, అవి తర్వాత నాకూ, చెల్లాయికీ వస్తాయిగా!" ఆ మాత్రం చెయ్యలేవా అన్నట్టు చూసింది రమ.

"నాకు నగలమీద మోజు లేదు తల్లీ! నువ్వు, చెల్లాయి చక్కగా పెద్ద చదువులు చదువుకుని మీ కాళ్లమీద మీరు నిలబడితే అదే నాకు ఏడు వారాల నగలతో సమానం. అదే మీ నాన్నగారూ, నేనూ మీకిచ్చే ఆస్తీ నగలూ."

ఈ సమాధానం అంతగా నచ్చినట్టు లేదు రమకి. కానీ ఇంకేం అనకుండా అక్కడినించి వెళ్ళిపోయింది. సావిత్రికి జాలనిపించింది. కానీ ఏం చెయ్యగలదు ఇంకోసారి ఎప్పుడన్నా రమ ఈ ప్రసక్తి తీసుకొస్తే ఈ రోజుల్లో చదువే అన్నిటికంటే పెద్ద ఆభరణం అని నాన్నగారి నెల జీతంతో ఇద్దరు పిల్లలకి పెద్ద చదువులు చదివించడమే గొప్ప విషయం అని తనకి అర్థమయ్యే రీతిలో చెప్పాలని నిశ్చయించుకుంది.

పదో తరగతి పరీక్షలు ఎక్కువ మార్కులతో పాసైంది రమ. కానీ పాపం పరీక్ష ఫెయిలైంది సుజాత కూతురు సౌమ్య. "దానికి చదువు అబ్బదు. ఇంట్లో కూర్చోమను. పెళ్ళి చేసేద్దాం. సంబంధాలు చూస్తాను." అంటూ కూతురి గురించి తన నిర్ణయం చెప్పేశాడు సుజాత భర్త రాఘవులు.

అది తెలిసి చాలా బాధపడింది సావిత్రి. "ఎందుకు బాధ? పిల్లకి వెండి బంగారాలు బోలెడు ఇస్తాం కదా! చదువుకుని ఏం ఉద్ధరించాలి?" తేలిగ్గా తీసిపడేసింది సుజాత. ఇంకా ఈ రోజుల్లో కూడా ఇలా మాట్లాడేవాళ్ళున్నారంటే ఎదురుగా చూస్తూ కూడా నమ్మలేకపో తోంది సావిత్రి.

చూస్తుండగానే రెండేళ్లు గడిచిపోయాయి. రమ ఇంటర్ మీడియట్ చదువైంది. బీ.టెక్‌లో చేరబోతోంది. అప్పుడు సౌమ్యకి సంబంధం కుదిరింది. ముహూర్తం మూడునెల్ల తరవాతది నిశ్చయించుకున్నారు. కాలేజీలో చేరేముందు అమ్మా నాన్నలతో కలిసి నాలుగు రోజులు తాతయ్యగారి ఊరెళ్ళి వచ్చింది రమ. రాగానే తెలిసింది రెండు రోజుల కిందట సౌమ్యా వాళ్ళింట్లో దొంగలు పడి ఇంట్లో ఉన్న నగా నట్రా నగదు మొత్తం దోచుకెళ్ళిపోయారని, అయ్యో పాపం! అనుకుంటుంటే ఇంకో నిజం తెలిసింది సావిత్రికి. రాఘవులికి ఊళ్ళో చాలా అప్పులున్నాయిట. ఊరంతా అప్పులు చేస్తూ వెండి బంగారాలు కొన్నాడుట. ఇప్పుడు ఆ సొత్తూ గోవిందా! అప్పులు తీర్చే మార్గాలూ లేవు. సొత్తు మొత్తం పోయిందనీ, ఊరంతా అప్పులనీ తెలిసిపోయి మగపెళ్ళివారు ఈ సంబంధం మాకు వద్దు మేము వేరే సంబంధం చూసుకుంటున్నామని చెప్పేశారు. రాఘవులికి, సుజాతకి తాము చేసిన తప్పు తెలిసొచ్చింది. సొమ్ములూ పోయాయి, వచ్చిన సంబంధమూ పోయింది. అప్పులు చేసి ఆ సొమ్ములు కొనకుండా ఉంటే పిల్ల చదువుకైనా ఉపయోగపడేది కదా! ఎంత బుద్ధి పొరపాటు పనిచేశామని నెత్తీనోరూ కొట్టుకుంటు న్నారు.

> ఊరంతా అప్పులనీ తెలిసిపోయి మగపెళ్ళివారు ఈ సంబంధం మాకు వద్దు మేము వేరే సంబంధం చూసుకుంటున్నామని చెప్పేశారు.

ఆ రోజు రాత్రి పడుకోబోతూ తల్లితో మెల్లిగా అంది రమ "దొంగలు దోచుకెళ్ళలేనిది విద్య మాత్రమే కదమ్మా. నాకూ, చెల్లాయికీ మా చదువులకి చాలా ఖర్చు పెడతారు మీరు. ఇదే ముఖ్యం నగలు కాదు. మేము బాగా చదువుకుని మంచి ఉద్యోగాల్లో స్థిరపడి నీకు గాజులు చేయిస్తాం."

ఆ మాటలకి ఉప్పొంగే ప్రేమతో కూతుర్ని దగ్గిరకి తీసుకుని మనసారా హాయిగా నవ్వుతూ అంది సావిత్రి "మేలిమి బంగారం లాంటి నువ్వూ, చెల్లాయి ఉండగా నాకు వేరే బంగారం అక్కరలేదు తల్లీ!"

"అమ్మా! నాకొక సందేహం. అడగనా?"

"అడుగు. ఫర్వాలేదు" వెంటనే అంది.

"అమ్మా! సౌమ్య చాలా అవమానంగా బాధపడుతూ గదిలోంచి ఇవతలికి రాకుండా అన్నం తినకుండా ఉంటోందిట. జరిగిన దాంట్లో తన తప్పేమీ లేదు కదమ్మా. పాపం జాలేస్తోంది తనని తల్చుకుంటే."

"అయ్యో! అలా వదిలెయ్యకూడదు. ఎవరైనా తన వయసువాళ్ళు పక్కన కూర్చుని కబుర్లు చెప్తూ మళ్ళీ ఇదివరకటి సౌమ్యని చెయ్యాలి తనని. పోనీ నువ్వే ఆ పని ఎందుకు చెయ్యకూడదు రమా?"

"అమ్మో! నేనా! నేను బాగా చదువుకుంటానని నా మీద. అసలే కోపం వాళ్ళమ్మకి. నన్ను కూర్చోనిస్తుందా సౌమ్య దగ్గిర?"

"సహాయపడాలనుకున్నప్పుడు ఇంక అలాంటివి ఆలోచించకూడదు. నీ మాటలవల్ల ఆ అమ్మాయికి చదువు మీద మళ్ళీ ఆసక్తి కలిగి అటు దృష్టి పెడితే తను మాత్రమే కాదు వాళ్ళ అమ్మా నాన్నలు కూడా మనశ్శాంతిగా ఉండగలుగుతారు. ముగ్గురూ మళ్ళీ సంతోషంగా జీవితం గడుపుతారు. అంతకంటే ఏం కావాలి చెప్పు."

"సరే అమ్మా! రేపు సౌమ్య దగ్గిరకి వెళ్తాను. ముందు తిండి సరిగ్గా తినేలా చూస్తాను. నువ్వు చాలా మంచి అమ్మవి. నీ దగ్గిర రోజుకో మంచి పాఠం నేర్చుకుంటున్నాను నేను." తల్లి చేయి అందుకుని మనస్ఫూర్తిగా అంది రమ.



**-తమిరిశ జానకి**
9441187182

---

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం 'నగరం' శీర్షికలో వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని..

నిర్వాహకులు -కమలేశ్
-దోరవేటి, అనంత వ్యవస్థాపకులు

## పట్టణం

నగరమ్మున జీవనమును
సొగసుగ వర్ణించి నుడువ చోద్యమ్మేమో!
తగినట్లార్జన యుండిన
పొగరుగ జీవించవచ్చు పోటిగ నిచటన్!.
పిన్నల పెద్దల కైనను
అన్నియు లభియించు నిచట యద్భుత రీతిన్!
మన్నికలో వెను దీయక
మన్ననతో నగరి సాగి మనసులు దోచున్!.
కులమత భేదము లుండును
కలతల కల్లోల మెపుడు కనపడు చుండున్
విలువలు ప్రేమలు లేవిట
నిలదీతురు మంచివాడు నీతులు జెప్పన్!.
ధర లాకాశంబంటును
పరుగెత్తుతు ననుదినమ్ము పనులను జెయన్!
పొరుగున యుండిన వారిని
గురుతెరుగరు తమకు తామె గొప్పని తలచన్!.
కోటలు దాటెడి ప్రతినలు
మాటలలో కమ్మదనపు మర్మమ్ముండున్
దీటుగ యుద్యోగమ్ములు
పోటీ వ్యాపార మందు పోరెద రెపుడున్!.

**-మహ్మద్ షరీఫ్,** 9866560527

## నగరం ఓ వరం

నగరం
శీతాకాలంలో...
కాలుష్యపు తెరలు కమ్మి
వెచ్చదనాన్ని ఇస్తుంది
వేసవిలో...
పరిశ్రమల ధైర్యాన్ని చిమ్మి
ఉపాధినిస్తుంది
మరోతరం మాట్లాడుకునేలా
జీవన సమరం చేయమని చెప్పి
దారి చూపిస్తుంది
అన్ని రకాల మనుషులు
బ్రతకడానికి లభించిన
అద్భుతమైన వరం
మహానగరం!
అది ఎవరికి వారే సైన్యమై
ఎక్కుపెట్టిన ఉక్కు కండరాలతో
ఎప్పుడూ గరం గరం!!

**-కమలేశ్**
9160396596

## నగర వైఖరి!

పల్లీయుల చెమట చుక్కలనుండి
పల్లవించిన నవపారిజాత సుమమే నగరం
ఎల్లరి హృదయాలను ఆకర్షిస్తుంది
ఎల్లరిని అక్కున చేర్చుని బ్రతుకునిస్తుంది
ఎల్లలెరుగని సదుపాయాలతో ఎల్లవేళలా
క్రొంగొత్త హంగులతో అలరిస్తుంది
ఎల్లీఎల్లని జీతాలతో
ఇల్లు గడవని కుటుంబాలతో
తల్లడిల్లిపోతూ అనుక్షణం
సరికొత్త ప్రణాళికలకు రచన చేస్తుంది
నగరం
ఎప్పుడు నిద్రపోతుందో తెలియదు
సగటు మనిషికి
ఎప్పుడు నిద్ర పట్టిస్తుందో తెలియదు
ఈనాటి నగరం
అనుబంధాలను కమ్మేసి ఆత్మీయతలను
దూరంచేసి నిత్యమాతనంగా భాసిల్లతోంది !!

**-సుప్పని సత్యనారాయణ.**

## నగరం

ఒకప్పుడు పల్లెను కన్నతల్లి అనేది
నేడు నగరమే నమ్ముకున్న వారికి
కన్నతల్లి లా మారుతోంది.
నదులన్నీ సముద్రం చేరినట్లు
బతుకు దెరువు వెతుక్కుంటూ
వచ్చేవారికందరికీ నీడనిస్తోంది
కండ బలం నమ్ముకున్న వారికి
బుద్ధి బలం నమ్ముకున్న వారికి
అందరికీ ఇక్కడ చోటుంది
ఆకాశం అంటే మేడలూ ఇక్కడే
అడుగు పెట్టలేని
అట్టపెట్టెల్లాంటి గుడిసెలూ ఇక్కడే
ఇక్కడ డబ్బు కిచ్చే గౌరవం
మనిషి కి దొరకదు.
దొరకాలంటే కొనాల్సిందే
పక్కవాడు చచ్చినా
తెలియని గందరగోళం
గజిబిజి బతుకులు
నగరం రోజురోజుకూ పెరిగిపోతూనే వుంది
పల్లెల్ని మింగేస్తూ
కొత్త కొత్త పోకడలు పోగేస్తూ
ఫ్యాషన్ కు కేరాఫ్ అడ్రస్ లా మారుతూ
నగరం విస్తరిస్తోంది
సముద్రంలో ఆక్టోపస్ లా !!

**-అవుసలి వీరబ్రహ్మం**

## నగరం

అందమైన కాంక్రీటు మేడలతో
అద్భుతమైన...
విద్యుత్ కాంతుల మెరుపులతో
వ్యాపార స్థావరాలకు స్వర్గసీమలా
నాగరికత అభివృద్ధికి సూచికలుగా
వెలుగొందేవి నగరాలు.
స్వచ్ఛమైన అమ్మ ప్రేమలాంటిది పల్లె
నవ్వించి కవ్వించి ఆకర్షించే
వగలమారి ప్రియురాలి వంటిది నగరం.
నేలపై ఆకుపచ్చ గొడుగును తీసేసి
కాంక్రీటు గూళ్ళ గొడుగులు వేసేసి
భూతాపమనే భూమాత కోపాగ్నికి
గురిచేసేది నగరం.
పుట్ట గొడుగుల్లా ఫ్యాక్టరీలు
తన చుట్టూ పెంచుకొని
హరిత గృహ వాయువులు వదలి
ఓజోన్ గొడుగుకు చిల్లులు వేసేది నగరం.
పరిపాలనకు కేంద్రాలు
పర్యావరణానికి క్యాన్సర్ గడ్డలు
భూమాత కట్టిన ఆకుపచ్చ చీరకు
మెరిసే చమ్ కీలే నగరాలు

**-సంజి మల్లేష్,** 9542628014

## నగర లేఖ

నాన్నకు నమస్కారాలతో....
అమ్మతో చెప్పు
నేను క్షేమంగా నగరానికి చేరుకున్నానని
నీవు ఇచ్చిన నలభై రూపాయలు ప్రయాణపు ఖర్చులకు సరిపోయినవి.
ఓ వైపు మురికి వాడలు
మరో వైపు ముస్తాబవుతున్న మేడలు
మధ్యస్థంగా అద్దె ఇల్లు దొరికింది. ఉద్యోగము దొరికిన తర్వాతే అద్దె చెల్లిస్తానన్నా దయ తలచి అంగీకరించారు. ఇల్లు శుభ్రం చేసుకుని నేను శుభ్రపడి అమ్మ నా కోసం అరువు తెచ్చిన శనగ పిండితో చేసిన వంటకాన్ని కంటి నుండి జారిన కన్నీటి చుక్కలను కలగలుపుకుని తిన్నాను.
అనురాగం కమ్మగా ఉంది నాన్నా...
ఈ మాట అమ్మతో అనకు కలత పడుతుంది. చాల చోట్లు తిరిగాక ఓ పెద్దింటి వారి వద్ద గుమాస్తా ఉద్యోగానికి కుదిరాను పర్లేదు నేను బ్రతుకుతూ మిమ్మల్ని బ్రతికించుకుంటాననే నమ్మకం కుదిరింది. ప్రక్కనే ఓ కళానిలయముంది. ఆదివారం సెలవు కావున కాలక్షేపమౌతుంది. కోకిల గీతాలను విడచి రణగొణ ధ్వనుల మోత వైపు కొంత వెలితిగా ఉన్నా మనసుకు నచ్చ జెప్పుకుంటాలే....అన్నట్టు చెప్పడం మరిచా...
మొదటి రోజు రాత్రి త్వరగా నిద్ర పట్టక అటు ఇటు తిరుగుతున్న క్రమంలో ఓ తాతతో పరిచయమేర్పడిందిమురికి వాడల్లో గుఱక నిద్దుర లొక వైపు, ముస్తాబు మేడల్లో పరుపులతో కుస్తీలు ఒక వైపు లీలగా అగుపడుతాయని ఆ తాత నాతో చెప్పాడు.అప్పుడు నీవు ఎప్పుడూ చెప్తుంటావే..
స్వేదం చిందించే శరీరానికి వాలి పోగానే కునుకు పట్టడానికి నేల పానుపు, మోచేతి తలగడ చాలు అని అవే మాటలు ఆ తాతతో చెప్పానుఆ తాత తాత్వికంగా నవ్వుతూ వెళ్ళిపోయాడు.
అప్పుడు నాకు అర్థమయింది నా శరీరం నిద్దురకు సరిపడా అలవలేదని ఎన్నో రాయాలని ఉన్నా లేఖ పరిది చిన్నది గదా!పది రోజులు పోయాక నా మజిలీ గురించి మరో లేఖ రాస్తాను.
ఉంటాను నాన్నా అమ్మ జాగ్రత్త ఊర్లో వారి నందరినీ అడిగానని చెప్పు.. -ఇట్లు
మీ ధ్యాసే నా శ్వాసగ తలచే మీ నేను, మల్కనెల్లి లాల్ రెడ్డి

## నగర సాగరం

నగరం నిద్రలేని
మహా జనసాగరం
నిరంతర అలల
వాహనాల రద్దీ .

ఒకప్పటి కుంటలా
ఉండే పట్టణం
చెరువుగా చుట్టూ
చేనూ చెలకలను
పచ్చటి హరిత కలలను
కబళించిన కాంక్రీటు తటాకం.
ఇప్పుడది బహుళ అంతస్తుల
భీభత్స సముద్రంలా
సంతరించుకున్న
నాగరికతా విపరిమాణం.

యువతరం నవతరపు
పోకడల పల్లెల కాలువలు
పట్టణపు నదులు పరిగెత్తి
కడలిలో కలిసి "కొలువు"తీర.

పల్లె సీమ ఇప్పుడు
పర్యాటక ప్రదేశం,
విహార ఆరామం.

**-శ్రీని**

## నగర జీవనం

చుట్టు మనుజులున్న పట్టించు కోబోరు
యెంత మంది నున్న నేమి ఫలము
కష్ట కాలమందు కాపాడ రెవ్వరు
పట్టణమ్ములన్న నిట్టులుండు.

నగర మందు మనిషి నానా వెతల జెందు
రెక్క లాడి తేనె డొక్క నిండు
బ్రతుకు యంత్రమయ్యి బాధలే మిగలంగ
నగర జీవనమ్ము నరకమగును

**-బండి మల్లికార్జున్**
వికారాబాద్


## వ్యథ

నగరం
కొందరికి మోదం
కొందరికి ఖేదం
కాలుష్యానికి చిరునామాగా చెప్పుకునేది
ఎవరి కష్టాలను మాత్రం పంచుకోనిది
పైకి కనిపించేవి
ఆకాశాన్నంటే బంగ్లాలు
అద్దాల మేడలు
లోపల మాత్రం
మనసులు తెలియని
మనుషుల జీవన హేలలు
బంధువులు వస్తే భారం
ఇరుకు సంధులు మహాఘోరం
పచ్చదనం కరువు
అది పైసలు వేసే దరువు
పొట్ట చేత పట్టుకొని
ఊరు జనం ఉరుకులు పరుగులు
బతుక లేక చావలేక
తంటాలు
నగరంలో వాన
అడుపుతప్పితే
నాలాలో మృత్యుహేళ

**-ఉమాశేషారావు,**
9440408080

## నగరం

నాలుగువైపుల నుండి వాలె వలస
పక్షుల నివాస వృక్షం మహానగరం
అందమైన భవనాలు
దుర్గంధ పూరితమైన
వాతావరణ వీధులు గల్గిన జనారణ్యం
బ్రతుకు తెరువు కోసం
దిమ్మరులై తిరిగె వాళ్ళు
చిత్ర విచిత్రమైన ప్రవృత్తుల
మనస్తత్వాల మనుసుల లోగిళ్ళు



అడుగడుగునా గ్రుచ్చుకునే ముళ్ళు
మోసాల వేషాలతో ముంచె కళ్ళు
నిరుపేదల కడు బాధల జైళ్ళు
బయట పడే దారిలేక తల్లడిల్లె వాళ్ళు
గానుగు యెద్దులై భరించె నిర్భాగ్యులు
పూట గడవక పస్తులుండె దౌర్భాగ్యులు
డబ్బుమదమెక్కిచిందులేసె క్లబ్బులు
మద్యం వర్షాలు కుర్పించె మబ్బులు
కాలుష్యాలు తెచ్చి పెట్టె జబ్బులు
నగరం కొందరికి
వరం మరి కొందరికీ జ్వరం
తెగిపోయిన గాలి పటాలు
ధనార్జన పరుల పీఠాలు
కలిసిమెలిసి జీవించె చోటు

**-ఆకుల మల్లికార్జున్,** 7416067335

---


## వ్యాపారం

కథ

అనగనగా లక్ష్మాపురం అనే ఊరిలో నరేష్ కవిత అనే దంపతులు ఉండేవారు. వారికి ఒక కూతురు ఉంది. ఆ కూతురు పేరు సీత. సీతకు బాగా చదువుకోవాలని ఆశ ఉండేది. కానీ వాళ్ళ అమ్మ నాన్నలకు చాలా ఇబ్బందిగా ఉండడం మూలంగా చదువుకోలేదు. వాళ్ళు పని చేస్తేనే పూట గడుస్తుంది. తల్లిదండ్రులతో పాటు వాళ్ళ కూతురు సీతతో పనిని చేపించేవాళ్లు. కానీ సీతకు చదువుకోవాలన్న ఆశ ఉంది అని తల్లిదండ్రులకు చెప్పింది. కానీ ఏం చేయాలో నరేష్ కవితలకు అర్థం కాలేదు.


వారు బాగా ఆలోచించి సీతకు చదువు చెప్పించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడే క్రిస్మస్ పండుగ వచ్చింది. దంపతులిద్దరూ బాగా ఆలోచించారు. కొద్దిపాటి డబ్బులతో పట్నం నుంచి బొమ్మలు తీసుకొచ్చి, చర్చి ముందు పెట్టి అమ్మినారు. చర్చికి వచ్చిన వారంతా కూడా నరేష్, కవితల వద్ద బొమ్మలు కొనుక్కొని వెళ్లారు. చాలా లాభం రావడంతో సీతను బడికి పంపాలని నిర్ణయించుకుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిం చారు. వారు అలాగే చిన్న చిన్నగా వ్యాపారం కొనసాగిస్తూ డబ్బులు సంపాదించసా గారు. వాటితో సీతకు కావలసిన వస్తువులు కొనిచ్చి సంతోషించసాగారు. సీత కూడా బాగా చదువుకొని పెద్ద ఉద్యోగం సంపాదించి తల్లిదండ్రులకు కీర్తి తెచ్చింది.

-నీతి కష్టపడితేనే ముందుకు వెళతాం కష్టం లేకుండా బ్రతకలేము



**-కె.సహర్షిని**
ఎనిమిదవ తరగతి
జడ్‌పిహెచ్ఎస్ హవేలీ ఘనపూర్
మెదక్ జిల్లా, 9885668665

## బుడ్డ పర్కలు



జాతీయోద్యమ
పత్రికలు ఆనాడు
వ్యాపార జాతి
పుత్రికలు ఈనాడు



**-అన్నవరం దేవేందర్**
9440763479

# స్త్రీలు శిఖరాగ్రాలకు చేరి పతాకలు ఎగురవేస్తున్నారు

**-మహాకవి డా॥ కత్తి పద్మారావు**
9849741695



ఆ జలపాత సవ్వడుల నుండి
ఏదో రాగం వినిపిస్తుంది.
ఆకుకూ,పువ్వుకూ మధ్య నిలబడిన
ఆ నీటి బిందువు ముత్యంలా మెరుస్తుంది.
ఆ ప్రవాహ ఉధృతిలో
కాళ్లు తడుపుతున్న
ఆ జవ్వని కళ్ళు మెరిశాయి.
ఆ రాణి ఆ నటుణ్ణి వరించింది.
ఆ రాజు చెండాలిక పై
మనసు పడ్డాడు.
యుద్ధం ఆయుధాలతో కాదు.
సమరం అంతరాల మధ్య.
మానవ సంబంధాల మధ్య.
ఆ అంతఃపురాల్లో ఉన్న స్త్రీలు
ఎందుకు సింహద్వారాలు
పగలగొట్టుకు బయటకు వస్తున్నారు?
బాల్య వివాహాల్లో
వంచించబడిన వనితలు
ఎందుకు సుస్వర గాన మంజరులయ్యారు?
పునర్వివాహితులయ్యారు?
అవును మనిషికి గాయాలవుతున్నాయి.
పాటకు గాయం చేయలేరుగా !
పాట మానవోద్రేకాలను
శృతిబద్ధం చేస్తుంది.
పాట డమరుక ధ్వనుల్లో
ఎంత వినిపిస్తుందో
సున్నితమైన మనసు పొరల్లో
దాగిన నిశ్శబ్దానికీ ఊపిరి పోస్తుంది.
భగ్నమైన ప్రతి చోటా
పాట పుడుతుంది.
పాట ఓ సముద్ర ఘోష.
పాట ఓ వెన్నెల వాన.
పాట ఓ ముసురుకున్న ఊహ.
పాట వసంతంలో పూత.
గ్రీష్మంలో ఎండి రాలుతున్న ఆకు
వానల్లో చిగురుస్తున్న
చిరు మందహాసం.
పాట కోటలను బీటలు వార్చింది.
ఖండ ఖండాంతరాల్ని దాటి
పాట మనో ఆకాశంలో నక్షత్రమయ్యింది.
అందుకనే
ప్రపంచమే ఓ గాన సముద్రం.
దుఃఖం, ఆవేదన, సంవేదన,
తృప్తి, అసంతృప్తి, ఆత్మఘోష
పాటలో సంలీనమౌతున్నాయి.
నిజమే!
ఆ రాక్ సాంగ్ నల్ల భామే పాడింది.
ఆ గిటారును ఆమె వేళ్ళ
కొనలు తాకాయి.
నల్ల సముద్రం చీలి
ఎర్రకలువలు పూసాయి.
అందుకే మానవులు
అగడ్తలు దాటుతున్నారు.
జీవితం విశాలమయ్యే కొద్దీ
స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు
పునరుత్తేజితమవుతున్నాయి.
జ్ఞానం విభాజితం అవుతుంది.
లింగభేదం తగ్గే కొద్దీ
స్త్రీలు శిఖరాగ్రాలకు చేరి
పతాకలు ఎగురవేస్తున్నారు.
కవి ఉన్మీలుడవుతున్నాడు.
భ్రాంతి నుండి బయటపడి
సత్య వాక్యాలను
పరిమళింప చేస్తున్నాడు.
జీవన సంద్రాలు విచ్చే కొద్దీ
జ్ఞాన సూర్యులు ఉదయిస్తున్నారు.
ప్రేమ విశ్వజనీనమవుతుంది.
ప్రేమ ఒక మాధుర్య సంవేదన.
ప్రేమ వెన్నెల సంద్రాలు ప్రవహింపజేస్తుంది.
అది విరబూసిన మల్లెపువ్వే!
ఆఘ్రాణించే వారు అభ్యర్థకులే!
అభ్యర్థన ఏదైనా అధీనతే!
అన్ని విరహాలు అసహనాలే!
అన్ని అహాలు ఆత్మ దగ్ధాలే!
మంటలు ఎక్కడో లేవు.
ఆలోచనలోని వికృతిలోనే ఉన్నాయి.
నిజమే!
అందరికంటే మానవులే గొప్పవారు.
పెను వృక్షాలు కూలిపోయినా
మళ్లీ విత్తనాలు నాటేది మానవుడే!
పెను విద్వేషాలు పొంగిపొర్లుతున్నా
ఒక ప్రేమ పూర్వక సందేశాన్ని
ఇచ్చేవాడు మానవుడే!
మానవుడు ఒక సంగీతం.
మానవుడు ఒక నీతి శతకం.
అందుకే ఒక బుద్ధుడు.
ఒక అశోకుడు.
ఒక అంబేద్కరుడు.
మళ్లీ పునరుజ్జీవన రూపాలెత్తుతున్నారు.
మళ్లీ మానవతా దీపాలై
ఆకాశమంత ఎత్తుకు ఎదుగుతున్నారు.
తల ఎత్తుకున్న వారంతా
ఆత్మ గౌరవ పతాకాలుగా ఎగరండి!
నిన్న తెగిన సంకెళ్ళ చప్పుడు
నేడు ఎగురుతున్న
నీలి జెండాల రెపరెపలు.
పదండి ముందుకు.
ఆత్మ గౌరవ రాజ్యాన్ని నిర్మిద్దాం.

## సుబ్బి పలుకులు

తగువులాడ బోకు తల్లిదండ్రుల తోడ
తగువులాడ మనసు తల్లడిల్లి
ముసలి వయసులోన మురిపాలు పంచాలి
సుజనులార నిజము సుబ్బిమాట!.

కన్న వారి నెపుడు కష్టబెట్టగ బోకు
కపట ప్రేమ గాదు కన్న ప్రేమ
తల్లిదండ్రులన్న దేవతా రూపులే
సుజనులార నిజము సుబ్బి మాట !

అడిగి రానె రావు ఆపదా లెన్నడు
గాలిలాగ వచ్చు గట్టి గాను
ఏది యెటుల యున్న ఎదురేగి గెలవాలె
సుజనులార నిజము సుబ్బిమాట !

విద్య నేర్చ వలెను వినయంబు పెరగగా
విద్యరాని వాడు వింత పశువె
చదువు లేక పోతెచచ్చినా శవమురా
సుజనులార నిజము సుబ్బిమాట !

పేద వారమంటు పట్టు వీడగ బోకు
ఆస్తి లేక పోతె అప్పు జేయి
కష్టమైన గాని కడగెల్పు సిద్ధించు
సుజనులార నిజము సుబ్బిమాట !

మరచి పోయినారు మాతృ భాషల నెల్ల
మాతృ భాష యగును మాత సమము
అమ్మ వడిల భాష అమృతము సమమౌను
సుజనులార నిజము సుబ్బిమాట !

ధూమపానమెంత దుష్ఫలితంబిచ్చు
నరుని ఉసురు దీసి నష్ట పరుచు
లాభమింత లేదు లోపంబు హెచ్చురా
సుజనులార నిజము సుబ్బిమాట!

సహనమున్న వారు సంవాద మెరుగరు
తీర్పులెల్ల తీరు నోర్పుతోడ
మారవోయి మనిషి మనగాంధి తీరుగా
సుజనులార నిజము సుబ్బిమాట!

అన్నదమ్ములంటు ఆరాట మెందుకు
ఆపదున్న నాడు అడుగ రారు
నమ్మబోకు మెవరి నాటకాలాటను
సుజనులార నిజము సుబ్బిమాట!

చదువు చెప్పుతారు చక్కనీ గురువులూ
తల్లిదండ్రి లాగ తపనజెంది
ఆజ్ఞ మీరకున్న అజ్ఞానమంతమౌ
సుజనులార నిజము సుబ్బిమాట !

**-సుబ్బి**
ఈ.శిరీష, 10వ తరగతి,

# భారత వైవిధ్య వారసత్వ సంపదే పర్యాటకానికి ప్రధాన ఆకర్షణ

ఆర్థికాభివృద్ధిలో పర్యాటకానికి ఎంతో ప్రాధాన్యం ఉన్నది. దేశ జిడిపీ కి పర్యాటకం 6 శాతం అందిస్తున్నది. దేశ వైవిధ్యభరిత వారసత్వ సంపద పునాదిగా పర్యాటక పరిశ్రమ అభివృద్ధి చెందుతున్నది. వారసత్వ కట్టడాల నిర్వహణ, స్వచ్ఛత, ఆధునిక వసతుల కల్పన, పర్యాటక స్థలాల నిర్వహణ, రవాణా సౌకర్యాలు, శాంతి భద్రతల పరిరక్షణ లాంటి చర్యలు పర్యాటకాభివృద్ధికి దోహదపడ తాయి. దేశ పర్యాటకాన్ని ప్రోత్సహించడం, విదేశీ పర్యాటకులను ఆకర్షించడం, పర్యాటక రంగ ప్రాధాన్యాన్ని అవగాహన పరచడం లాంటి లక్ష్యాల తో ప్రతి ఏట 25 జనవరిన "జాతీయ పర్యాటక దినోత్సవం(నేషనల్ టూరిజమ్ డే)" నిర్వహించుట ఆనవాయితీగా మారింది. 27 సెప్టెంబర్ రోజున 'ప్రపంచ పర్యాటక దినం' పాటించుట కూడా జరుగుతున్నది. జాతీయ పర్యాటక దినం - 2024 నినాదంగా "సుస్థిర ప్రయాణాలు ; అనంత జ్ఞాపకాలు" అనబడే అంశాన్ని తీసుకొని పలు కార్యక్రమాలను నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

**వైవిధ్యతే భారతానికి ప్రధాన ఆకర్షణ:**

వైవిధ్యభరిత సువిశాల భారతంలో చారిత్రక, సంస్కృతిక, వారసత్వ, ప్రకృతి, సముద్రయాన, విద్య, వ్యాపార, క్రీడ, గ్రామీణ, వైద్య, పర్యావరణ, పర్వతాలు, అడవులు, వంటలు, సంస్కృతులు, నాట్యాలు, ఆచార వ్యవహారాలు, ఆధ్యాత్మిక కేంద్రాలకు ఆకర్షితులవుతూ ఇజ్రాయిల్, యూఎస్, యూకె, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ లాంటి దేశాల నుంచి పర్యాటకులు భారతానికి క్యూ కడుతున్నారు. తాజ్‌మహల్, చార్మినార్, రామోజీ ఫిలిం సిటీ, తిరుపతి, కుతుబ్ మినార్, సాంచీ స్తూపం, కేధారినాథ్, భద్రినాథ్, యమునోత్రి, గంగోత్రి, గోవా, అయోధ్య, వారణాసి, ఇండియా గేట్, గేట్‌వే ఆఫ్ ఇండియా, కేరళ ప్రకృతి అందాలు, గుజరాత్‌లో గాంధీ స్మారకాలు, ఖజురహో అందాలు, కన్హా లాంటి పార్కులు లాంటి అనేక ఆకర్షణీయ పర్యాటక ప్రదేశాలకు విదేశీయులు రావడం అనాదిగా కొనసాగుతూ వస్తున్నది. దేశంలోనే దాదాపు 8 శాతం ఉద్యోగాలు (దాదాపు 40 మిలియన్లు) భారత పర్యాటకరంగంలో కల్పించబడ్డాయి. పర్యాటక రంగంతో పేదరిక నిర్మూలన, ఆర్థిక ప్రగతి, సుస్థిరాభివృద్ధి, దేశ ప్రతిష్ట పెరగడం, సామాజిక వికాసం ముడిపడి ఉంటాయి.

పర్యాటకంతో రోడ్డు/రైలు రవాణాలు, హోటల్స్, వ్యాపారాలు, వీధి వ్యాపారాలు పెరుగుతాయి. భారత్‌లో 38 ప్రపంచ వారసత్వ కట్టడాలు, 137 విమానాశ్రయాలు (29 అంతర్జాతీయ) పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి.

పర్యాటక సూచీలో భారత్‌కు 54వ స్థానం దక్కింది. భారతానికి దాదాపు 168 దేశాల పర్యాటకులు వస్తున్నారు.

**తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక కేంద్రాలు:**

తెలంగాణ రాష్ట్రంలో దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జ్, కుతుబ్ షాహీ టోంబ్స్, వరంగల్ వేయి స్తంభాల గుడి, ఏకశిలా నగరం, భువనగిరిలా కోట, యాదాద్రి, వేములవాడ, జోగులాంబ, చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, నాగార్జున సాగర్, బొగత/కుంతలా వాటర్ ఫాల్స్, బాసర, లక్నవరం, రామప్ప, రామోజీ ఫిలిమ్ సిటీ, మక్కా మసీదు, చౌమల్లా ప్యాలేస్, గోల్కొండ కోట, భద్రాద్రి, మెదక్ చర్చ్ లాంటి పర్యాటక కేంద్రాలు ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో తిరుమల, శ్రీశైలం, శ్రీ కాళహస్తీ, అరకు, విశాఖ బీచ్‌లు, బుర్రా గుహలు, విజయవాడ కనకదుర్గ, హార్సిలీ హిల్స్, పాపికొండలు, కోనసీమ ప్రకృతి అందాలు, సింహాచలం, పుట్టపర్తి, అన్నవరం, మంత్రాలయం, మహానంది, అలివేలు మంగ, వన్య ప్రాణి సంపదలు లాంటి పర్యాటక కేంద్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

దేశ పరువు ప్రతిష్టలను ఇనుమడింపజేస్తూనే భారతీయ జెండాను ఎగురవేస్తూ, ఆర్థికాభివృద్ధిలో ప్రధాన భాగస్వామ్యం తీసుకోవడం ద్వారా పర్యాటకాభివృద్ధి చేయడం మన ప్రస్తుత కర్తవ్యం అని నమ్ముదాం. టూరిజంతో ట్రావెలింగ్ కూడా విడదీయరాని సంబంధాన్ని కలిగి ఉంటుందని గమనించి ముందడుగు వేస్తూ పర్యాటకాన్ని ప్రగతికి ఇంధనంగా వాడుకుందాం.

(25 జనవరి "జాతీయ పర్యాటక దినం" సందర్భంగా)

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి, 99497 00037

## బాలకార్మికులచే పని చేయించడం నేరం



సంగారెడ్డి, జనవరి 24 (నేటినిజం ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా ఫసల్వాది గ్రామంలో గల ఎమ్మెన్నార్ నగర్ సమీపంలో ఉన్న ఇటుక బట్టిలో బాల కార్మికులు పనిచేస్తున్నారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంగారెడ్డి తహశీల్దార్ , అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ జహీరాబాద్, సిడిపిఓ సంగారెడ్డి, సిఐ సంగారెడ్డి లు సంబంధిత ఇటుకబట్టిని ఆకస్మిక తనిఖీ చేసి ఆరుగురు బాల కార్మికులను గుర్తించారు. ఇటుక బట్టి యజమానిపై సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, బాల కార్మికుల తల్లిదండ్రుల కోరిక మేరకు వారి సొంత జిల్లా అయిన బోలంగీర్ జిల్లా, ఒడిస్సా రాష్ట్రానికి తరలించారు. ఇటుక బట్టి బాల కార్మికులచే ఎవరైనా పని చేయించినా, బాల కార్మికుల చట్టాలను ఉల్లంఘించినను, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు జారీ చేశారు.

# శ్రీరామ దివ్యవైభవం కవితా సంపుటి ఆవిష్కరణ

అయోధ్యలో జరగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని శ్రీగీతా ఫౌండేషన్, లక్ష్యసాధన ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం త్యాగరాయ గానసభలో వందమంది కవుల కవితా సంపుటి శ్రీరామ దివ్యవైభవం ఆవిష్కరణ సభ నిర్వహించారు. సాహితీవేత్త డా॥జయరాములు ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడుతూ మోదీ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగడం అభినందనీయమని అన్నారు. నేడు ఆవిష్కృతమైన సభాధ్యక్షత వహించిన రామకృష్ణ చంద్రమౌళి తెలిపారు. మార్చి చివరి వారంలో ఆయోధ్యలో 1000 మంది కవులతో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలుగుభాషా చైతన్య సమితి అధ్యక్షుడు పి. బడేసాబ్ తెలిపారు. రాజు, యోగేష్‌ప్రభు, బద్రీనాథ్, సీపీరెడ్డి, అంజనికుమారి, జేవీ కుమార్, ప్రవీణ్, రాధాకుసుమ, సోమయాజుల ప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు.



మంగళవారం కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ప్రముఖ ఆచార్య అనుమాండ్ల భూమయ్య రచించిన అప్పాజోస్యుల పద్యావలోకనం ఆవిష్కరణ–అంకితోత్సవంలో మద్దాళి రఘురాం, అనుమాండ్ల భూమయ్య, శ్రీమన్నారాయణ మూర్తి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య కొలకలూరి ఇనాక్, బుర్రా వెంకటేశం, డా॥ ఏలూరి మురళీధరరావు, అప్పాజోస్యుల సత్యనారాయణ


## నాగన్న పదాలు

నిలువదుర ఈ ఘరం
చేయ బోకుర హటం
నీవు చేరర మఠం
ఓరి! నాగన్న.

పండగ చేరె దరికి
చెల్లె కట్టె రాఖీ
నేను సదా బాకి
ఓరి! నాగన్న.

పనిలో అహంకార
గుండెలో మమకారం
"మనిషి"కి శ్రీకారం.
ఓరి! నాగన్న.

మామిడి కాయ చెక్కు
వక్క కాయల తొక్కు
అన్నంల కలిపి మెక్కు
ఓరి! నాగన్న



-నెమలికొండ నాగేశ్వర్ రావు 8688553470

## హిమాలయం !

ప్రకృతిమాత ఒడిలో విత్తన మనుగడకు
కాసింత మట్టి , నీరు , సూర్యరశ్మిలతోఉన్న
విడదీయలేని అవినాభావ సంబంధానికి
జీవితకాలం ఒకమొక్క ముడిపడి ఉన్నట్లే ,
కలకాలం నిలిచే మానవ సంబంధాలకు ,
కలతలేని నిష్కల్మషమైన అనుబంధాలకు
అభిమానం , ప్రేమ , నమ్మకాల పునాదులు !
నిజాయితీ ధైర్యమే ఆక్సిజన్ కేంద్రమైనప్పుడు
గుండెలోతున్న నాలుగు
కవాటాలు జీవనదులే .
అవసరానికి పుట్టిన ప్రేమ నీటిపై రాతైనప్పుడు
స్వార్ధానికి పూసిన పువ్వులన్ని ఎండమావులే .
ఎంతగొప్ప మనోవైద్యుడైనా , మహామేధావైనా
నిక్కచ్చి నిర్వచనమివ్వలేనంత గొప్పది నమ్మకం !
ప్రకృతిలో మానవ మనుగడకిదే హిమాలయం !



- డా. డి. రాజేశ్ 9440460490

# అంతర్మథనంలోనే కవిత్వం ఆవిష్కరింప బడుతుంది

**-తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కార గ్రహీత డా.కాంచనపల్లి**



అంతర్మథనంలోనే కవిత్వం ఆవిష్కరింప బడుతుందని, కవి ప్రతిభాపాటవాలు, ప్రజ్ఞా విశేషాలు పెట్టిన శీర్షికలు తెలియజేస్తాయని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహిత్య పురస్కార గ్రహీత డా.కాంచనపల్లి గోవర్ధన రాజు అన్నారు.జనవరి 12, శుక్రవారం రోజున కరీంనగర్ జిల్లాలోని ఫిలిం భవన్ లో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సభలో లేదాళ్ళ రాజేశ్వరరావు రచించిన అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి కవితా సంపుటిని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కవితా సంపుటిలో కవితలు చదువుతుంటే ఎదురుగా దృశ్యీకరణ చెందుతున్న అనుభూతి కలుగుతుందని, సామాజిక, ఆధ్యాత్మిక,అమూర్త చింతనతో కూడిన కవితలున్నాయని, సామాన్యమైన వస్తువులకు గొప్ప స్థానాన్ని ఆపాదించారని అన్నారు.సమాచారంతో పాటు కళాత్మకత, సామాజికత, తాత్వికతలను చేరిస్తేనే కవిత్వం నిలుస్తుందని అన్నారు.విశిష్ట అతిథులుగా విచ్చేసిన అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ చక్కని చిక్కని కవిత్వానికి చిరునామా లేదాళ్ళ రాజేశ్వరరావు అన్నారు.మంచి ఎత్తుగడ,కొనసాగింపు,చక్కని ముగింపులతో కవితలను లేదాళ్ళ రాజేశ్వరరావు తీర్చిదిద్దారని దాస్యం సేనాధిపతి అభినందించారు. శీర్షికలు , వ్యక్తీకరణలో నిపుణత్వం కవితల్లో అగుపిస్తాయని సంగనభట్ల చిన్న రామకిష్టయ్య అన్నారు.ప్రత్యేక అతిథి నూటెంకి రవీంద్ర మాట్లాడుతూ కొత్తగా కవిత్వం రాసేవారికి ఈ పుస్తకం చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు.అన్నాడి గజేందర్ రెడ్డి సమీక్ష చేసిన ఈ కార్యక్రమంలో తడిగొప్పుల కుమారస్వామి,వి.రాము,ఇటిక్యాల సంపత్‌కుమార్,గాజోజు నాగభూషణం,కూకట్ల తిరుపతి,అనంతాచార్య, సి.వి.కుమార్,దామెరకుంట శంకరయ్య,యుగంధర్, శ్రీనివాస్ రెడ్డి,దాసరి వెంకటేశ్వర్లు,పెంచాల రంగారావు , మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

## పద్య శతకాలకై ఆహ్వానం

శత శతక సుధానిధి పేరుతో వంద శతకాలను సమీక్షల ద్వారా పరిచయం చేస్తూ ఒక మహత్తరమైన గ్రంథాన్ని వెలువరించాలని భవాని సాహిత్య వేదిక కరీంనగర్ సంస్థ నిర్ణయించింది.ఈ సందర్భంగా శతకాలు రచించిన కవులు మీ శతకాలను సమీక్షించుటకు ఎలాంటి అభ్యంతరం లేదనే హామీ పత్రంతో పాటు మీ శతకాలు రెండు పుస్తకాలను జనవరి 31 లోపు డా.వైరాగ్యం ప్రభాకర్ ఇంటి నెంబర్ 2-102 సీతారాంపూర్ కరీంనగర్, తెలంగాణ 505001 చరవాణి: 9014559059 పంపగలరు.


# అనగనగా "మా బడి పిల్లల కథలు" పుస్తకావిష్కరణ

హైదరాబాద్, జనవరి 24:(నేటినిజం ప్రతినిధి) ఈనెల 28 మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా ప్రజా పరిషత్ మీటింగ్ హాల్ కరీంనగర్ నందు పొన్నం ప్రభాకర్ బిసి శాఖ మరియు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి వర్యులు చేతుల మీదుగా పుస్తకావిష్కరణ ఉంటుంది.

84 మంది విద్యార్థులు 84 కథలతో అందమైన కవర్ పేజీతో సామాజిక ఆర్థిక రాజకీయ నైతిక విలువలతో కూడిన అద్భుతమైన కథలు సందర్భానికి అనుకూలంగా సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉండే కథలుగా ఈ కథలను పేర్కొనవచ్చు.

విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మలు, నానమ్మలు బంధుమిత్రుల ద్వారా విద్యార్థులు సేకరించి రాయబడినటువంటి కథ పుస్తకం ఇది.ఈ కథ పుస్తకానికి కథలు సేకరించి కథా సంకలనంగా తీసుకువచ్చి, ప్రచురించి సంపాదకులుగా వ్యవహరించిన వారు శ్రీ మాడుగుల రాములు తెలుగు ఉపాధ్యాయుడు.

## కణిక



సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక

# 'బుధవారం బాద్షా'

అడ్మిన్: రమాదేవి కులకర్ణి 8985613123



నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ

(ప్రథమ)

### ఆనందాల కనుదోయి

ఓ ముద్దు మురిపాల బాలభానుడా!
ఆహా ఆరమగ్గిన ఎర్రని పండులా!.
చుక్కలు సురలోకం చంద్రుడు
ఆకాశనీ తన విలాస నివాసమే
కొండకోననీతా తన చిద్విలాసం
ఓహో మనో రంజిత సుకుమారా!.
ఎంత చూడ చక్కగా నున్నావో
చిన్మయానంద స్వరూపా
నే పైకెగసెగసి చెయ్యందుకోనా
నిను చెంగల్వ పూబంతిలా!.
నా కొప్పులో తురమనా కొమరప్పగా
ఆహా నీకు నాతో దోబూచు లాట
పసిపాపల్లే పరవశాల ధునివై
హాయిగొల్పు కేరింతల ధ్వనివై.
చూడంగంద మీ సుందరాల తల్పం
అత్యద్భుతాల ఆమనీ అవని తలం
అలాగే చూస్తూ ఉండిపోవాలని
హాయి సమీరంలో ఊయ లూగనా.
మంద గమనవై నర్తించనా
కోయిలనై రాగాలు తీయనా
జల కన్నియనై ఎగిసి పోవానా
నిన్ను చూస్తూ కదలక కనురెప్ప వెయ్యక.
చెలువం మీరగా సజీవ శిల్పానయ్యి
అబ్బురంతో నుండి పోనా అలా అలా!
తేలిపోనా గాలిలో
చలో మంటు హలా హలా!!.

-విజయ కుమారి 9100634635

### చైతన్య కిరణాలు

బోసి నవ్వుల బుజ్జాయి లా..
పుడమిపై
స్వచ్ఛమైన చిరునవ్వులను
పూయించుటకై
అలసిన మేనులపై
గోమాత స్పర్శకై పరుగు తీసే
లేదూడ వోలె అరుణ వర్ణంతో
ముస్తాబై బయలు దేరుతాయి
అరుణ కిరణాలు.
రాతిరంతా భానుడు ఏ ధ్యానంలో
మునిగి తేలుతాడో గానో..
లోకకళ్యాణమే ధ్యేయమన్నట్టు
తన దేహాన్నే తూణీరంగా మార్చుకుని
చైతన్యాన్ని నింపిన
కిరణాల వాన కురిపిస్తాడు..
అలసిన జవసత్వాలకి ఊపిరి పోసి
వర్తమాన ఆశల వృక్షాలకి
లేలేత మొగ్గలను తొడుగుతాడు..
కనురెప్పల మాటున్న విహరించే
అందమైన జీవిత కలలు
విచ్ఛిన్నమవ్వకుండా
భవిష్యచిత్రాలను సుందరంగా
చిత్రించుకునే శక్తిని ప్రసాదిస్తాడు...
భూతకాలం మిగిల్చిన గాయాలకు
వర్తమాన శకటమెక్కించి,
ధైర్యలేపనం హృదయానికి పూస్తాడు...
తన చూపుల తీక్షణతతో
ప్రకృతిలో ఎన్నో ఆటలు ఆడించి
గెలుపోటములు శాశ్వతము కాదని
సృష్టి కాన్వాస్ పై
ప్రదర్శించే దర్శకుడు..

-శ్రీదేవి సురేష్ కుసుమంచి

## మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం

విశాంత కవిత్వం



నిర్వహణ: -వ్యవస్థాపక రాజారావు సూర్యప్రకాశ్ రావు 9441046639

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాం. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాం. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి, మెరుగు పరుచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1051వ రోజు 'కాకి' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా సమర్పిస్తున్నాం. -సంపాదకులు

### చూసి నేర్చుకున్నావు 'కావు'

నీవు చెప్పేవి నిజా లెప్పుడు 'కావు'
జీవితంలో నన్నెప్పుడు నమ్మినావు 'కావు'
ప్రాణాలు ఎప్పుడు శాశ్వతాలు 'కావు'
సంపాదనలన్ని ఏవి నీవెంట వచ్చేవి 'కావు'.
నేను చెప్పింది ఎప్పుడు విన్నావు 'కావు'
నానుండి ఏది నేర్చు కున్నావు 'కావు'
నీ మొండి వాదన విడిచావు 'కావు '
కాకులమైన మమ్ము మంచిగా చూసావు 'కావు'.
పది మంది కష్టాలు పంచు కున్నావు 'కావు'
ఎప్పుడు వెనుకకు తిరిగి చూసినావు 'కావు'
బీద వాళ్ళ నెప్పుడు ఆదుకున్నావు 'కావు'
అందరిపై ఈర్ష్యా ద్వేషాలు
చంపుకున్నావు'కావు '.
చెడు సహవాసం తగ్గించుకున్నావు 'కావు '
స్వార్థాన్ని విడిచి మంచిని
పెంచుకున్నావు'కావు'
అసూయ ద్వేషాలు చనీపుకున్నావు 'కావు'
చెడు చూపు అందరిపై
తగ్గించుకున్నావు' కావు '.
ఎంగిలి చేత చేయి విదిలినీచినావు 'కావు '
దయతో బంధువులకు
పట్టెడన్నం పెట్టినావు 'కావు'
నీ పెద్దలు చనిపోతే వారికి
పిండాలు పెట్టినావు 'కావు'
మేం 'కావు' అంటే
మాచుట్టు ఎప్పుడూ
కాకి బలగమే వుంటుంది చూడు
కాకులం మేం
మమ్మల్ని చూసి
నేర్చుకున్నావు 'కావు'.

– కందుకూరి మనోహర్

### వాయసం

కావు కావని అరిచే వాయసం
శనిదేవుని ప్రియ వాహనం
కాకి అరిచిందంటే కావు కావుమని
నమ్ముతారు బంధువులొస్తారని
కాకికున్నది యముడిచ్చిన వరం
అందుకే దాని దరిచేరదు రోగం
కాకి తిన్నదంటే పెట్టిన పిండం
నరకంలోని పెద్దలకు మోక్షం
పిండప్రదానంలో కాకితోనే అవసరం.
కాకికున్నది నీతి నియమం
బ్రహ్మ ముహూర్తాన స్నానం
పొద్దుపోయిందంటే ముట్టదు ఆహారం
ప్రకృతి వైపరీత్యాలకు అదిచ్చు సంకేతం
గ్రహణ సమయాన కాకి వీడదు నివాసం
చేస్తాయి స్నానం- విడిచాక గ్రహణం
కాకులదెప్పుడూ సమష్టి భోజనం
అమిత గోప్యం, కాకుల మిధునం
అవి ఆరగించినా పండ్లను సొంతం
అంతటా విసర్జితం వాటి విత్తనం
చెట్ల వృద్ధిలో తనవంతు సాయం
కొన్ని తరాలను గుర్తించే
గుణం కాకి సొంతం.
కాకికి గుడ్లగూబకు అనాదిగా వైరం
ఛేదిస్తే గుడ్లగూబల అంతరంగం
కాకి చేరుతుంది గుడ్లగూబల సమూహం
చేసి తాను వెలి అయినట్లు నటనం
దాని నామధేయం కాకోలూకీయం
అంతటి జ్ఞానం కాకుల సొంతం
అందుకే కాకికి కాలజ్ఞానన్న బిరుదం.

–జె.వి.కుమార్ చేపూరి

### ఐకమత్య పక్షి

కాకి ఐకమత్యానికి ప్రతీక
జాతి కి పిలుపు నిచ్చి
ఆహారం పంచే
ఉత్తమ గుణమున్నపక్షి
పెద్దల పేరుతో దీనికి గౌరవం
గ్రహాల్లో శని బాధలు తగ్గడానికి
ఒక అద్భుత వరం
నల్లగా ఉన్నా ఒంటి కన్నుతో
ఒక వైపు చూపు ఉన్నా
సమాజ హితం కోరే పక్షి
బంధువుల రాక
తన అరుపుతో జోస్యం
విచిత్ర విలువల పక్షి
సొంత జాతి సొంత పిల్లలు
భావనకే మారు పేరుగా
జీవిత గమనానికి మూలం
కాకాసురుడు గా ప్రసిద్ధి పేరు
పురాణ కాల కథలు
మానవ జీవితంలో
ముఖ్య పక్షి
సహకార శక్తి చూపే పక్షి.

–నారుమంచి వాణీ ప్రభాకరి

### పురాణ పక్షి

కాకి నల్లన
మనసు తెల్లన
గుడ్లని పొదగని పక్షి
కోకిల గూట్లో పెట్టేస్తే
అమాయక కోకిల
తన గుడ్లతో పాటు పొదిగి
పిల్లల్ని చేస్తుంది
కావు కావు అరిచే పక్షి
కర్ణ కఠోర అరుపులు
అందర్ని నిద్ర లేపే అరుపులు
పురాణాల్లో స్థానమున్న పక్షి
కాకమ్మ కథలు
మెదడుకి పదును
శనిదేవుని వాహనం
వరాలు పొందిన వాయసం
ఏకాక్షి అయినా
రెండు పక్కలా చూడగల
నిశిత దృష్టి ఉండే వాయసం
పితృ కార్యాల్లో ప్రముఖ స్థానం
పిండం కాకి తింటేనే
మృతులకి మోక్షమనే నమ్మకం.

–మోటూరి శాంతకుమారి

### ఓ కాకి

సూర్యోదయ కిరణాలు
కాకి కావు కావు
అనే అరుపులు
మనకు నిద్ర లేపటానికి
సంకేతాలు.
ఇంటి కప్పు పై
కాకి అరుపులు
చుట్టాలు వస్తారు అనే
చిహ్నం.
పిండ ప్రదానం లో కాకి
పాత్ర ముఖ్యమైనది
బంధానికి గౌరవం
తల్లి పిల్లలు
ప్రేమ అనురాగం
కాకి పిల్ల కాకికి ముద్దనే
పెద్దలు చెప్పే
సామెత
లోకులు కాకులు
అనే పెద్దలు చెప్పే మాట
కాకి నలుపు రంగు
కానీ చేసే పని అద్భుతం.

– రజని కులకర్ణి

### కాకి-సంఘజీవి

కుళ్ళినట్టి చెడ్డ కూడు కాకులు తిన్న
వెయ్యి వత్సరములు వెలగబెట్టు
జంగుపుడ్డు తినుచు జనులట్లు బ్రతికేర
మంచి కూడుదిన్న మంచిదవని.
కావు కావుమనుచు కాకి అరుస్తుంది
కడుపులోన మండికాదు కాదు
కంట పడిన మెతుకు కలిసి తినగనులే
సోషలిజము చాటు సోపతి గను.

– కనకయ్య మల్లముల

### ఆదర్శ పక్షి

రంగు నలుపు
నడక మోటు
అరుపు బెరుకు
ఒక్కటీ రాదు
తనవారిని వదలదు
శని వాహనం
యముడికి రూపం
ఏకాక్షి...
అయినా సర్వాక్షి
పిండ భక్షణం
నరక లోకం వారికి
సంతర్పణం
పితృకర్మలలో
కాకి పాత్ర ప్రధానం
యముడు ఒసంగిన
వరాలు
నిజమైన పారిశుద్ధ
కార్మికురాలు
మానవ సంఘానికి
హితకారిణి
జత కడితే వదలని
బంధం
ఆదర్శ దాంపత్యం
కాకి అంటే దడుసు
ఇంట్లోకి వస్తే ఇల్లు
విడుచు
శకునం మూర్ఖం
పక్షి జీవనం అందరికి
ఆదర్శం.

–జె.నరసింహారావు

### రూపుకు నల్లనిది

రూపానికి నల్లనిది
మనస్సు చాలా చల్లనిది
కాకి–
ఏకాకి కాదది సంఘజీవి
తన కడుపునే నింపుకోదెప్పుడు
దొరికింది నల్గురితో పంపకం
కంఠంలో మృదుత్వం లేకున్నా
మనస్సులో ఎనలేని కనికరం
ఇతర పక్షి పిల్లలకు జన్మ ప్రాప్తించు
ఇంటిపై కాకి అరుస్తుందంటే
బంధువుల రాకకు గుర్తందురు
ఎంగిలి చేతితో కాకిని కొట్టని
పిసినారికి సైతం పిండం ముట్టి
ముక్తి ప్రసాదిస్తుంది కదా కాకి
ఎంత ఆదర్శ జీవి కాకి
మనిషి ఊహలకు అందనిది
కాకి బలగమంటారు
కాకి పిల్ల కాకికి ముద్దంటారు
కర్రె కాకిలా అని పోలిక
ఎంగిలి చేతితో కాకిని కొట్టరు
శుభకార్యాలకు కాకి
ఎదురు రావడం అపశకునమని
ఆరోపణ
అశుభ కార్యక్రమంలో
కాకిలోనే దైవ దర్శనం
వ్యర్థ పదార్థాలను భుజించి
పర్యావరణాన్ని రక్షించే
కాకి గురించి ఇంకా చెప్పాలనుంది

### కాకిగోల కల్ల కాదు

ఆ.వె. కావుకావు మనుచు కరకుగా నఱయుచు
కావవేవి మనకు ఖచ్చిత మని
రావవేవి మనకు రక్షణ నివ్వవు
చింతయేల? యనెను చిన్న కాకి!.
ఆ.వె. లోకమంత దిరిగి, లోకువ యైనను
ఉన్నమాట చెప్పె కన్న వినుము
కావు, రావు ధనము కల్లలు యనుచును
గోల పెట్టు కాకి యేల? వినవు!.

–జక్కని గంగాధర్


కాకమ్మ కబుర్లు అంటారేమోననే
భయం మాత్రం మిగిలి ఉంది
కాకిలా సమూహ జీవితం మంచిది
ఏకాకివై పడే మనోవేదన చెడ్డది
అందరిలో కలిసి ఉండాలి
ఆనందంగా జీవించాలి
స్వార్థం విడనాడాలి
పరోపకారం పరమావధి కావాలి
కాట్లకుక్కల్లా కలహాలు వద్దు
కాకుల్లా కలిసి ఉండడం ముద్దు.


–గుండం మోహన్ రెడ్డి

### ఆదర్శ మాత

కాకి నలుపు
నాణ్యమైన నలుపు
బాహ్యరూపం కాదు
అంతర రూపం చూడు
ఏకాక్షి అయితే నేమి
సర్వం చూడగల సమర్థురాలు
కంఠస్వరం ఎలా ఉంటేనేం
ఆదర్శ గుణ సంపన్న
భర్తతో గుట్టుగా
సంసారం చేసుకునే ఆదర్శ పత్ని
ఆహారం చూసి
తను తినకుండా తన వారందరినీ
పిలిచి ఆరగించే అన్నపూర్ణ
ఎంగిలి మెతుకులు తిని
ఇతర జంతువులు రాకుండా
శుభ్రపరిచే పారిశుద్ధ్య శ్రామికురాలు
కోకిల తన గూటిలో
తనకు తెలియకుండా
పెట్టిన గుడ్లను
తను పొదిగి కోకిల
కూతకూశాక తెలిసినా
తన పిల్లలతో పాటు
పెంచి పెంచి
పెద్ద చేసే ఆదర్శమాత
పిండ ప్రదానంలో
ప్రముఖ పాత్ర కాకిదే
దానికోసం
అందరూ ఎదురుచూపులే
లోకులు పలుగాకులు అని
కాకి పిల్ల కాకికి ముద్దు అని
ఇంటిపై నెక్కి కాకి అరుస్తుంది
చుట్టాలొస్తారని..
ఇలా ఎన్నో లోకోక్తులూ నమ్మకాలూ
అందుకేనేమో శనికి వాహనమైనది.

– మన్నె లలిత




Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.